PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 45 సంచిక : 53 | విజయవాడ, మంగళవారం 23 సెప్టెంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Tuesday 23 September 2025 | Rs

పదమూడు గంటల పని విధానం వద్దు
- రాష్ట్ర వ్యాప్తంగా కార్మికుల ఆందోళనలు
- కార్మిక చట్ట సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాల్సిందేనని డిమాండ్

3

రికార్డు పుటల్లో అభిషేక్ శర్మ
- 20 ఇన్నింగ్స్, 331 బంతుల్లోనే 50 సిక్సర్లు కొట్టిన తొలి బ్యాటర్‌గా గుర్తింపు

8

డిజిటల్ పరిపాలన
సాంకేతికతతోనే ప్రజలకు పాలన మరింత చేరువ
- 28వ జాతీయ ఇ-గవర్నెన్స్ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు
- డిజిటల్ ఎపి సంచిక ఆవిష్కరణ

జాతీయ ఇ-గవర్నెన్సు సదస్సులో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో
ప్రభుత్వ పరిపాలనలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అత్యంత ముఖ్యమైన అంశమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. సాంకేతికతతోనే ప్రజలకు పాలనను మరింత చేరువ చేసే అవకాశం ఉంటుందన్నారు. కేంద్ర ఐటి, సమాచార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విశాఖలోని నోవాటల్ హోటల్‌లో నిర్వహించిన జాతీయ ఇ-గవర్నెన్సు సభకు తొలి రోజు సోమవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 'సివిల్ సర్వీసెస్ - డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్' థీమ్‌తో జరుగుతున్న ఈ సదస్సులో చంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల ద్వారా అందే పౌర సేవలను మరింత సమర్థంగా నిర్వహించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ లాంటి సాంకేతికత కీలకమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న ఐటి, ఇ-గవర్నెన్సు అంశాలతో పాలనలో మార్పులు వచ్చాయని వివరించారు. సాంకేతికతను అందిపుచ్చుకుని గతంలోనే ఉమ్మడి ఎపిలో ఇ-సేవ, మీ-సేవ ద్వారా ప్రభుత్వ శాఖలు అందించే పౌర సేవలను ప్రజల దగ్గరకు తీసుకెళ్లామన్నారు. ఇ-ఫైల్స్, ఇ-కేబినెట్ లాంటి అంశాలతో వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు ఆస్కారం ఏర్పడిందని తెలిపారు. ఈ వ్యవస్థలు అమలు చేసే సమయంలో సైబర్ సెక్యూరిటీ కూడా అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ఐటితో వచ్చిన విస్తృత ప్రయోజనాలను అందిపుచ్చుకోగలుగుతున్నా మన్నారు. ఈ ప్రక్రియను మరింతగా ముందుకు తీసుకెళ్లేందుకు మనమిత్ర వాట్సాప్ గవర్నెన్సును అమలు చేస్తున్నామని వివరించారు. మొత్తం 751 పౌర సేవలను వాట్సాప్ ద్వారా పౌరులకు అందిస్తూ పాలనను వారి మొబైల్ ఫోన్ల వరకూ తీసుకెళ్లామన్నారు.

సంజీవని ప్రాజెక్టు దేశవ్యాప్తంగా అమలుకు అవకాశం
రాష్ట్రంలో వైద్య సేవలను టెక్నాలజీతో అనుసంధానం చేసే సంజీవని ప్రాజెక్టు చేపట్టామని ముఖ్యమంత్రి వెల్లడించారు. బిల్ గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి డిజిటల్ హెల్త్ రికార్డులను రూపొందిస్తున్నామని, త్వరలో ఈ వ్యవస్థను దేశం మొత్తం అమలు చేసేందుకు అస్కారం ఉందని తెలిపారు. రాష్ట్రంలో ఐబిఎం, టిసిఎస్, ఎల్ అండ్ టి సంస్థలతో కలిసి క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. క్వాంటం కంప్యూటర్ సేవలను ప్రభుత్వాలు, విద్య, వైద్య సంస్థలు వినియోగించుకునే అవకాశం ఉందని తెలిపారు. క్వాంటం వ్యాలీతో ఎకో సిస్టం ఏర్పాటవుతుందన్నారు. క్వాంటం కంప్యూటర్లు, పరికరాల తయారీ సంస్థలు కూడా పెట్టుబడులతో ముందుకు వచ్చాయని తెలిపారు. టెక్నాలజీపరంగా సేవలు, ఉద్యోగాలు, ఉత్పాదన తదితర రంగాలు కూడా వేగంగా మారుతున్నాయని, ఈ దృష్ట్యా వచ్చే పదేళ్లు మన దేశానికి అత్యంత కీలకమని అన్నారు. ప్రధాని మోడీ ఇచ్చిన స్వదేశీ ఉత్పత్తుల నినాదాన్ని స్వాగతిస్తున్నట్టు తెలిపారు. దానికి అనుగుణంగా దేశంలో తయారయ్యే ఉత్పత్తులు గ్లోబల్ బ్రాండ్స్‌గా మారాలన్నారు. సమీప భవిష్యత్తులో స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్ సిటీ, మెడ్ టెక్ పార్కుల ద్వారా జాతీయ అభివృద్ధిలో రాష్ట్రం ప్రధాన భాగస్వామి అవుతుందని పేర్కొన్నారు. అనంతరం డిజిటల్ ఎపి సంచికను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

సదస్సులో మాట్లాడుతున్న కేంద్రమంత్రి జితేంద్ర

దేశాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర..
కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉత్తమ పద్ధతులను మార్పిడి చేసుకోవడానికి ఇ-గవర్నెన్స్ సమావేశం ఒక వేదికగా పనిచేస్తుందన్నారు. అమరావతిలో క్వాంటం డేటా సెంటర్, శ్రీహరికోటలో అదనపు స్పేస్ లాంచ్ ప్యాడ్ వంటి రాబోయే ప్రాజెక్టులను సూచిస్తూ, భారతదేశావృద్ధిలో ఆంధ్రప్రదేశ్ ప్రముఖ పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఇ-ఆఫీస్ ప్లాట్‌ఫాం గణనీయంగా విస్తరించిందని, ఫైల్ కదలిక స్థాయిలను తగ్గించడం, సమర్థవంతమైన నిర్ణయం తీసుకోవడాన్ని ప్రారంభించడం ద్వారా సెంట్రల్ సెక్రటేరియట్‌ను వేగవంతం చేసిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, డిఎఆర్‌పిజి సెక్రటరీ వి.శ్రీనివాస్, ఎన్‌ఐసి అదనపు కార్యదర్శి అభిషేక్ సింగ్, డిఎఆర్‌పిజి అదనపు కార్యదర్శి పునీత్ యాదవ్, జాయింట్ సెక్రటరీ సరితా చౌహాన్, రాష్ట్ర ఐటి సెక్రటరీ కాటమనేని భాస్కర్, విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, విశాఖ ఎంపి శ్రీభరత్, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'పనిగంటల పెంపు'పై మండలిలో నిరసనలు
వ్యతిరేకించిన పిడిఎఫ్ • వైసిపి వాకౌట్ • బిల్లు ఆమోదం

పిడిఎఫ్ ఎంఎల్‌సి గోపిమూర్తి

వాకౌట్ అనంతరం మీడియాతో మాట్లాడుతున్న బొత్స

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పనిగంటల పెంపు బిల్లులపై శాసన మండలిలో నిరసనలు వెల్లువెత్తాయి. కార్మికుల చేత రోజుకు 13 గంటల వరకు పని చేయించుకోవడానికి యాజ మాన్యాలకు అవకాశం కల్పించే ఆంధ్రప్రదేశ్ దుకాణాలు, సంస్థల చట్టం-1988 సవరణ బిల్లును శాసనమండలిలో కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం ప్రవేశపెట్టారు. ఈ బిల్లును పిడిఎఫ్ వ్యతిరేకించింది. బిల్లుపై నిరసన తెలిపిన వైసిపి కీలకమైన ఓటింగ్ సమయంలో అడ్డుకునే అవకాశం ఉన్నప్పటికీ వాకౌట్ చేసింది. దీంతో పిడిఎఫ్ వ్యతిరేకించినప్పటికీ మండలిలో పనిగంటలపెంపు బిల్లుకు ఆమోద ముద్ర పడింది. అంతకుముందు మండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ కార్మికులు, శ్రామికులకు వ్యతిరేకమైన ఈ బిల్లును పున:పరిశీలించాలని కోరారు. అనాధిగా వస్తున్న 8 గంటల పనిని పెంచే ముందు కార్మికసంఘాలతో చర్చించారా? అని ఆయన ప్రశ్నించారు. ఈ బిల్లును వాయిదా వేసి ఇందులోని అంశాలపై చర్చించాలని తెలిపారు. వైసిపి సభ్యులు మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ వారానికి 48 గంటలపై స్పష్టత లేదని చెప్పారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ బిల్లు పెట్టుబడీదారి, కార్పొరేట్లకు అనుకూలమని చెప్పారు. కార్మికులు, శ్రమ జీవులకు వ్యతిరేకమైన బిల్లుగా దీనిని ఆయన పేర్కొన్నారు. అనేక పోరాటాల ద్వారా కార్మికులు 8 గంటల పనివిధానాన్ని సాధించుకున్నారని, దీనికోసం చికాగో నగరంలో అనేక మంది కార్మికులు ప్రాణాలు అర్పించారని తెలిపారు. ఆ స్ఫూర్తితోనే మేడే జరుపుకుంటున్నామని తెలిపారు. ఇప్పుడు 10 గంటల విధానాన్ని తీసుకురావడం, అవసరమయితే 13 గంటలు పని చేయించడానికి అవకాశం కల్పించడం కార్మికుల శ్రమను దోపిడీ చేయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలను రాత్రి షిప్టుల్లో పనిచేయించడం సరికాదన్నారు. పగటి సమయంలోనే మహిళలకు రక్షణ లేదన్నారు. భీమవరం రొయ్యల ఫ్యాక్టరీలో పనిచేస్తున్న మహిళలకు కనీస విరామం కూడా ఇవ్వకుండా యాజమాన్యాలు వెట్టిచాకిరీ చేయిస్తున్నాయని చెప్పారు. చివరకు మహిళలు డైపర్లతో పనిచేయిస్తున్నారని తెలిపారు. 8గంటల పనివిధానం ఉంటేనే ఇలా ఉందని, ఇప్పుడు 10 నుంచి 13 గంటలకు చేస్తే మరింత శ్రమ దోపిడి మరింత ఎక్కువ అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బిల్లును పున:సమీక్ష చేయాలని, 8 గంటలకు మాత్రమే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగానే ఈ బిల్లును తీసుకొచ్చినట్లు తెలిపారు. వారానికి 48 గంటలు పనిచేయాల్సి ఉందని, నాలుగు రోజుల పాటు 10 గంటలు పనిచేసి ఐదో రోజు 8గంటలు పనిచేస్తే సరిపోతుందన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మోషేనురాజు జోక్యం చేసుకుని మిగిలిన రెండు రోజులు సెలవు ఇస్తారా? యాజమాన్యం ఒప్పుకుంటుందా? ఈ అంశాన్ని చట్టంలో ఉందా? అని ప్రశ్నించారు.కాగా ఈ అంశాన్ని దాటవేసిన మంత్రి మహిళలకు సమానత్వం ఇవ్వడానికే ఈ బిల్లును తీసుకొస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో మహిళా కార్మికులు కేవలం 24శాతమే ఉన్నారని, ఈ బిల్లు వల్ల వారి సంఖ్య మిగతా 7లో

దసరా ఉత్సవాలు ప్రారంభం
- తొలిరోజు బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారం
- దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు, భారీగా యాత్రికులు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ
విజయవాడ కనక దుర్గమ్మ దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు బాలా త్రిపుర సుందరీ దేవిగా దుర్గమ్మను అలంకరించారు. దుర్గమ్మను పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు దర్శించుకున్నారు. మొదటి రోజు 47,418 మంది యాత్రికులు అమ్మవారిని దర్శించుకున్నట్లు సమాచారం. ఆలయానికి వచ్చిన మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్‌కు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, కమిషనర్ కె.రామచంద్ర మోహన్, ఇఒ శీనా నాయక్ స్వాగతం పలికారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దుర్గమ్మ చిత్రపటాలను, తీర్థ ప్రసాదాలను అంద జేశారు. మంత్రి ఆనంతోపాటు హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ తదితరులు దుర్గమ్మను దర్శించుకున్నారు. మీడియా పాయింట్ వద్ద మంత్రి ఆనం మాట్లాడుతూ.. పటిష్టమైన ఏర్పాట్లు చేయడంతో యాత్రికులు సజావుగా దుర్గ మ్మను దర్శించకుంటున్నారన్నారు. ప్రోటోకాల్ మిగతా 7లో

వామపక్షాలే ప్రత్యామ్నాయం
- ట్రంప్‌ది టారీఫ్‌ల ఉగ్రవాదం
- దేశ పాలకులు దానికి సమాధానం చెప్పటం లేదు
- సిపిఐ 25వ జాతీయ మహాసభలో ఎంఎ బేబీ

సిపిఐ జాతీయ మహాసభలో అభివాదం చేస్తున్న ఎంఎ బేబీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
వామపక్షాలు మాత్రమే దేశవ్యాప్తంగా నిజమైన ప్రత్యామ్నాయాన్ని అందించగలవని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ అన్నారు. చండీగఢ్‌లో జరుగుతున్న సిపిఐ 25వ జాతీయ మహాసభలో సోమవారం ఆయన పాల్గొన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి నగర్‌లోని అతుల్ కుమార్ అంజన్ ప్రాంగణంలో ప్రారంభమైన మహాసభకు వివిధ రాష్ట్రాల నుండి 800 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. ముందుగా విప్లవ వీరుడు భగత్ సింగ్ మేనల్లుడు ప్రొఫెసర్ జగ్మోహన్ సింగ్ జాతీయ జెండాను ఎగురవేశారు. సిపిఐ సీనియర్ నాయకుడు భూపిందర్ సంబార్ పార్టీ జెండాను ఎగురవేశారు. జలియన్‌వాలా బాగ్ స్మారక చిహ్నం తరహాలో నిర్మించిన అమరవీరుల స్థూపం వద్ద ప్రతినిధులు నివాళులర్పించారు. అనంతరం మహాసభ ప్రారంభకార్యక్రమంలో ఎంఎ బేబీ మాట్లాడుతూ కేరళలో ఇప్పటికే వామపక్ష ప్రత్యామ్నాయ పాలన సాగుతోందని, దీనిని దేశ వ్యాప్తంగా హైలెట్ చేయాలని అన్నారు.గత ఎన్నికల్లో కేరళలో వామపక్షాలు వరుసగా రెండోసారి అధికారంలోకి రావడంతో చరిత్ర సృష్టించాయన్నారు. కేరళ రాష్ట్రం ఏర్పడిన నవంబర్ 1 నాటికి, దేశంలో తీవ్ర పేదరికాన్ని నిర్మూలించిన ఏకైక రాష్ట్ర ఘనతను కేరళ అందుకోనుందని చెప్పారు. ఇప్పటికే సంపూర్ణ అక్షరాస్యత సాధించడంతో పాటు, తాజాగా డిజిటల్ అక్షరాస్యత సాధించిందని తెలిపారు. విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్రం ప్రైవేటీకరిస్తుంటే, దానికి భిన్నంగా కేరళలోని వామపక్ష ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుతోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కొట్టాయం-వెల్లూరులో పనిచేస్తున్న హిందుస్తాన్ న్యూస్‌పేపర్ లిమిటెడ్‌ను విక్రయించడానికి, ప్రైవేటీకరించడానికి ప్రయత్నించిందని, కానీ కేరళ ప్రభుత్వం దానిని కొనుగోలు చేసి కేరళ పేపర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ పేరుతో కార్యకలాపాలు ప్రారంభించిందని తెలిపారు. ఇప్పుడు ఆ కంపెనీ లాభాల్లో పనిచేస్తోందని, ఇదే కేరళ మోడల్ అని స్పష్టం చేశారు. వామపక్ష పార్టీలు, లౌకిక, ప్రజాస్వామ్య పార్టీలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం కేరళలో మాత్రమే ఉందని అన్నారు. కేరళలో వామపక్షాలు మాత్రమే అధికారంలో ఉన్నాయని, అక్కడ అధికారంలో ఉండటం ఒక రాజకీయ అద్భుతమని పేర్కొన్నారు. రాబోయే కాలంలో వామపక్ష ఐక్యతను మరింత ముందుకు తీసుకెళ్లాలని ఎంఎ బేబీ అన్నారు. వామపక్ష పార్టీల వర్గ, ప్రజా సంస్థలు కలిసి మరిన్ని పోరాటాలు చేపట్టాలని సూచించారు. దేశంలో వామపక్షాలు ఒకరోజు నిర్ణయాత్మక శక్తిగా మారుతాయని తనకు ఖచ్చితంగా నమ్మకం ఉందని ఎం బేబీ అన్నారు. మన బలాలు, బలహీనతలు తెలుసుకోవాలని సూచించారు. ఒకప్పుడు దేశాన్ని వలసవాద శక్తులకు ఉండి, దేశానికి ద్రోహం చేసిన వారు నేడు చరిత్రను వక్రీకరిస్తున్నారని విమర్శించారు. మహాత్మా గాంధీ హత్యలో పాత్రధారి అయిన సావర్కర్ మిగతా 7లో

ఛత్తీస్‌గడ్‌లో మరో ఎన్‌కౌంటర్
- ఇద్దరు మావోయిస్టులు మృతి

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో మరో ఎన్‌కౌంటర్ జరిగింది. సోమవారం ఉదయం జరిగిన ఎదురు కాల్పుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఇద్దరు మృతిచెందారు. మృతులను మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు కట్టా రామచంద్రారెడ్డి అలియాస్ రాజు, కడారి సత్యానారాయణ రెడ్డి అలియాస్ కోసాగా గుర్తించారు. ఘటనా స్థలిలో ఏకే 47, ఆయుధాలు, పేలుడు పదార్థాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌ను బస్తర్ ఐజీ సుందర్ రాజ్ ధ్రువీకరించారు. ఒక్కొక్కరి తలపై రూ.40లక్షల చొప్పున రివార్డు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి
రైతాంగాన్ని ఆదుకోవాలి
- క్వింటాలు ఉల్లికి రూ.3 వేలు, టమోటాకు రూ.2,500 మద్దతు ధర కల్పించాలి
- కర్నూలు, పత్తికొండ మార్కెట్ యార్డులను సందర్శించి రైతుల సమస్యలు తెలుసుకున్న వి శ్రీనివాసరావు

కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లిని పరిశీలిస్తున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్
ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని, క్వింటాలు ఉల్లికి రూ.3 వేలు, టమోటాకు రూ.2,500 చొప్పున మద్దతు ధర కల్పించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన తొలుత కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను సందర్శించి ఉల్లి రైతులతోనూ, ఆ తర్వాత పత్తికొండ మార్కెట్ యార్డును సందర్శించారు. ఆయా మార్కెట్ యార్డులకు వచ్చిన ఉల్లి, టమాటా పంటలను పరిశీలించారు. ఉల్లి, టమాటా రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని చంద్రబాబునాయుడు ప్రభుత్వం రైతులను ఆదుకోవడం లేదన్నారు. కర్నూలు జిల్లాలో ఉల్లి, టమోటా, పొగాకు సాగు చేసిన రైతులు గిట్టుబాటు ధరలేక తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తామని గత ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదన్నారు. రైతుల ఆందోళన మేరకు మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాలు ఉల్లిని రూ.1,200 చొప్పున కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, అయితే, నాలుగైదు రోజులు మాత్రమే ఆ ధరకు ఉల్లిని మిగతా 7లో

పైలెట్లను నిందించడం బాధ్యతారాహిత్యం
- ఎయిర్ ఇండియా ప్రమాదంపై సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎఎఐబి) ప్రాథమిక నివేదికను కేంద్ర ప్రభుత్వం 'సెలెక్టివ్'గా విడుదల చేయడాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టింది. విచారణ పూర్తికాకముందే పైలెట్లను నిందించడం 'బాధ్యతారాహిత్యం' అని విమర్శించింది. 'ప్రాథమిక విచారణ నివేదికను ఎంపిక చేసి, ముక్కలు ముక్కలుగా ప్రచురించడం దురదృష్టకరం. విచారణ పూర్తయ్యే వరకు, సంపూర్ణ గోప్యతను కాపాడుకోవడం ముఖ్యం' అని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ ప్రమాదంపై కోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర దర్యాప్తు జరపాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు విచారించింది. కేంద్ర ప్రభుత్వానికి, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ)లకు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. మాజీ పైలట్ అమిత్ సింగ్ నేతృత్వంలోని సేఫ్టీ మ్యాటర్స్ ఫౌండేషన్ ఈ పిటిషన్ దాఖలు చేసింది.

విద్వేషం కన్నా శాంతి మిన్న!
- విద్వేష ప్రపంచంలో శాంతి కోసం పిలుపిచ్చిన మైసూరు దసరా ఉత్సవాలు
- మైసూరులో ఉత్సవాలను ప్రారంభించించిన బాను ముష్తాక్

జ్యోతి వెలిగించి దసరా ఉత్సవాలను ప్రారంభిస్తున్న ముష్తాక్

మైసూరు : మైసూరు దసరా ఉత్సవాలు శాంతి సామరస్యతలకు పిలుపునిచ్చాయని అంతర్జాతీయ బుకర్ ప్రైజ్ విజేత, రచయిత్రి బాను ముష్తాక్ పేర్కొన్నారు. మైసూరు చాముండేశ్వరి ఆలయంలో సోమవారం దసరా ఉత్సవాలను బాను ముష్తాక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "సంస్కృతి మన హృదయాలకు వారధి వంటిది. ప్రేమను వ్యాప్తి చేస్తుంది, ద్వేషాన్ని కాదు. అందరినీ గౌరవించాలని ఈ భూమే నాకు నేర్పింది. ఒక పక్క ప్రపంచమంతా యుద్ధపంథాలో సాగుతుంటే, మరోపక్క మానవాళి విద్వేషాలతో, రక్తపాతాలతో రెచ్చగొట్టబడుతుంటే మైసూరు దసరా ఉత్సవాలు శాంతికి, సామరస్యతలకు స్పష్టంగా పిలుపునిచ్చాయి." అని పేర్కొన్నారు. కర్ణాటక ఉమ్మడి సంస్కృతికి ఈ ఉత్సవాలు ఒక చిహ్నం వంటివని ఆమె వ్యాఖ్యానించారు. 'స్త్రీత్వం అంటేనే మాతృ వ్యాత్సల్యం. అలాగే అన్యాయాన్ని ఎదిరించి పోరాడే శక్తి కూడా" అని ఆమె వ్యాఖ్యానించారు. మహిళలో శక్తికి ప్రతీక చాముండేశ్వరి అని ఆమె పేర్కొన్నారు. ఈ ఏడాది మైసూరు దసరా ఉత్సవాలను బాను ముష్తాక్‌తో ప్రారంభించాలన్న కర్ణాటక ప్రభుత్వ నిర్ణయంపై వివాదం చెలరేగింది. ప్రభుత్వ చర్యను ప్రశ్నిస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్ కూడా దాఖలైంది. దాన్ని అత్యున్నత న్యాయస్థానం కొట్టివేయడంతో బానుముష్తాక్ ఈ ఉత్సవాలను ప్రారంభించడానికి మార్గం సుగమమైంది. ఉత్సవాలను ప్రారంభించడానికి వచ్చిన ఆమె తొలుత చాముండేశ్వరి ఆలయాన్ని సందర్శించారు. ప్రార్థనలు చేశారు. ఆమెతో పాటు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా వున్నారు. మతపరమైన, సాంప్రదాయసిద్ధమైన ఆచారాలు, సాంప్రదాయాల మధ్య మైసూరులో ప్రఖ్యాతి చెందిన 11 రోజుల దసరా ఉత్సవాలు ఘనంగా మిగతా 7లో

నెలకు ఓ రోజు రైతుల వద్దకు..

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు అసెంబ్లీలో బాబు సూచన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రతి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నెలకు ఒక రోజు పొలం దగ్గరకు వెళ్లి రైతులతో మాట్లాడాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. వచ్చే అక్టోబరు నుండి ప్రతినెలా రైతుల దగ్గరకు వెళ్లి వారి సమస్యలు విని పరిష్కరిస్తామని, దీనికి అవసరమైన కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా సోమవారం వ్యవసాయంపై లఘు చర్చ జరిగింది. తొలుత వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడారు. అనంతరం సిఎం వ్యవసాయ రంగంపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఆ తరువాత మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా తాను చేసే ప్రతి నిర్ణయమూ రైతుకోసమేనని, తాను రైతు కుటుంబం నుండి వచ్చానని, ఐటి గురించి మాట్లాడుతున్నా వ్యవసాయంపైనే ఆలోచన ఉంటుందన్నారు. నీరుచెట్టు, రిజర్వాయర్లు, చెక్‌డ్యాములు, కాలువలు ఇలా ప్రతి అంశాన్ని వ్యవసాయానికి అనుకూలమైన ఆలోచనలే చేశానని పేర్కొన్నారు. సాగునీరు, వ్యవసాయ అభివృద్ధికే నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. మొబైల్ రైతుబజార్లతో ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించేలా చేస్తామని తెలిపారు. వ్యవసాయాన్ని



లాభదాయకంగా చేయడంపైనే తన ఆలోచన ఉంటుందని, ప్రతి పంటకూ గిట్టుబాటు ధర దక్కేలా చేస్తున్నామని చెప్పారు.

ఎరువులు పురుగమందులపై అవగాహన

రైతులకు పురుగుమందులు, ఎరువులు వాడకంపై అవగాహన కల్పించాలని సిఎం అన్నారు. వరదలు, వర్షాలతో ఎరువు కొట్టుకుపోవడం వల్ల బూస్టర్‌డోస్ ఇచ్చామని తెలిపారు. రాష్ట్రంలో 1.16 లక్షల ఎకరాల్లో ఈ ఏడాది అదనంగా పంట వేశారని పేర్కొన్నారు. 25 శాతం మేర యూరియా ఎక్కువ వినియోగించారని, దాణా పెంచడానికి కూడా యూరియాను వినియోగించుకున్నారని వివరించారు. ఖరీఫ్ సీజన్‌కు 16.70 లక్షల టన్నుల యూరియా రాష్ట్రంలో అందుబాటులో ఉందని చెప్పారు. యూరియా ఎక్కువ వినియోగించడం వల్ల పాలు కూడా కలుషితం అవుతున్నాయని, యూకలిప్టస్, పసుపు పంటలకూ వాడేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో హెక్టారుకు 255 కిలోల యూరియా వినియోగిస్తున్నారని, దీనివల్ల భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని పేర్కొన్నారు. భూసారం దెబ్బతింటోందని, ప్రజారోగ్యంతోపాటు పంట ఆరోగ్యంపైనా తీవ్ర ప్రభావం పడుతోందని వివరించారు. కొత్త తెగుళ్లతో పంటలు దెబ్బతింటున్నాయని చెప్పారు. పిఎం ప్రణమ్ కింద రసాయన ఎరువులు వినియోగం తగ్గించిన రైతులకు రూ.800 సబ్సిడీ రైతుల ఖాతాకు బదిలీ చేస్తున్నామని వివరించారు. నీటి నిర్వహణను కూడా మెరుగుపరిచామని 90 శాతం నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు. ఆక్వాకల్చర్‌తోపాటు మెరైన్ ఎకానమీ పైనా దృష్టి పెడుతున్నామని వివరించారు. రూ.1000 కోట్లతో ఆక్వా రైతులను ఆదుకునేందుకు కృషి చేస్తున్నామని వివరించారు.

ఏడేళ్లు దండుకుని.... ఇప్పుడు విదిలింపులా?

- జిఎస్‌టి అభినందన తీర్మానంపై మండలిలో వైసిపి నిలదీత
- ఆ పార్టీ వైఖరి తేలకుండానే తీర్మానం ఆమోదించినట్టు ప్రకటన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జిఎస్‌టి రెండో దశ సంస్కరణలపై ప్రధాని మోడీని అభినందిస్తూ మండలిలో తీర్మానంపై సోమవారం శాసన మండలిలో వాడీవేడి చర్చ జరిగింది. ఈ తీర్మానంను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఈ తీర్మానంపై మీ వైఖరి చెప్పాలంటూ ప్రతిపక్ష నాయకుడు బొత్సా సత్యనారాయణను కోరారు. ఈ తీర్మానంకు అనుకూలమో...వ్యతిరేకమో స్పష్టంగా చెప్పని బొత్స సత్యనారాయణ జిఎస్‌టి అమలుపై పలు విమర్శలు చేశారు. గత ఏడేళ్ల కాలంలో జిఎస్‌టి రూపంలో ప్రజల నుంచి రూ.55 లక్షల కోట్లు వసూలు చేసిన ఎన్‌డిఏ ప్రభుత్వం ఇప్పుడు రూ2.50 లక్షల కోట్లు తగ్గింపులు చేస్తున్నట్టు ఆర్భాటంగా ప్రకటించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్‌డిఏ పాలకులకు ఇన్నాళ్లకు పరివర్తన కలిగిందన్నారు. ఇడ్లీ, దోశకు కూడా జిఎస్‌టి వసూలు చేస్తున్నారని ఇక మీదట ఉంటుందా...ఉండదో స్పష్టం చేయాలన్నారు. హోటళ్లలో జిఎస్‌టి అమలులో దక్షిణ భారత దేశంలో ఒక విధంగా ఉత్తర భారత దేశంలో ఒక విదంగా ఉందన్నారు. నిత్యావసర వస్తువులు, ఆహార పదార్థాలపై జిఎస్‌టి తగ్గిస్తున్నట్టు చెబుతున్నా వాటిని సరఫరా చేసే జమోటా, స్విగ్గి వంటి సంస్థలకు 18 శాతం జిఎస్‌టి వసూలు చేయడం దారుణం అన్నారు. తద్వారా ఈ భారం వినియోగదారులపై పడుతుందన్నారు. ప్రస్తుతం తగ్గించిన టారీఫ్‌ల వల్ల సామాన్యులకు మేలు జరగదన్నారు. చేనేత వస్త్రాలపై జిఎస్‌టి తగ్గించి ముడిసరుకుపై మినహాయించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. చేనేత దారం, ఇతర ముడిపదార్థాలపై 18 శాతం జిఎస్‌టిని పూర్తిగా తగ్గించాలన్నారు. జిఎస్‌టి తగ్గింపు ఫలాలు పేదలకు ఎలా అందుతాయో చెప్పాలన్నారు. ఇందుకు క్షేత్రస్థాయిలో వ్యవస్థ ఉందా అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ పండుల రవీంద్రనాథ్ మాట్లాడుతూ తగ్గింపు ఫలాల పేదలకు చేరేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలనకు యంత్రాంగం ఉండాలన్నారు. స్వీట్స్, ఐస్‌క్రీమ్‌లపై జిఎస్‌టి తగ్గించడం వల్ల షుగర్ వ్యాధి గ్రస్తులు మరింత పెరుగుతారని చలోక్తి విసిరారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ చేనేత వస్త్రాల తయారీకి ముడిసరుకుపై జిఎస్‌టి మినహాయించాలన్నారు. సభ్యులు ప్రస్తావించిన అంశాలకు తగిన సమాధానం, భరోసా ఇవ్వకుండా మంత్రి పయ్యావుల కేశవ్ మీ తీర్మానంపై మీ వైఖరి ఏంటమని మరో మారు బొత్సా సత్యనారాయణను ప్రశ్నించారు. మీ పులివెందుల ఎమ్మెల్యే జగన్ జిఎస్‌టి రెండో దశ సంస్కరణలను సమర్థిస్తూ ఇప్పుడే ట్విట్ చేశారని మీరు ఆయన్ను సమర్థిస్తారా? వ్యతిరేకిస్తారా అని పదేపదే ప్రశ్నించారు. అయితే, బొత్సా తన వైఖరి స్పష్టంగా చెప్పకుండా విమర్శల పర్వం కొనసాగించారు. ఈలోగా చైర్మన్ మోషన్ రాజు తీర్మానం ఓటింగ్ పెట్టి ఆమోదించినట్టు ప్రకటించారు. తదుపరి చర్చకు అవకాశం లేకుండా సభను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు.

పిఆర్‌సి, ఆర్థిక బకాయిలు చెల్లించాలి :గోపిమూర్తి

- సమస్యలపై మండలిలో సభ్యుల ప్రస్తావన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యోగ, ఉపాధ్యాయులకు పిఆర్‌సి, ఆర్థిక బకాయిలు చెల్లించాలని పిడిఎఫ్ సభ్యులు గోపిమూర్తి కోరారు. ఈ మేరకు మండలిలో ప్రత్యేక ప్రస్తావన ద్వారా ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. 11వ పిఆర్‌సి 2023 జూన్ 30వ తేదితో పూర్తయిందని,2023 జులై 1 నుంచి 12వ పిఆర్‌సి అమలు చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికీ రెండేళ్ల కాలం వృధా అయ్యిందని చెప్పారు. వెంటనే 12వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించి ఐఆర్‌ను ప్రకటించాలని, పెండింగ్ డిఎలు విడుదల చేయాలని కోరారు. 11వ పిఆర్‌సి, డిఎ, సరెండర్ లీవులు, పెన్షనర్ బెనిఫిట్స్ బకాయిలు చెల్లించాలని కోరారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో ఎంపిటిసి, జెడ్‌పిటిసిలకు 16నెలలుగా గౌరవ వేతనం ఇవ్వడం లేదని వెంటనే ఈ బకాయిలు విడుదల చేసి ఇక నుంచి ఏనెలకు ఆ నెల ఇవ్వాలన్నారు. ఎమ్మెల్సీ రాంభూపాలరెడ్డి మాట్లాడుతూ గ్రామ సహాయకుల వేతనాలను రూ.10,500నుంచి పెంచాలన్నారు. చాలీచాలని వేతనాలతో వారు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రవేటు పాఠశాలలో కనీస సౌకర్యాలు ఉండటం లేదని, పాఠశాలలపై విద్యా శాఖ అధికారుల పర్యవేక్షణ పెరగాలన్నారు. కనీసం మరుగుదొడ్లు సరిగా ఉండటం లేదని, వేలాది రూపాయలు ఫీజులు తీసుకుంటూనే కనీస సదుపాయాలు కల్పించడం లేదన్నారు. కాంట్రాక్టు లెక్చరర్లకు కూడా రిటైర్‌మెంట్ వయస్సును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచాలని గాదె శ్రీనివాసులు నాయుడుకోరారు.

ఎయు విద్యార్థుల సమస్యలు పరిష్కరించాల్సిందే

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన 'చలో కలెక్టరేట్'
- 26 మంది అరెస్ట్

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విశాఖ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఆంధ్ర యూనివర్సిటీ విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం ప్రదర్శించారు. 26 మంది విద్యార్థులను రోడ్డుపై నుంచి ఈడ్చుకుంటూ వచ్చి బలవంతంగా పోలీసు వాహనం ఎక్కించి మహారాణి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తొలుత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై బైఠాయించారు. పది మంది విద్యార్థులు మాత్రమే లోపలికి వెళ్లి అధికారులకు వినతి పత్రం ఇవ్వాలని విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులకు పోలీసులు సూచించారు. ఇందుకు ఎస్ఎఫ్ఐ నాయకులు అభ్యంతరం తెలిపారు. తాము లోపలికి వెళ్లబోమని కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఒ స్థాయి అధికారులు తమ వద్దకు వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థులను అక్కడి నుంచి వెళ్లగొట్టడానికి పోలీసులు బల ప్రయోగం చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లాలం జగ్గునాయుడు, అధ్యక్షులు పి అజయ్, ఆంధ్రా యూనివర్సిటీ కమిటీ కన్వీనర్ డి వెంకటరమణ, ఎం అంజలి తదితర విద్యార్థి నాయకులను, విద్యార్థులను కలిపి మొత్తం 26 మందిని ఈడ్చుకుంటూ వాహనాల్లో ఎక్కించి మహారాణి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం విడిచిపెట్టారు.

విశాఖ కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు

ఈ నేపథ్యంలో మీడియాతో ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాక విద్యార్థులపై ఫీజుల భారం పడుతోందన్నారు. పెరిగిన మెస్ బిల్లులకు అనుగుణంగా ప్రతి విద్యార్థికీ రూ.3500 స్కాలర్‌షిప్ పెంచాలని, యూనివర్సిటీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని, మేనేజ్‌మెంట్ విధానం రద్దు చేసి వంద శాతం సీట్లు కన్వీనర్ కోటాలోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యుజిసి నిబంధనల ప్రకారం విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని, కామన్ పీజీ సెట్ రద్దు చేసి యూనివర్సిటీ పరిధిలోనే ఎంట్రన్స్ పరీక్షలు నిర్వహించాలని కోరారు. నిరసన తెలుపుతున్న విద్యార్థులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేయడాన్ని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు ఓ ప్రకటనలో ఖండించారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఖండన

శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న విద్యార్థులపై పోలీసుల ప్రవర్తనను ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఎటువంటి నిర్బంధం ఉండదని ఫ్రెండ్లీ పోలీస్ ప్రకటించిన ప్రభుత్వం నిరసన తెలియజేస్తున్నవారిపై దాడి చేయడం దుర్మార్గమని ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు పి రామ్‌మోహన్, కె ప్రసన్న కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యునివర్సిటీ విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నెలాఖరుకు 2.61లక్షల టిడ్కో ఇళ్లు పూర్తి

- బకాయిలకు .7,280కోట్లు అవసరం
- టిడ్కో ఇళ్లపై చర్చలో మంత్రి నారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే ఏడాది జూన్ నెలాఖరుకు 2,61,640 టిడ్కో ఇళ్లను పూర్తి చేస్తామని రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. శాసనసభలో సోమవారం టిడ్కో ఇళ్ళపై జరిగిన స్వల్పకాలిక చర్చలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ పూర్తయిన ఇళ్లను ప్రతి శనివారం లబ్ధిదారులకు అప్పగించాలని మునిసిపల్ కమిషనర్లకు ఆదేశాలిచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. మొత్తం ఇళ్ల నిర్మాణాలతో పాటు మౌలిక వసతులు, కాంట్రాక్టర్లుకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలకు కలిపి రూ.7,280 కోట్లు అవసరమవుతాయన్నారు. ఈ నిధులను హడ్కోనుంచి రూ.4,450కోట్లు రుణం తీసుకుంటున్నామని, లబ్ధిదారులకు ఇళ్లమీద ఇచ్చే రణాలు రూ.1,725కోట్లు, అమృత్ పథకం కింద నిధులు రూ.225కోట్లు ఖర్చు పెట్టేలా మొత్తం ప్రాజెక్టు డిజైన్ చేసినట్లు మంత్రి సభకు వివరణ ఇచ్చారు. మరో రూ.818 కోట్లు వివిధ రూపాల్లో తీసుకునే ఆలోచనలో ఉన్నామన్నారు. వివిధ బ్యాంకులనుంచి రుణాల ద్వారా సేకరిస్తున్నట్లు మంత్రి నారాయణ స్పష్టం చేశారు. 2014-19లో కేంద్ర ప్రభుత్వం 7,01,481 టిడ్కో ఇళ్లను రాష్ట్రానికి కేటాయించిందని, వీటిలో 5లక్షల ఇళ్ల నిర్మాణానికి పాలనా అనుమతులు తీసుకుని టెండర్లు పిలిచామన్నారు. గత ఐదేళ్ళ వైసిపి పాలనలో 2,61,640 ఇళ్లను తగ్గించిందని, మిగిలిన ఇళ్ల నిర్మాణాలను కూడా పూర్తి చేయలేదన్నారు. గత ప్రభుత్వం టిడ్కో ఇళ్ళలో అనేక అవకతవకలకు పాల్పడిందని నారాయణ చెప్పారు. ఇళ్లు నిర్మించకుండానే లబ్ధిదారుల పేర్ల మీద బ్యాంకు లోన్లు తీసుకుందని, ఈ రుణాలకు సంబంధించిన ఇఎమ్ఐలను తమ ప్రభుత్వం రూ.140 కోట్లు బ్యాంకులకు ఇప్పటి వరకు చెల్లించినట్లు ఆయన పేర్కొన్నారు. తాము 2019 మే నాటికి 77,350 ఇళ్లను 90 నుంచి 100 శాతం పూర్తి చేశామని, గత ప్రభుత్వం ఇళ్లను కొంత మేర ఇళ్లను పూర్తి చేసినా మౌలిక వసతులు కల్పించలేదన్నారు.

24న రైతు, కూలీల మహాధర్నా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బలవంతపు భూ సేకరణతో రైతులను, కూలీలను వీధి పాలు చేస్తున్న ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 24వ 'రైతు, కూలీల మహా ధర్నా' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయా సంఘాల రాష్ట్ర కమిటీలు వెల్లడించాయి. భూసేకరణ సమయంలో 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కె.ప్రభాకర్ రెడ్డి, ఎం.హరిబాబు, వి.వెంకటేశ్వర్లు సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా గతంలో సేకరించిన భూములకు పరిహారం, పేదలకు పునరావాసం కల్పించాలని కోరారు. పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా వృధాగా ఉన్న భూములను తిరిగి వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో 2013 భూ సేకరణ చట్టాన్ని తుంగలో తొక్కి కూటమి ప్రభుత్వం పోలీసులు, సైన్యాన్ని వినియోగించి రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కుంటుందన్నారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి జైళ్లకు పంపుతున్నట్లు తెలిపారు. వారికి మద్దతుగా వెళ్లే నాయకులను సైతం ముందస్తు అరెస్టులు చేస్తూ రైతు, కూలీల మనోధైర్యాన్ని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. ఈ దుర్మార్గాలకు వ్యతిరేకంగా చేపట్టిన రైతు, కూలీ మహాధర్నాకు రాష్ట్రం నలుమూలల నుంచి రైతులు, గ్రామీణ పేదలు, రైతు శ్రేయస్సు కోరే ప్రతి ఒక్కరూ హాజరై వ్యవసాయ రంగాన్ని కాపాడాలని కోరారు.

టెట్‌పై రివ్యూ పిటిషన్ వేయాలి :ఎస్టియు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయులు పదోన్నతి పొందాలంటే ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)పై తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్రప్రభుత్వం రివ్యూపిటిషన్ దాఖలు చేయాలని ఎస్టియు కోరింది. ఈ అంశంపై ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలని ఆ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సాయి శ్రీనివాస్, మల్లు రఘునాథరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టం-2010 నుంచి అమలైందని తెలిపారు. అంతకుముందు నియామకం పొందిన ఉపాధ్యాయులందరికీ టెట్ మినహాయింపు ఇచ్చేలా ఎన్‌సిటిఇ మార్గదర్శకాలలో సవరణ చేసేలా కేంద్రప్రభుత్వాన్ని కోరాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు.లక్షలమంది ఉపాధ్యాయుల్లో నెలకొన్న భయాందోళనను తొలగించాలని కోరారు. ఈ అంశంపై రాజ్యసభ, లోక్‌సభ సభ్యులకు విజ్ఞాపన పత్రాలు అందిస్తామని తెలిపారు.

జిఎస్‌టిపై ఇంటింటి ప్రచారం

- శాసనసభలో చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జిఎస్‌టి 2.0 సంస్కరణలపై దసరా నుండి దీపావళి వరకూ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తామని ముఖ్యమంత్రి, చంద్రబాబునాయుడు అన్నారు. సోమవారం శాసనసభలో ఆయన జిఎస్‌టిపై ప్రకటన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన సూపర్ జిఎస్‌టితో ప్రజలకు పెద్దఎత్తున మేలు జరుగుతుందన్నారు. సుమారు 8వేల కోట్లు ప్రజలకు ఆదా అవుతాయని వివరించారు. జిఎస్‌టి 2.0 ఫలాలు ప్రజలందరికీ అందేలా చూడటానికి మంత్రులతో కమిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. పేదలు, మధ్యతరగతి ప్రజల జీవితాలను మార్చడమే లక్ష్యంగా సంస్కరణలు తెచ్చామని వివరించారు. మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తులను కొనుగోలు చేయాలన్నారు. గ్రామవార్డు సచివాలయాల ద్వారా కూడా ప్రచారం నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పదివేల రైతు సేవా కేంద్రాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తామని, రాష్ట్రంలో ప్రతి పౌరుడికి వివరాలు తెలిసేలా అన్ని టచ్ పాయింట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. విద్యా సంస్థలు, కళాశాలల్లో వ్యాస రచన పోటీలు నిర్వహిస్తామని, సోమవారం నుండి అక్టోబరు 19వ తేదీ వరకూ 26 జిల్లాల్లో అధికారులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, సెల్ఫీ కంటెస్టెంట్ వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా విస్తృత ప్రచారం చేపడతామని వివరించారు. సెమినార్లు నిర్వహిస్తామన్నారు. దుకాణాల వద్ద జిఎస్‌టి తగ్గింపు వివరాలు ప్రదర్శితమయ్యేలా చూస్తామని పేర్కొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

దళితుడి ఇంటిని తొలగించిన అధికారులపై చర్యలు

- కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చిత్తూరు జిల్లా గంగవరం మండలం బూడిదపల్లికి చెందిన దళితుడైన నరసింహులు నివాసాన్ని తొలగించిన రెవెన్యూ, పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని, కూల్చివేసిన స్థానంలో ఇల్లు నిర్మించి ఇవ్వాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. అధికారుల చర్య కారణంగా మనస్తాపానికి గురైన నరసింహులు భార్య మణెమ్మ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిందని సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఒ.నల్లప్ప, ఆండ్ర మాల్యాద్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నరసింహులు వర్షం వల్ల గుడిసె పాడవడంతో రేకుల షెడ్డు నిర్మించుకుంటున్నాడని తెలిపారు. ఆ గ్రామ పెత్తందార్ల ఫిర్యాదుతో అధికారులు ఈ చర్య తీసుకున్నారని పేర్కొన్నారు.

విశాఖ డెయిరీ అవకతవకలపై నివేదిక గడువు మరో ఆరు నెలలు పొడిగింపు

- శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ డెయిరీ అవినీతి అవకతవకలపై విచారణ జరుపుతున్న ప్రత్యేక సభా సంఘం నివేదిక సమర్పించే గడువును సంఘం ఛైర్మన్ అభ్యర్ధన మేరకు మరో ఆరు నెలలు పొడిగించినట్లు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. శాసనసభలో సోమవారం ఆయన ప్రశ్నోత్తరాల సమయం అనంతరం ఈ మేరకు ప్రకటన చేశారు. 2019-24 మధ్య రాష్ట్ర సహకార బ్యాంక్ లిమిటెడ్ (ఆఫ్కాబ్),జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు (డిసిసిబి)లు , ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పిఎసిఎస్)లపై విచారణ కోసం 05.05.2025న ఏర్పాటు చేసిన ప్రత్యేక సభా సంఘాన్ని పునర్వ్యవస్థీకరించినట్లు స్పీకర్ శాసనసభలో ప్రకటించారు.

నాగార్జున సాగర్‌కు వరద ఉధృతి

- 26 గేట్లు ఎత్తివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు మరోసారి వరద ఉధృతి పెరిగింది. సోమవారం 26 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. 16 గేట్లను ఐదు అడుగులు, పది గేట్లను పది అడుగుల మేర పైకి ఎత్తి, స్పిల్ వే ద్వారా 2,68,749 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో 3,21,023 క్యూసెక్కులు ఉండగా అదే స్థాయిలో అవుట్ ఫ్లో ఉంది. నాగార్జున సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 587.00 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టిఎంసిలు కాగా ప్రస్తుతం 305.50 టిఎంసిలుగా నమోదైంది.

ఆదోనిలో మెడికల్ కళాశాల భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తదితరులు

వైద్య కళాశాలలను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే

వైద్య విద్య నిర్వీర్యం

- ఆదోని మెడికల్ కళాశాలను ప్రభుత్వమే పూర్తి చేసి నిర్వహించాలి : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

వైద్య కళాశాలలను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే వైద్య విద్య నిర్వీర్యం అవుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదోని మెడికల్ కళాశాల పెండింగ్ పనులను ప్రభుత్వమే పూర్తి చేయాలని, ఇందుకు అవసరమైన నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అసంపూర్తిగా నిల్చిపోయిన ఆదోని మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని మెడికల్ కళాశాలను ప్రైవేటుపరం చేయడం అంటే, పేద విద్యార్థులకు మెడికల్ విద్యను దూరం చేయడమేనని తెలిపారు. ఆదోని మెడికల్ కళాశాల భవన నిర్మాణాలు దాదాపుగా 70 శాతంపైగా పూర్తయ్యాయన్నారు. మిగిలిన పనులను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వమే నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్‌పరం చేస్తే ఈ కళాశాలలో ఒక్కో సీటు రూ.25 లక్షలకుపైగానే యాజమాన్యాలు అమ్ముకుంటాయన్నారు. జిఒ నెంబర్ 107, 108లను రద్దు చేయాలని, ఎస్ఎఫ్ఐ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ తదితరులు ఉన్నారు.

108కి ఉరేస్తున్నారు

- వైసిపి అధ్యక్షులు జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

108 సర్వీసులకు ప్రభుత్వం ఉరివేస్తోందని, దీంతో ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. పాడేరు సమీపంలో ముల్లుమెట్టకు చెందిన నిండు గర్భిణీని తరలించేందుకు 108 సమయానికి రాలేదని పేర్కొన్నారు. దీంతో ఆటోను ఆశ్రయించడంతో అందులోనే ప్రసవించి శిశువు మరణించిందని తెలిపారు. వైసిపి హయాంలో పట్టణ ప్రాంతాల్లో ఫోన్ చేసిన 15 నిముషాల్లోనే అంబులెన్సులు రావాలని నిబంధన ఉంటే అంతకంటే తక్కువ సమయంలోనే వచ్చేవని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 17 నిముషాలు, గిరిజన ప్రాంతాల్లో 30 నిముషాల్లోలోపే వచ్చేవని వివరించారు. ఇప్పుడు ఎందుకు చేరుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం పనిచేయడం లేదని ఈ ఘటనతో రుజువైందని తెలిపారు.

25న వైసిపి విస్తృత సమావేశం

ఈనెల 24వ తేదీన వైసిపి కేంద్ర కార్యాలయంలో పార్టీ విస్తృత సమావేశం జరగనుంది. దీనికి రీజనల్ కోఆర్డినేటర్లు, ప్రధాన కార్యదర్శులు, పిఎసి మెంబర్లు, అన్నిస్థాయిల నాయకులు పాల్గొంటారని పార్టీ కార్యాలయం తెలిసింది.

25న డిఎస్సి అభ్యర్థుల సభ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మెగా డిఎస్సి-2025లో ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 25వ తేదిన నియామక పత్రాల అందించే కార్యక్రమం జరగనుంది. రాష్ట్ర సచివాలయం ప్రాంగణంలో ఈ కార్యక్రమం నిర్వహించేందుకు రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను అసెంబ్లీలో సోమవారం కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ గత ఐదేళ్లల్లో ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయకపోగా మెగా డిఎస్సిని అడ్డుకునేందుకు ప్రత్యర్థులు దాదాపు 106 కేసులు వేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలుపుకుందని తెలిపారు. ఏళ్లతరబడి ఎదురుచూస్తున్న నిరుద్యోగ టీచర్ల కలలు సాకారమయ్యాయని చెప్పారు.

వైసిపి వాయిదా తీర్మానం తిరస్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై శాసనమండలిలో వరుసగా రెండో రోజు కూడా వాయిదా తీర్మానాన్ని వైసిపి ప్రతిపాదించింది. వైసిపి ఎమ్మెల్సీలు మొండితోక అరుణ్‌కుమార్, సిపాయి సుబ్రహ్మణ్యం, కుంభా రవిబాబు సభ ప్రారంభం కాగానే చైర్మన్‌కు సోమవారం వాయిదా తీర్మానం అందించారు. దీనిని తిరస్కరిస్తునట్లు ప్రకటించిన చైర్మన్ ప్రశ్నోత్తరాలను ప్రారంభించారు. ఈ అంశంపై చర్చ జరపాలని ఎమ్మెల్సీలు పట్టుబడుతూ వారి స్థానాల నుంచి వెల్‌లోకి వచ్చారు. అనంతరం చైర్మన్ పోడియం వద్దకు చేరుకొని ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఒక సారి తిరస్కరించిన వాయిదా తీర్మానాన్ని మరోసారి ఇవ్వకూడదన్నారు. పోడియం ఎక్కి ఆందోళనలు చేయడం సరికాదని సభ సజావుగా నిర్వహించేందుకు సభ్యులపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ బిఎసిలో సోమవారం చర్చిస్తామని చెప్పిన ప్రభుత్వం మాట తప్పిందని తెలిపారు.

అగ్రిసెట్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - తాడికొండ (గుంటూరు జిల్లా)

అగ్రిసెట్-2025 ప్రవేశ ఫలితాలను గుంటూరు జిల్లా తాడికొండ మండలంలోని ఆచార్య ఎన్‌జి రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా విసి డాక్టర్ ఆర్ శారదా జయలక్ష్మి దేవి మాట్లాడుతూ వ్యవసాయం, సేంద్రీయ వ్యవసాయం, విత్తన సాంకేతిక పరిజ్ఞాన కోర్సుల్లో డిప్లొమా పూర్తిచేసిన వారు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా 844 మంది నమోదు చేసుకోగా 813 మంది హాజరయ్యారని, వారిలో 753 మంది ఉత్తీర్ణులయ్యారని, వారు నాలుగేళ్ల పాటు వ్యవసాయ డిగ్రీ కోర్సు చదవడానికి అర్హత సాధించారని చెప్పారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఎంవి రమణ మాట్లాడుతూ ఫలితాలు మంగళవారం నుండి వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని, ర్యాంక్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. కౌన్సెలింగ్ తేదీలు, ఇతర వివరాల కోసం ఖఅస్త్రతీఖబ.ఖఎ.ఆఅ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ టి ఉష, డాక్టర్ ఎస్ఆర్ కోటేశ్వరరావు, డీన్ అఫ్ అగ్రికల్చర్ డా.సిహెచ్ శ్రీనివాసరావు, డైరెక్టర్ పాలిటెక్నిక్ డాక్టర్ ఎన్‌సి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలపై 40 శాతం రాయితీ

- మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దసరా, దీపావళి నేపథ్యంలో ఆప్కో వస్త్రాలపై 40 శాతం రాయితీ అందజేయనున్నట్లు చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఒకవైపు చేనేతలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే మరోవైపు చేనేత వస్త్రాల అమ్మకాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత వస్త్రాలపై 40 శాతం రాయితీ వల్ల వినియోగదారులకు ఆర్థికంగా మేలు జరుగుతుందన్నారు. దసరా, దీపావళి పండుగలను దృష్టిలో పెట్టుకుని వినియోగదారులు, చేనేతల కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. చేనేత వస్త్రాలు తెలుగింటి సాంప్రదాయానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. ఇంటిల్లిపాది చేనేత దుస్తులు ధరించి నేతన్నలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. మరోవైపు చేనేత వస్త్రాల విక్రయాలు పెంచేందుకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో చేనేత ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఈ కామర్స్‌లో ప్లాట్‌ఫాంలపై అమ్మకాలు చేపట్టి నేరుగా వినియోగదారుల ఇళ్లకు చేనేత దుస్తులు డోర్ డెలివరీ చేస్తున్నట్లు తెలిపారు.

హాస్టల్ గదిలో శ్రావ్య మృతదేహం

బిటెక్ విద్యార్థి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరులోని ప్రైవేటు హాస్టల్‌లో మూతికి ప్లాస్టర్, ముక్కుకు క్లిప్‌తో బిటెక్ విద్యార్థిని సోమవారం అనుమానాస్పదంగా మృతి చెందారు. ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు జిల్లా దెందులూరు మండలం శ్రీరామవరం గ్రామానికి చెందిన కమ్మ శ్రావ్య గుంటూరు అశోక్ నగర్‌లోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ వివిఐటిలో బిటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్నారు. ఆదివారం రాత్రి తన స్నేహితురాలు జాగృతికి ఫోన్ చేసి తనకు బతకాలని అనిపించట్లేదని చెప్పారు. దీంతో శ్రావ్య కుటుంబానికి జాగృతి ఫోన్ చేసి విషయాన్ని చెప్పారు. వారు శ్రావ్యకు ఫోన్ చేసి అడుగగా.. తాను బాగానే ఉన్నానని విద్యార్థిని తెలిపారు. హాస్టల్‌లోని శ్రావ్య స్నేహితులకు ఫోన్ చేసి, ఉదయాన్నే తాము వస్తామని, ఈలోగా జాగ్రత్తగా చూసుకోమని విద్యార్థిని తల్లి కోరారు. రాత్రి 12 గంటల వరకూ తోటి విద్యార్థులు కలిసే ఉన్నారు. తరువాత అందరూ పడుకున్నారు. ఉదయాన్నే స్నేహితులు బయటకు వచ్చి చూసేసరికి శ్రావ్య కిందపడి మూతికి ప్లాస్టర్ చుట్టి, ముక్కుకు క్లిప్ పెట్టి అపస్మరక స్థితిలో ఆమె ఉన్నారు. 108కి సమాచారం ఇచ్చారు. అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్య సిబ్బంది చెప్పారు. గుంటూరు వెస్ట్ డిఎస్‌పి అరవింద్, సిఐ జి వెంకటేశ్వర్లు ఘటనా స్థలాన్ని సందర్శించి, విద్యార్థిని మృతదేహాన్ని పరిశీలించారు. ఆమె మృతికి కారణాలు తెలియలేదు. అనుమానాస్పద మృతి కింది కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారికి బంగారు పతకాలు, రెండు వెండి తట్టలు విరాళం

ప్రజాశక్తి -తిరుమల

శ్రీ సంస్థాన్ గోకర్ణ పర్తగాళి జీవోత్తమ మఠాధిపతి విద్యాధీశ తీర్థ స్వామీజీ రూ.1.80 కోట్లు విలువైన 15 బంగారు పతకాలు, రెండు వెండి తట్టలను తిరుమల శ్రీవారికి సోమవారం బహూకరించారు. తిరుమలలో శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో పేష్కార్ రామకృష్ణకు స్వామీజీ వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో బొక్కసం ఇన్ ఛార్జ్ గురురాజ్ స్వామి పాల్గొన్నారు.

పదమూడు గంటల పని విధానం వద్దు

- రాష్ట్ర వ్యాప్తంగా కార్మికుల ఆందోళనలు
- కార్మిక చట్ట సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాల్సిందేనని డిమాండ్

ప్రజాశక్తి - యంత్రాంగం

కార్మిక చట్ట సవరణ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని, పదమూడు గంటల పని విధానాన్ని రద్దు చేసి ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళనలు చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

నంద్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద జరిగిన ధర్నాలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడుతూ... పెట్టుబడిదారులకు, కార్పొరేట్ సంస్థలకు నరేంద్ర మోడీ ప్రభుత్వం కొమ్ముకాస్తూ కార్మికుల శ్రమను దోచుకునేందుకు పది నుంచి 13 గంటల పాటు పనిచేయాలని నిబంధన పెట్టడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరొక అడుగు ముందుకేసి కేబినెట్‌లో నిర్ణయం చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఎనిమిది గంటల పని విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. విజయవాడ బీసెంట్ రోడ్ మహంతి మార్కెట్ వద్ద ధర్నాలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్ కుమార్ మాట్లాడుతూ... రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఎనిమిది గంటల పనిని రద్దుచేసి పది గంటలు, 13 గంటలు పని దినం అమలు కోసం, మహిళలు 24 గంటలు పని చేయాలని, ఓవర్ టైం పని 14 గంటలు పెంచుతూ చేసిన సవరణలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా కొండపల్లి పారిశ్రామిక వాడలో హెచ్‌పి గ్యాస్ కంపెనీ వద్ద నిరసన తెలిపారు. మైలవరం సిఐటియు కార్యాలయం నుండి పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

శ్రీకాకుళంలో నగరపాలక సంస్థ కార్యాలయం గాంధీ విగ్రహం వద్ద, ఎచ్చెర్లలో నాగార్జున అగ్రికమ్ పరిశ్రమ వద్ద, కొత్తూరులో నాలుగు రోడ్ల కూడలిలో, కంచిలిలో సిఐటియు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. విజయనగరం కలెక్టరేట్ వద్ద, పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరంలో ధర్నా చేశారు. అనంతపురం టవర్‌క్లాక్ వద్ద ఆందోళన చేపట్టారు. కడప జిల్లా కలెక్టరేట్ ఎదుట, అన్నమయ్య జిల్లా ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కడపలో జెసికి వినతిపత్రం అందజేశారు. విశాఖలోని హెచ్‌పిసిఎల్ లేబర్ గేట్ వద్ద నిరసన తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జికె వీధి మండలం సీలేరులో యునైటెడ్ ఎల్‌సిడి కాంట్రాక్టు వర్కర్స్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. అరకులోయలో ఆందోళన చేపట్టారు. ఏలూరు పాత బస్టాండ్ సెంటర్, నూజివీడులో చిన్నగాంధీ బొమ్మ సెంటర్, పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ధర్నా నిర్వహించారు. నెల్లూరులో నిరసన తెలిపారు.

నంద్యాలలో జరిగిన ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ధనలక్ష్మి

టవర్ లేకుండానే 'సిగ్నల్స్'

- షార్‌లో బాహుబలి రాకెట్ అక్టోబర్‌లో ప్రయోగం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

సెల్ టవర్స్ లేకుండానే ఇంటర్నెట్ సిగ్నల్స్ స్మార్ట్ ఫోన్లు పనిచేయనున్నాయి. అమెరికాలో తయారైన ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సిద్ధమవుతోంది. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట శ్రీహరికోటలోని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో తిరుపతి జిల్లా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ రెండో లాంచ్ ప్యాడ్ నుండి అక్టోబర్ రెండో వారంలో మరో భారీ రాకెట్ ప్రయోగానికి సిద్ధమైంది. ఇస్రో శాస్త్రవేత్తలతో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన సిఎంఎస్ 02 కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ఎల్‌విఎం-3ఎం మార్క్-5 రాకెట్ ద్వారా ఈ సిఎంఎస్ - 02 ఉపగ్రహాన్ని నింగిలోకి పంపేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సిద్ధం అవుతున్నారు. ఎల్‌విఎం - 3ఎం మార్క్-5ను వచ్చేనెల రెండో వారంలో ప్రయోగించాలని ఇస్రో లక్ష్యంగా పెట్టుకుంది. దీనిలో భాగంగా 6,500 కిలోల బరువైన బ్లాక్-2 బ్లూ బర్డ్ ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నారు. అమెరికాలోని టెక్సాస్‌కు చెందిన ఎఎస్‌టి స్పేస్ మొబైల్ ఈ ఉపగ్రహాన్ని రూపొందించింది. ఈ నెలాఖరులోగా ఉపగ్రహం భారత్‌కు చేరుకోనుంది. ఇప్పటికే కమ్యూనికేషన్ రంగానికి సంబంధించి ఇస్రో శాస్త్రవేత్తలు శ్రీహరికోట నుండి ఎన్నో కమ్యూనికేషన్ ఉపగ్రహాలను నింగికి పంపి ఘన విజయం సాధించారు. సిఎంఎస్-02 ఉపగ్రహాన్ని అక్టోబర్ 15వ తేదీ నుండి 19వ తేదీ లోపు ఇఎల్.వి.ఎం -03-ఎం 5 రాకెట్‌ను ప్రయోగించేందుకు ఈ రాకెట్ అనుసంధాన పనులను షార్‌లోని వెహికిల్ అసెంబ్లింగ్ భవనంలో ముమ్మరంగా చేశారు. ఈ ఎల్‌విఎం-3ఎం మార్క్-5 రాకెట్ ప్రయోగాన్ని అక్టోబర్ మాసంలో ఏ తేదీన ప్రయోగిస్తారో ఇస్రో శాస్త్రవేత్తలు ఖరారు చేయాల్సి ఉంది.

'స్త్రీ శక్తి' రీ యింబర్స్‌మెంట్ ఎప్పుడు?

- సిఎంఓ కు చేరిన సబ్సిడీ నిధుల ఫైలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం (స్త్రీశక్తి) పథకం ప్రారంభించి నెల దాటినా నేటికి ఈ పథకానికి సంబంధించి ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు చేయకపోవడం పట్ల విమర్శలు వినవస్తున్నాయి. ఆగస్టు 31 నుంచి ఈ నెల 19 వరకు పరిశీలిస్తే ఆర్‌టిసికి ఉచిత టిక్కెట్లకు సంబంధించి సబ్సిడీ కింద ప్రభుత్వం రూ. 153 కోట్లు చెల్లించాల్సి ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ నిధుల కోసం ఆర్‌టిసి ఉన్నతాధికారులు ఫైలును సిఎంఓకు పంపారు, అయితే, ఈ ఫైల్ అక్కడ పెండింగ్‌లో ఉంది. ఆర్థిక శాఖ క్లియరెన్స్ ఇవ్వకపోవడం దీనికి కాణమని చెబుతున్నారు. ఆగస్టు 15న స్త్రీ శక్తి పథకం ప్రారంభోత్సవ సభలో సిఎం మాట్లాడుతూ ఈ పథకం కోసం ఏడాదికి రూ.1942 కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. అయితే, దీనికి సంబంధించి ఎటువంటి అడ్వాన్స్‌ను ఆర్‌టిసికి చెల్లించలేదు. ఈ పథకాన్ని అమలు చేస్తున్న రాష్ట్రాలు కొంత మొత్తాన్ని ఆర్‌టిసికి అడ్వాన్స్ రూపంలో చెల్లించాయని, మన రాష్ట్రంలో అలా చేయలేదని కార్మికులు చెబుతున్నారు.

20 రోజుల్లో 4.34 కోట్ల మంది

ఈ పథకం కింద ఆగస్టు 31 నుంచి ఈ నెల 19 వరకు రోజుకు సగటున 23 లక్షల మంది చొప్పున 20 రోజుల్లో 4.34 కోట్ల మంది మహిళలు ప్రయాణ సౌకర్యాన్ని ఉపయోగించుకున్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం సబ్సిడీ కింద రోజుకు రూ.7.74 కోట్ల చొప్పున రూ.152.98 కోట్లు చెల్లించాల్సి ఉంది. 'స్త్రీ శక్తి' అమల్లోకి వచ్చిన తరువాత ప్రయాణీకుల రేషియోను పరిశీలిస్తే మహిళా ప్రయాణీకులు 64 శాతం.. పురుష ప్రయాణీకులు 36 శాతం ప్రయాణాలు చేస్తున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య బృందం

అంగలకుదురులో కలరా

- వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తం
- ఇంటింటి సర్వే నిర్వహణ

ప్రజాశక్తి - తెనాలి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా తెనాలి రూరల్ పరిధి అంగలకుదురు గ్రామంలో కలరా కేసు నమోదైన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికుల కథన ప్రకారం... అంగలకుదురుకు చెందిన దీపిక హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తూ డెంగీ జ్వరంతో ఈ నెల 14న స్వగ్రామం వచ్చారు. 18న డయేరియా లక్షణాలతో బాధపడుతూ తాడేపల్లి మణిపాల్ ఆస్పత్రిలో చేరారు. వైద్యులు పరీక్షించి కలరా సోకినట్లు 19న నిర్ధారించారు. ఈ విషయాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అప్రమత్తమైన అధికారులు విషయం బయటకు పొక్కనీయకుండా జాగ్రత్తపడ్డారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించారు. ఆదివారం వరకు వైద్య శిబిరం నిర్వహించారు. ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు గ్రామంలో పరిస్థితిని పర్యవేక్షించారు.

కలరా కేసు నమోదైన మాట వాస్తవమే :డాక్టర్ హనీఫ్, పిహెచ్‌సి వైద్యాధికారి

అంగలకుదురు పిహెచ్‌సి పరిధిలో కలరా కేసు నమోదైంది. ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఎపిడమాలజిస్ట్ వైద్య బృందం గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించింది. దాదాపు 2,868 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆ ఒక్క కేసు మినహా ఎవరికీ కలరా నిర్ధారణ కాలేదు.

యథావిధిగా 10 గేట్ల ద్వారా నీటి విడుదల

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

కృష్ణా ఎగువ పరివాహక ప్రాంతాల నుండి వరదనీటి ప్రవాహం కొనసాగుతుండడంతో యథావిధిగా శ్రీశైలం జలాశయం 10 గేట్లను 12 అడుగుల మేర ఎత్తి 3,12,260 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు. సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి జూరాల నుండి 2,65,825 క్యూసెక్కులు, సుంకేసుల నుండి 15,717 క్యూసెక్కులు, హంద్రీ ద్వారా 250 క్యూసెక్కులతో కలిసి జలాశయానికి 2,81792 క్యూసెక్కుల నీరు చేరింది. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి పోతిరెడ్డిపాడుకు 5000, హంద్రీనీవా సుజల స్రవంతికి 2,427, మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు 2,167 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గడచిన 24 గంటల్లో కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో 30,236 క్యూసెక్కుల నీటితో 15.215 మిలియన్ యూనిట్ల విద్యుత్తు, ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో 39,263 క్యూసెక్కుల నీటితో 16.794 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దిగువ నాగార్జున సాగర్‌కు 65,365 క్యూసెక్కుల నీటితో పాటు పది గేట్ల ద్వారా 3,12,260 క్యూసెక్కులతో కలిపి మొత్తం 3,77,625 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

సహజ వనరులు కొల్లగొట్టేందుకు కుట్రలు

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం
- హైడ్రోపవర్ ప్రాజెక్టును రద్దు చేయాలంటూ జీపుజాతా
- 27న ఆదివాసీ అరణ్యగర్జన సభ

ప్రజాశక్తి - సీలేరు, అనంతగిరి (అల్లూరి జిల్లా)

సభలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం

సీలేరు నుంచి అనంతగిరి వరకు ఉన్న సహజ వనరులను కొల్లగొట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రపూరితమైన చర్యలు చేపడుతున్నాయని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం విమర్శించారు. హైడ్రోపవర్ ప్రాజెక్టును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అల్లూరి సీతారామరాజు జిల్లా దుప్పిలివాడ పంచాయతీ పరిధి బూసికొండ గ్రామంలో సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం జీపు జాతా నిర్వహించారు. ప్రభావిత ఏజెన్సీ గ్రామాల్లో 27 వరకు ఈ జాతా కొనసాగనుంది. జాతాను లోకనాథం, జిల్లా కార్యదర్శి అప్పలనర్స జెండా ఊపి ప్రారంభించారు. నిర్వాసితులు, వివిధ సంఘాల నాయకులతో సీలేరు వరకు ర్యాలీ నిర్వహించారు. సీలేరు పంపు స్టోరేజీ ప్రాజెక్టు నిర్వాసితుల కమిటీ అధ్యక్షులు ప్రభాస్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో లోకనాథం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తొమ్మిది వేల మెగావాట్ల సామర్థ్యం గల ప్రాజెక్టులు రాబోతున్నాయని, దీనివల్ల రాబోయే రోజుల్లో వన్యప్రాణులకు, ఈ ప్రాంతాలను నమ్ముకొని ఉన్న గిరిజనులకు, అటవీ సంపదకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. మనుషుల మనుగడకు తీవ్రం నష్టం కలిగించే పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులను, హైడ్రో ప్రాజెక్టులను తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో ఏదైనా ప్రాజెక్టు నిర్మించాలంటే 1/70 చట్టం ప్రకారం ఈ ప్రాంత గిరిజనులు ఒప్పుకుంటేనే ప్రాజెక్టు నిర్మాణానికి అవకాశం ఉంటుందని, లేకుంటే ప్రభుత్వానికి ఇక్కడ ప్రాజెక్టు నిర్మించే హక్కు లేదని తెలిపారు. ఆదివాసీల మనుగడకు ముప్పు కలిగించే ప్రాజెక్టులను వ్యతిరేకించడానికి ప్రజాప్రతినిధులు ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి అప్పలనర్స మాట్లాడుతూ.. ఈ నెల 27న హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ మజ్జివలసలో నిర్వహించనున్న అరణ్యగర్జన సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు హాజరవుతారని చెప్పారు.

అనంతగిరి తహశీల్దార్ కార్యాలయం ముట్టడి

అనంతగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు ర్యాలీగా వెళ్లి తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. తమ సాగు భూముల జోలికి వచ్చిన అదాని ఏజెంట్లపై కేసులు పెట్టాలని, గిరిజన సంఘం నేతలపై అక్రమంగా బనాయించిన కేసులను తక్షణమే ఎత్తివేయాలని నినదిస్తూ తహశీల్దార్‌ను చుట్టుముట్టారు. అధికారులు సమాధానం చెప్పేంత వరకూ కదిలేది లేదని మూడు గంటల పాటు అక్కడే బైఠాయించారు. తహశీల్దార్ వీరభద్రాచారి మాట్లాడుతూ, తాను విధుల్లో చేరి మూడు నెలలు మాత్రమే అవుతుందని, సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

నృత్యాలు చేస్తున్న కళాకారులు

శ్రీశైలంలో దసరా ఉత్సవాలు ప్రారంభం

- బృంగి వాహన సేవలో స్వామి, అమ్మవార్లు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో దసరా మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల నిర్వహణలో భాగంగా ముందుగా ఆలయ ఇఒ శ్రీనివాసరావు దంపతులు, ఆలయ పూజరాలు, అధికారులు ఆలయ ప్రవేశం చేశారు. అనంతరం అమ్మవారి యాగశాలలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి బృంగి వాహనంపై ఊరేగించారు. ఈ గ్రామోత్సవంలో కొమ్ము కోయ నృత్యం, కోలాటం, డమరుకం, చిడతలు, జేగంట, కంచుడోలు, కొమ్ము తాళాలు, చెక్కభజన, తప్పేటచిందు, డోలు విన్యాసం, వీరభద్ర డోలు, కుణిత తదితర సాంప్రదాయ సంగీత పరికరాలతో కూడిన జానపద కార్యక్రమాలు అలరించాయి.

చిల్లంగి నెపంతో గ్రామ బహిష్కరణ

జిల్లా కలెక్టర్‌కు బాధితులు ఫిర్యాదు

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి సొంత నియోజకవర్గంలో చిల్లంగి నెపంతో ఓ గిరిజన కుటుంబాన్ని గ్రామబహిష్కరణ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సోమవారం సాలూరు మండలంలోని కరాసువలస పంచాయతీ గుర్రపువలస గ్రామానికి చెందిన పాలిక సన్యాసి కుటుంబ సభ్యులు కలెక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డికి గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. తనకు చిల్లంగి ఉందనే నెపంతో మర్రి సుహాసినితో సహ మరి కొందరు తనపై ఈనెల 17న దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో తమ కుటుంబం ఉండకూడదని, తమతో ఎవరూ మాట్లాడకూడదని ఆంక్షలు విధించారని తెలిపారు.

తమతో మాట్లాడితే రూ.10 వేలు జరిమానా విధిస్తామని గ్రామంలో నిర్ణయించారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో తమకున్న భూములు, ఇల్లు వదిలి వెళ్లి పోవాలని బెదిరిస్తున్నారని సన్యాసి కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామానికి చెందిన సుహాసిని మహిళా పోలీస్‌గా పని చేస్తున్నారని, ఆమె సహకారంతోనే గ్రామ బహిష్కరణ చేశారని ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు.

పిడుగు పడి కార్మికుడు దుర్మరణం

ప్రజాశక్తి-మధురవాడ

పిడుగు పడి కార్మికుడు దుర్మరణం చెందిన ఘటన విశాఖ జివిఎంసి 6వ వార్డు పరిధి కొమ్మాది గ్రీన్ ఫీల్డ్ మినీ స్టేడియం వద్ద సోమవారం చోటు చేసుకుంది. ఘటనపై సిఐ జి బాలకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం... విశాఖ ఆరిలోవ ప్రాంతానికి చెందిన డి సూర్యప్రకాష్ (37) కొమ్మాది గ్రీన్‌ఫీల్డ్ మినీ స్టేడియంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్నారు. ఎప్పటిలాగే సోమవారం గ్రౌండ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో ఆయనపై పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందారు. సూర్యప్రకాష్‌కు భార్య సోమేశ్వరి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

ఆరు పిఎస్‌యుల్లో వాటాల విక్రయం..!

- ఐపిఒకు రానున్న సహజ వనరుల కంపెనీ
- దీపమ్ సెక్రటరీ అరునిష్ చావ్లా వెల్లడి

న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ సర్కార్ మళ్లీ పిఎస్‌యుల్లో వాటాల విక్రయాన్ని వేగవంతం చేస్తోంది. ప్రభుత్వ రంగంలోని ఆరు సంస్థల్లో పెట్టుబడులను ఉపసంహరించుకునే యోచనలో ఉన్నామని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపమ్) సెక్రటరీ అరునిస్ చావ్లా తెలిపారు. అయితే ఏ సంస్థల్లో వాటాను విక్రయించేది ఆయన స్పష్టతనివ్వలేదు. కాగా.. ఆ ఆరు సంస్థల్లో మాత్రం మైనారిటీ వాటాల ఉపసంహరణ ఉంటుందని ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చావ్లా వెల్లడించారు. అయితే.. రాయిటర్స్ గతంలో ఇచ్చిన నివేదిక ప్రకారం యూకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రతో సహా ఐదు పబ్లిక్ సెక్టర్ బ్యాంకులలో వాటాలను విక్రయించాలని ప్రణాళిక వేస్తోందని తెలుస్తోంది. దేశంలోని అతిపెద్ద బీమా సంస్థ అయిన లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి)లోనూ ప్రభుత్వం తన వాటాను తగ్గించుకోనుందని సమాచారం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సహజ వనరుల రంగంలోని ఓ ప్రభుత్వ రంగ సంస్థ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు రానుందని చావ్లా తెలిపారు. ఆ సంస్థ పేరును చావ్లా వెల్లడించనప్పటికీ.. ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఒఎన్‌జిసి), ఎన్‌హెచ్‌పిసి తమ గ్రీన్ ఎనర్జీ విభాగాలైన ఒఎన్‌జిసి గ్రీన్ ఎనర్జీ, ఎన్‌హెచ్‌పిసి రెన్యూవబుల్ ఎనర్జీలను లిస్టింగ్ చేయడాన్ని పరిశీలిస్తున్నాయని తెలుస్తోంది.

మైనారిటీ వాటాల విక్రయాలు, ఐపిఒలు ప్రభుత్వానికి ఆదాయాలను పెంచడానికి సహాయ పడతాయని చావ్లా పేర్కొన్నారు. 2026 మార్చి 31తో ముగియనున్న ఆర్థిక సంవత్సరంలో పిఎస్‌యుల్లో వాటాల విక్రయం ద్వారా రూ.47వేల కోట్ల నిధులను సమీకరించాలని మోడీ సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వ రంగ సంస్థల నుండి వచ్చే డివిడెండ్ ఆదాయాలు అంచనా లక్ష్యాన్ని మించిపోవచ్చని చావ్లా తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పిఎస్‌యుల నుంచి రూ.69వేల కోట్ల నిధులు డివిడెండ్ రూపంలో రావొచ్చని అంచనా వేశారు.

మార్కెట్లను అలరించని జిఎస్‌టి తగ్గింపు

- సెన్సెక్స్ 460 పాయింట్ల పతనం

ముంబయి : వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) శ్లాబులను 5 శాతం, 18 శాతాలకు పరిమితం చేసినప్పటికీ దలాల్ స్ట్రీట్‌లో ఎలాంటి ఉత్సాహం కానరాలేదు. కొత్త శ్లాబులు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. అయినప్పటికీ మార్కెట్ల పట్ల ఇన్వెస్టర్లు ఆసక్తి కనబర్చలేదు. దేశ ఆర్థిక వ్యవస్థలో బలహీనతల భయాలు, హెచ్1బి వీసా ఫీజును అమెరికా అమాంతం పెంచడం ఇన్వెస్టర్లను ఆందోళనకు గురి చేశాయి. ఈ పరిణామాల నేపథ్యంలో బిఎస్ఇ సెన్సెక్స్ 460 పాయింట్లు లేదా 0.56 శాతం పతనమై 82,160కి పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 125 పాయింట్లు లేదా 0.49 శాతం నష్టంతో 25,202 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఎటెర్నల్, బజాజ్ ఆటో, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు రాణించగా.. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, టిసిఎస్, సిప్లా, హెచ్‌సిఎల్ టెక్, డాక్టర్ రెడ్డీస్ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.67 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.17 శాతం చొప్పున తగ్గాయి.

జెఎస్‌డబ్ల్యు ఎంజి ఎస్‌యువి ధరల తగ్గింపు

న్యూఢిల్లీ : జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ ఇండియా తమ ఎస్‌యువి శ్రేణి ధరలను తగ్గించినట్లు ప్రకటించింది. జిఎస్‌టి శ్లాబు తగ్గింపు నేపథ్యంలో పలు మోడళ్లపై రూ.54,000 నుంచి రూ.3.04 లక్షల వరకు కోత పెట్టినట్లు వెల్లడించింది. ఈ కంపెనీ ఎస్‌యువి పోర్టుపోలియోలో ఆస్టర్, హెక్టార్, గ్లోస్టర్ కార్లను విక్రయిస్తోంది. ఎక్స్‌షోరూం ధరలు ఎంజి ఆస్టర్‌పై రూ.34వేలు, ఎంజి హెక్టార్ రూ.49వేలు, గ్లోస్టర్‌పై రూ.2.83 లక్షలు తగ్గిస్తున్నట్లు పేర్కొంది.

పాలిష్డ్ డైమండ్స్ ఎగుమతుల్లో 20 శాతం పతనం..

- కేర్‌ఎడ్జ్ అంచనా

న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన అధిక టారిఫ్‌లు భారత వజ్రాల వ్యాపారాన్ని తీవ్ర ప్రభావితం చేయనున్నాయని రేటింగ్ ఏజెన్సీ కేర్‌ఎడ్జ్ విశ్లేషించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26లో కట్ అండ్ పాలిష్డ్ డైమండ్స్ (సిపిడి) రంగం ఎగుమతులు 17-20 శాతం పతనమై సుమారు 11 బిలియన్ డాలర్లకు పరిమితం కావొచ్చని అ సంస్థ అంచనా వేసింది. ఇంతక్రితం ఏడాది 2024-25లోనూ 17.5 శాతం క్షీణతతో 13.3 బిలియన్ డాలర్లకు పడిపోగా.. ఈ రంగం మరింత ఒత్తిడిని ఎదుర్కొనుందని హెచ్చరించింది. ఈ రంగం ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ తగ్గడం, అమెరికా విధించిన అధిక సుంకాలు, ల్యాబ్‌లో తయారైన డైమండ్స్ (ఎల్‌జిడి) నుండి పెరుగుతున్న పోటీ వంటి బహుముఖ సవాళ్లను ఎదుర్కొంటోందని కేర్‌ఎడ్జ్ తెలిపింది. ప్రపంచంలోని పాలిష్డ్ డైమాండ్స్ ఉత్పత్తిలో భారత్ 90 శాతం వాటాను కలిగి ఉంది. అమెరికా ఒక్కటే ప్రపంచ పాలిష్డ్ డైమండ్ వినియోగంలో 40 శాతం కంటే ఎక్కువ వాటాను కలిగి ఉందని గురి చేసింది. అమెరికా ఇటీవల విధించిన 50 శాతం వరకు సుంకాలు అక్కడి మార్కెట్‌లో ధరలను పెంచే ప్రమాదం ఉందని తెలిపింది. అధిక టారిఫ్‌లు వినియోగదారుడిపై భారాన్ని పెంచడంతో డిమాండ్ తగ్గనుందని తెలిపింది.

మహీంద్రా నుంచి అధిక సామర్థ్యం ట్రాక్టర్ ఆవిష్కరణ

ముంబయి : ప్రముఖ ట్రాక్టర్ బ్రాండ్ అయినా మహీంద్రా ట్రాక్టర్స్ కొత్తగా మహీంద్రా యువో టెక్ ప్లస్ 475 డిఐ పేరిట 42 హెచ్‌పి ట్రాక్టర్‌ను ఆవిష్కరించినట్లు తెలిపింది.

అత్యధిక క్యూబిక్ సామర్థ్యపు ఇంజిన్, టెక్నాలజీతో దీన్ని అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. విస్తృత స్థాయిలో వినియోగానికి ఉపయోగపడేలా 191 ఎన్ఎం గరిష్ట టార్క్, 28 శాతం బ్యాకప్ టార్క్ శక్తి దీని సొంతమని తెలిపింది. శక్తివంతమైన 2980 సిసి ఎంబుల్ 3 సిలిండర్ ఇంజిన్‌తో దీన్ని తెచ్చినట్లు పేర్కొంది. ఈ మోడల్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రలో అందుబాటులో ఉంటుందని వెల్లడించింది.

కీలక రంగాల ఉత్పత్తి 6.3 శాతానికి పెరుగుదల

న్యూఢిల్లీ : పారిశ్రామికోత్పత్తిలో అత్యంత కీలకమైన ఎనిమిది రంగాలు ఈ ఏడాది ఆగస్టులో 6.3 శాతం పెరుగుదలతో.. 13 నెలల గరిష్ట స్థాయికి చేరిందని వాణిజ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. చమురు, బొగ్గు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, స్టీల్, సిమెంట్, విద్యుత్ లాంటి ప్రాధాన్యత రంగాలు గతేడాది ఆగస్టులో మైనస్ 1.5 శాతం ప్రతికూల వృద్ధిని నమోదు చేయగా.. గడిచిన జులైలో 3.7 శాతానికి పెరిగాయి. ఈ రెండు మాసాలతోనూ పోల్చిన ఆగస్టులో మెరుగైన ప్రగతిని కనబర్చినట్లు వాణిజ్య శాఖ పేర్కొంది.

సంపాదకీయం

వీసా కలకలం

విదేశాలకు చెందిన నిపుణులకు అమెరికా జారీ చేసే హెచ్1బి వీసా ఫీజును ఎకాయికిన లక్ష డాలర్లకు (రూ.88 లక్షలు) పెంచుతూ ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ శనివారం తీసుకున్న నిర్ణయం ప్రపంచంలో పెను సంచలనం రేపగా, ఆ మర్నాడే నష్ట నివారణా చర్యగా పెంచిన రుసుం కొత్త దరఖాస్తులకు మాత్రమేనని, ఒకేసారి చెల్లించేదని యుఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్, వైట్ హౌస్ వేర్వేరుగా వివరణలిచ్చాయి. స్థానిక అమెరికన్లకే ఉద్యోగాలనే కుహనా జాతీయ వాదాన్ని ప్రజల్లో రేగ్గొట్టి అధికారంలోకొచ్చిన ట్రంప్, వచ్చింది మొదలు ప్రతీకార, కక్ష పూరిత, ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం చూస్తున్నదే. ప్రస్తుత హెచ్1బి వీసాల ఫీజు పెంపు ఆ కోవలోకే వస్తుంది. ఇప్పటి వరకు సదరు వీసాకయ్యే ఫీజు 2 వేల డాలర్ల నుంచి 5 వేల డాలర్ల వరకు ఉంది. ఒకేసారి లక్ష డాలర్లకు పెంచడం వలన అమెరికాలో విదేశీ నిపుణులపై ఆధారపడ్డ కంపెనీలు అనివార్యంగా తమ దగ్గర పని చేస్తున్న వారిని ఇంటికి సాగనంపే పనైనా చేయాలి. లేదంటే నిర్ణయించిన ఫీజునైనా చెల్లించాలి. అదీ కాకపోతే అమెరికన్లను ఉద్యోగానికి పెట్టుకోవాలి. దీని వలన అమెరికా కంపెనీలపై పడే అదనపు భారం 14 బిలియన్ డాలర్లు (రూ.1.23 లక్షల కోట్లు) అని అంచనా. ఆ భారాన్ని కంపెనీలు మోయకుంటే అమెరికాలో ఉద్యోగం సంపాదించి నాలుగు రాళ్లు వెనకేసుకోవాలని కలలు కనే భారత్, ఇతర దేశాల యువత కలలు చెదిరిపోతాయి.

వాస్తవానికి విదేశాల్లోని నిపుణులను తక్కువ వేతనాలపై నియమించుకొని అక్కడి కంపెనీలు దోపిడీ చేసుకొనేందుకు వీలుగా అమెరికా హెచ్1బి వీసాలను ప్రవేశపెట్టింది. అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్, మెటా వంటి సంస్థలు బాగా లబ్ధి పొందాయి కూడా. కాగా విదేశాల నుంచి తమ దేశానికి వస్తున్న వారు తమ ఉద్యోగాలను, ఉపాధిని కబ్జా చేసి, తమకు దక్కాల్సిన అవకాశాలను తన్నుకుపోతున్నారని కొన్నేళ్లుగా అమెరికన్లలో అసంతృప్తి నెలకొంది. దాన్ని ట్రంప్ ఎన్నికల్లో రాజకీయంగా క్యాష్ చేసుకున్నారు. యువతకు ఇచ్చిన హామీ అమలులో భాగంగా హెచ్1బి వీసాల ఫీజు భారీగా పెంచి తద్వారా స్థానిక యువతకు ఉద్యోగాలిచ్చి సంతృప్తి పర్చాలన్నది ట్రంప్ పన్నాగం. ఇదొక్కటే హెచ్1బి వీసాల రుసుం పెంపునకు కారణం కాదు. తన వాణిజ్య ప్రయోజనాల కోసం కూడా. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన అమెరికాను తాత్కాలికంగానైనా బయట పడేసేందుకు ఇటువంటి దుర్మార్గపు దారులు ఎంచుకున్నారు. దానితోపాటు తన దారికి రాని దేశాలపై ఒత్తిడి పెంచడానికి, బలవంతపెట్టి తన దారికి తెచ్చుకోడానికి, లొంగదీసుకునే వ్యూహం సైతం ఇమిడి ఉంది. ఇప్పటికే అమెరికాలోకి వచ్చే వస్తువుల దిగుమతులపై కొన్ని రెట్ల సుంకాల విధింపు చూస్తున్నదే. కొందరికి కొన్ని సడలింపులు, కాల పరిమితులు ఇచ్చినా అంతిమంగా పలు దేశాలపై తన పెత్తనాన్ని బిగించేందుకు, తనను సవాల్ చేస్తున్న చైనా, ఇతర దేశాలపై వాణిజ్య యుద్ధం ప్రకటించి ఇబ్బంది పెట్టడానికి ట్రంప్ తన అమ్ములపొదిలో నుంచి ఒక్కొక్కటిగా 'ఆయుధాల'ను ప్రయోగిస్తున్నారన్నది అసలు సిసలైన వాస్తవం.

తాజాగా ట్రంప్ తీసుకున్న వీసా రుసుం పెంపు నిర్ణయం భారతదేశానికి, అమెరికా కంపెనీల్లో కొలువు చేస్తున్న, కొత్తగా కొలువులు దక్కించుకోవాలని ఉబలాటపడుతున్న వారికి నష్టదాయకంగా తయారైంది. వారి కుటుంబాల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. హెచ్1బి వీసాదారుల్లో 71 శాతం మంది మన దేశస్థులే. ఇరవై నాలుగ్గంటలలోనే కొత్త రుసుం అమల్లోకి రావడంతో వేలాది మంది యువత దిక్కుతోచని స్థితికి లోనైంది. మన విదేశాంగ శాఖ కనబర్చిన ప్రతిస్పందన యువతకు ఆశాజనకంగా లేదు. అమెరికా నిర్ణయాన్ని గట్టిగా ప్రతిఘటించాల్సిన ఈ సమయంలో మోడీ స్వదేశీ వస్తువులు, స్వావలంబన మాటలు చెప్పడం దారుణం. అమెరికా భారతదేశ వస్తువుల దిగుమతులపై సుంకాలు వేసిన సందర్భంలోనూ మోడీ సర్కార్ ఇలాగే తటపటాయింపు ధోరణిని అవలంబించింది. ట్రంప్- ప్రధాని మోడీ ఫోన్‌లో తరచూ 'హాయ్' చెప్పుకుంటారని, పరస్పరం జన్మదిన శుభాకాంక్షలు తెలుపుకుంటారని అమిత ప్రచారం సాగుతున్న దశలో హెచ్1 బి వీసాల ఫీజు తగ్గింపుపై మోడీ ఎందుకు ట్రంప్‌పై ఒత్తిడి చేయలేకపోతున్నారో ఆయన చెబితేనే తెలుస్తుంది. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలు సహా పలు అంశాలపై వచ్చే నెలలో మోడీ, ట్రంప్ మధ్య కీలక సమావేశం ఉంటుందంటున్నారు. ఆ సమావేశంలో అమెరికా, ట్రంప్ పెట్టే ఒత్తిళ్లకు, బెదిరింపులకు భారత ప్రభుత్వం, ప్రధాని లొంగకుండా భారత దేశ ప్రజల ప్రయోజనాల పరిరక్షణకు పూచీ పడాలి.

మహనీయుల మాట



స్వాతంత్ర్యం, స్వేచ్ఛ కంటే విలువైనది ఏదీ లేదు.
- హోచిమిన్,
వియత్నాం విప్లవ సారథి.

9

విదేశీ సంస్థల పెత్తనంలో మన బ్యాంకులు?



ప్రభాత్ పట్నాయక్

> బ్యాంకుల మీద విదేశీ పెత్తనాన్ని అనుమతించాలన్న వత్తిడి మనకు నయా ఉదారవాదం వైపు నుండి వస్తోంది. పెట్టుబడుల మీద ఏ విధమైన ఆంక్షలనూ నయా ఉదారవాదం అంగీకరించదు. ముఖ్యంగా ప్రభుత్వాలు ఆంక్షలు పెట్టడాన్ని అది ఒప్పుకోదు. మరీ ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాల ప్రభుత్వాలు పెట్టే ఆంక్షలను అది సుతరామూ అంగీకరించదు. అందుకే ప్రస్తుతం ఉన్న 15 శాతం పరిమితినీ తొలగించాలని వత్తిడి చేస్తుంది. అంతేగాక, భారత ఆర్థిక వ్యవస్థ మీద తన పట్టు పెరగాలంటే భారతీయ బ్యాంకుల మీద పెత్తనం సాధించడం సామ్రాజ్యవాదానికి కీలకమైన అంశంగా ఉంటుంది (నయా ఉదారవాదం అంటేనే సామ్రాజ్యవాదపు వ్యూహం అని మనం గ్రహించాలి). విదేశీ యజమానికి విదేశీ ప్రభుత్వం నుండి పూర్తి దన్ను లభిస్తుంది. అదే మాదిరి దన్ను భారతీయ యజమానికి మన ప్రభుత్వం నుండి అభించదు.



భారతీయ బ్యాంకుల యాజమాన్యంలో ప్రవాసులకు వాటా ఉండవచ్చు. ఐతే ఆ వాటా 15 శాతానికి మించకుండా ఉండాలని రిజర్వు బ్యాంక్ పరిమితి విధించింది. ఈ పరిమితిని ఆ యా సందర్భాన్ని బట్టి పెంచే అవకాశం ఉంది. ఏదేమైనా చట్టం ప్రకారం ఈ 15 శాతం పరిమితి అనేది ఇప్పటికీ కొనసాగుతోంది. ఐనప్పటికీ, 2018లో కెనడాకు చెందిన ఫెయిర్ ఫాక్స్ అనే కంపెనీ, (ఇది మారిషస్ నుంచి కార్యకలాపాలు నడుపుతోంది) కేరళ లోని కేథలిక్ సిరియన్ బ్యాంక్ వాటాలలో 51 శాతాన్ని కొనుగోలు చేయడానికి అనుమతించారు. కేంద్ర ప్రభుత్వం గాని, రిజర్వు బ్యాంక్ గాని 15 శాతం పరిమితిని ఇలా 2018లో ఉల్లంఘించవలసిన అగత్యం ఏమిటో వివరించనేలేదు. అంతకు మునుపు, 1994లో (నయా ఉదారవాద విధానాల తొలి దినాల్లో) ఎస్ఎస్ చౌవాలా గ్రూపు సంస్థ (ఇది థాయ్‌లాండ్ నుండి నడుస్తోంది) ఇదే బ్యాంకులో 34 శాతం వాటాలను కొనుగోలు చేస్తానని ముందుకొచ్చినప్పుడు ఆ అభ్యర్థనను అప్పటి ప్రభుత్వం తిరస్కరించింది. అలా తిరస్కరించడం సరైనది. కాని ఆ తర్వాత 2018లో ఎందుకు అనుమతించారో ఇప్పటికీ వివరణ లేదు.

ఇప్పుడు ఐడిబిఐ బ్యాంక్ (ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)ను ఒక విదేశీ ప్రైవేటు సంస్థకు అమ్మడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ ఐడిబిఐ బ్యాంక్ ప్రభుత్వ రంగ సంస్థగా ప్రత్యేకంగా పరిగణించబడకపోయినప్పటికీ, దానిలోని మెజారిటీ వాటాదారుడిగా ప్రభుత్వ యాజమాన్యం కింద నడుస్తున్న ఎల్ఐసి సంస్థ 2019 నుంచీ ఉంది.

అందుచేత ఈ విషయమై ఎన్ని అభ్యంతరాలు వెలువడుతున్నప్పటికీ, విదేశీ సంస్థలు మన దేశీయ బ్యాంకుల మీద పెత్తనం పొందడానికి అనుమతించేందుకు ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా మొగ్గు చూపుతోంది. ఎందుకు ఈ విధంగా జరుగుతోందన్న విషయాన్ని ఇంతవరకూ వివరించే ప్రయత్నం ప్రభుత్వం గాని రిజర్వు బ్యాంక్ గాని చేయలేదు. సాధారణంగా ఇటువంటి ప్రధాన, విధానపరమైన మార్పులు చేపట్టినప్పుడు 'విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం కోసం' అంటూ సాకులు చెప్తారు. కాని ఈ సారి అటువంటిది కూడా లేదు. ఐతే, అటువంటి సాకు ఈ విషయంలో నిలబడదు. విదేశీ సంస్థలు మన బ్యాంకుల వాటాలను కొనుగోలు చేస్తే వచ్చే మొత్తమే చాలా తక్కువ. కేథలిక్ సిరియన్ బ్యాంక్‌లో 51 శాతం వాటాలను కొనుగోలు చేసిన ఫెయిర్ ఫాక్స్ సంస్థ చెల్లించినది కేవలం రూ.1200 కోట్లు మాత్రమే. పైగా, జూన్ 2024లో తమ వాటాల్లో కేవలం 9.72 శాతం వాటాలను అమ్మి రూ.592 కోట్లు, అంటే తాము చెల్లించిన దాంట్లో దాదాపు సగం, తిరిగి పొందారు. మన బ్యాంకుల యాజమాన్యం విదేశీ కంపెనీల చేతుల్లో ఉంటే అప్పుడు మన దేశంలోకి పెట్టుబడులు రావడానికి అనువైన వాతావరణం ఏర్పడుతుంది అన్న వాదన కూడా పూర్తిగా తప్పుడు వాదనే. గతంలో విదేశీ వాటాలు 15 శాతానికి మించకూడదన్న నిబంధనను రిజర్వు బ్యాంక్ ఖచ్చితంగా పాటించినప్పుడు కూడా విదేశీ పెట్టుబడులు బాగానే వచ్చాయి. ఇప్పుడు విదేశీ పెట్టుబడులు రావడం తగ్గిపోయి, వెనక్కి వెళ్ళిపోవడం పెరుగుతోందంటే అందుకు వేరే కారణాలు ఉన్నాయి (ఉదాహరణకు ట్రంప్ సుంకాల పెంపు). కొన్ని బ్యాంకులను విదేశీ సంస్థలకు అమ్మేసినంత మాత్రాను విదేశీ పెట్టుబడులు వెనక్కి పోతున్న ధోరణిని ఆపడం కూడా సాధ్యం కాదు. విదేశీ సంస్థల పెత్తనం కిందికి మన దేశీయ బ్యాంకులను అనుమతించే ప్రక్రియ ఎందుకిలా గోప్యంగా ముందుకు సాగుతోంది? అందునా అటువంటి ప్రక్రియ వలన మన దేశ ఆర్థిక వ్యవస్థ అత్యంత వినాశకర ఫలితాలను చవి చూడవలసి వస్తుందని గుర్తించిన తర్వాత కూడా ఎందుకిలా జరుగుతోంది? (మన బ్యాంకులలో విదేశీ సంస్థల వాటాలు 15 శాతానికి మించకూడదన్న నిబంధనను తొలుత రూపొందించి అమలు చేసినది ఇందుకే కదా?)!

బ్యాంకుల యాజమాన్యం విదేశీ సంస్థల చేతుల్లోకి పోతే జరిగే హాని గురించి ఉన్నదానికన్నా ఎక్కువ చేసి చెప్తున్నారన్న వాదన ఉంది. భారతీయ బ్యాంకులు విదేశాల్లో ఆస్తులను కొనుగోలు చేయడం గురించి రిజర్వు బ్యాంక్ కొన్ని నిబంధనలను రూపొందించింది. ఆ నిబంధనలు మన బ్యాంకులకు కొన్ని పరిమితులు విధించాయి. ఆ పరిమితులకు లోబడి వ్యవహరించినంత కాలం మన బ్యాంకుల యాజమాన్యం ఎవరి చేతుల్లో ఉందన్నది అంత ప్రధానం కాదు. ఈ వాదనను ఒకవేళ అంగీకరించినా, అసలు మన భారతీయ బ్యాంకులను విదేశీ సంస్థకు ఎందుకు అప్పజెప్పాలన్న ప్రశ్నకు అది సమాధానం చెప్పదు. విదేశీ సంస్థల చేతుల్లో ఉంటే మన బ్యాంకుల నిర్వహణ బాగా మెరుగు పడుతుందన్న వాదన సైతం చెల్లదు. నిజానికి మన బ్యాంకులు విదేశీ సంస్థల చేతుల్లోకి పోతే అప్పుడు ఇక్కడ చిన్న స్థాయి రుణాలను పొందేవారికి ఆ బ్యాంక్ అందుబాటులో ఉండదు. నిజానికి బ్యాంకులు రుణాలు ఇచ్చేటప్పుడు వారికే ప్రాధాన్యతనివ్వాలి. కాని విదేశీ సంస్థల చేతుల్లో ఉన్నప్పుడు ఆ విధంగా జరగదు. పైగా అత్యున్నత స్థాయి అధికారుల జీతాలు మాత్రం బ్రహ్మాండంగా పెరుగుతాయి. కేథలిక్ సిరియన్ బ్యాంక్ అనుభవం ఇదే.

అంతే కాదు, ఒకసారి మన బ్యాంకుల మీద పెత్తనం విదేశీ కంపెనీల చేతుల్లోకి పోయిన తర్వాత వాళ్ళు విదేశీ ఆస్తుల కొనుగోలు విషయంలో ఉన్న ప్రస్తుత నిబంధనలను, పరిమితులను ఎత్తివేయాలని మన ప్రభుత్వం మీద వత్తిడి పెంచుతారు. ఆ పరిమితులను ఎత్తివేస్తే అప్పుడు ఈ బ్యాంకులు విదేశీ స్పెక్యులేటివ్ వ్యాపారాల్లో పెట్టుబడులను ఎక్కువగా పెట్టేందుకు అవకాశం కలుగుతుంది. ఎక్కువ లాభాలు వచ్చేటప్పుడు స్పెక్యులేటివ్ పెట్టుబడులైతే మాత్రం ఏమిటి నష్టం? అని ప్రశ్నించవచ్చు. స్పెక్యులేషన్ అంటేనే ఒక తరహా జూదం. అందులో లాభాలు వస్తున్నప్పుడు బాగానే ఉంటుంది. ఐతే, ఆ లాభాల్లో ఒక్క పైసా కూడా డిపాజిట్‌దారుల ఖాతాల్లో పడదు. అంతా యజమానులకే పోతుంది. ఒకవేళ ఆ స్పెక్యులేషన్‌లో నష్టం వస్తే మాత్రం అప్పుడు బ్యాంకులు దివాలా తీసే ప్రమాదాన్ని కూడా ఎదుర్కోవలసి వస్తుంది. అప్పుడు డిపాజిటర్లు తమ కష్టార్జితాన్నంతటినీ పోగొట్టుకునే దుస్థితి వస్తుంది. అందుచేత చాలా పెద్ద సంఖ్యలో ఉండే డిపాజిటర్ల ప్రయోజనాల దృష్ట్యా చూసినప్పుడు ఈ స్పెక్యులేటివ్ పెట్టుబడులకు దిగడం అనేది చాలా హానికరం. అందువలన భారతీయ డిపాజిటర్లకు లాభాలు ఏవీ రావు సరికదా తమ సమస్తాన్నీ కోల్పోయే ప్రమాదం ఉంది.

ఇదేదో పనీ పాటు లేనివాడెవడో ఊహించి చెప్తున్న విషయం కాదు. అమెరికాలో "హౌసింగ్ బుడగ" 2008లో పేలిపోయినప్పుడు ఆ బుడగ పెరుగుతున్న కాలంలో రుణాలు ఇచ్చిన సంపన్న పెట్టుబడిదారీ దేశాలలోని ప్రధాన బ్యాంకులన్నీ దెబ్బ తిన్నాయి. ఆ రుణాలన్నీ "పనికి మాలిన వ్యర్థ ఆస్తులు"గా ఆ బ్యాంకులకు మిగిలిపోయాయి. అప్పుడు ప్రభుత్వాలు బ్యాంకులకు భారీగా 'బెయిల్ ఔట్" ప్యాకేజీలు ప్రకటించవలసి వచ్చింది. ఆ బెయిల్ అవుట్ల కారణంగా డిపాజిటర్లు గణనీయంగా నష్టపోయారు. ఆ హౌసింగ్ బుడగ పేలుడు తాకిడి తగలకుండా తప్పించుకున్న ఒక ప్రధాన దేశం మనదే. ఎందుకంటే అప్పటికి మన భారతీయ బ్యాంకులలో విదేశీ ఆస్తుల వాటా నామమాత్రమే. దాని వలన "వ్యర్థ ఆస్తుల" వాటా కూడా చాలా తక్కువగానే ఉండింది. ప్రైవేటు రంగంలోని ఐసిఐసిఐ బ్యాంక్ మాత్రమే కాస్త గణనీయమైన మోతాదులో ఆ "వ్యర్థ ఆస్తులను" మూటగట్టుకుంది తప్ప ప్రభుత్వ రంగ బ్యాంకులన్నీ దాదాపు ఏ నష్టమూ చవిచూడకుండా బైటపడ్డాయి. ఇప్పుడు మన బ్యాంకుమీద పెత్తనాన్ని విదేశీ సంస్థల చేతుల్లో పెడితే అప్పుడు మన ఆర్థిక వ్యవస్థకు 2008 నాడు ఉన్న బలం ఇంకెతంమాత్రమూ ఉండదు.

బ్యాంకుల మీద విదేశీ పెత్తనాన్ని అనుమతించాలన్న వత్తిడి మనకు నయా ఉదారవాదం వైపు నుండి వస్తోంది. పెట్టుబడుల మీద ఏ విధమైన ఆంక్షలనూ నయా ఉదారవాదం అంగీకరించదు. ముఖ్యంగా ప్రభుత్వాలు ఆంక్షలు పెట్టడాన్ని అది ఒప్పుకోదు. మరీ ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాల ప్రభుత్వాలు పెట్టే ఆంక్షలను అది సుతరామూ అంగీకరించదు. అందుకే ప్రస్తుతం ఉన్న 15 శాతం పరిమితినీ తొలగించాలని వత్తిడి చేస్తుంది. అంతేగాక, భారత ఆర్థిక వ్యవస్థ మీద తన పట్టు పెరగాలంటే భారతీయ బ్యాంకుల మీద పెత్తనం సాధించడం సామ్రాజ్యవాదానికి కీలకమైన అంశంగా ఉంటుంది (నయా ఉదారవాదం అంటేనే సామ్రాజ్యవాదపు వ్యూహం అని మనం గ్రహించాలి). విదేశీ యజమానికి విదేశీ ప్రభుత్వం నుండి పూర్తి దన్ను లభిస్తుంది. అదే మాదిరి దన్ను భారతీయ యజమానికి మన ప్రభుత్వం నుండి అభించదు.

ప్రభుత్వ నియంత్రణ ఉన్న కాలంలో (1990 దశకానికి ముందు కాలంలో) భారతీయ ఆర్థిక రంగంలో చేపట్టిన పురోగామి చర్యలన్నింటినీ ఇప్పటికే గణనీయంగా నయా ఉదారవాదం తిరుగుముఖం పట్టించింది. ఉదాహరణకు: ప్రాధాన్యతా రంగ రుణాలకు సంబంధించి పాటించవలసిన ప్రమాణాలు నేటికీ కొనసాగుతున్నా, అసలు ప్రాధాన్యతా రంగం అంటే ఏమిటన్న నిర్వచనాన్నే మార్చివేశారు. అంతకు ముందు రైతులు, చిన్న ఉత్పత్తిదారులు, చిన్న వ్యాపారులు, బలహీన వర్గాల వారు ప్రాధాన్యతారంగంగా పరిగణించబడ్డారు. ఇప్పుడు అటవంటి తరగతుల ప్రజలకు బ్యాంకుల నుండి రుణాలు లభించడం దాదాపు అసాధ్యం అయ్యే విధంగా విధానాలను మార్చివేశారు. ఇటీవల ఐద్వా చేసిన అధ్యయనం ప్రకారం, ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలకు, మైక్రో ఫైనాన్స్ కంపెనీలకు బ్యాంకులు 10 శాతం కన్నా తక్కువ వడ్డీకే రుణాలనిస్తున్నాయి. ఆ ఫైనాన్స్ కంపెనీలు పేద మహిళలకు 26 శాతం వడ్డీకి రుణాలను ఇస్తున్నాయి. బ్రిటిష్ వాడి కాలంలో గ్రామాల్లో వడ్డీ వ్యాపారి పేదలను ఏ విధంగా కొల్లగొట్టేవాడో, అదే మాదిరిగా ఇప్పుడు జరుగుతోంది. అంతే కాదు, ఈ ఫైనాన్స్ సంస్థలకు బ్యాంకులు ఇచ్చే రుణాలను ప్రాధాన్యతా రంగ రుణాలుగా పరిగణిస్తున్నారు! గతంలో బ్యాంకులను జాతీయం చేసినప్పుడు ప్రకటించిన లక్ష్యాలలో వ్యవసాయానికి, చిన్న వ్యాపారులకు, చిన్న పరిశ్రమలకు తేలికగా, మధ్య దళారీలు లేకుండా, రుణాలను అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యం ఒకటిగా ఉంది. ఇప్పుడా లక్ష్యమే దెబ్బ తినిపోయింది.

మరోపక్క బ్యాంకింగ్ రంగం యావత్తూ, ప్రభుత్వ రంగ బ్యాంకులతో సహా బడా పెట్టుబడిదారులకు ఊడిగం చేసే పనిలో మునిగిపోయింది. ఆ బడా పెట్టుబడిదారులు బ్యాంక్ రుణాలను అత్యధికంగా కాజేయడం, వాటిని తిరిగి చెల్లించకుండా ఎగ్గొట్టడం వంటివి చేయకుండా వారి ఆటలు కట్టించడం కోసం గతంలో బ్యాంకులను జాతీయం చేశారు (ఇప్పుడు ప్రభుత్వ రంగ బ్యాంకులలో ప్రభుత్వ వాటా క్రమంగా తగ్గిపోతోందనుకోండి.). ఏదేమైనా మళ్ళీ పూర్వ కాలంలో మాదిరిగా గుత్త పెట్టుబడిదారీ సంస్థలు, బ్యాంకులతో కుమ్మక్కై (వాస్తవానికి ఒక్కో గుత్త సంస్థకూ ఒక్కో బ్యాంక్ ఉంది) కొల్లగొట్టే పరిస్థితి ఏర్పడింది. బ్యాంక్ రుణాల పంపిణీ మీద సామాజిక నియంత్రణ క్రమంగా లేకుండా పోయే పరిస్థితి వచ్చింది.

ఇప్పుడు దీనికి తోడు బ్యాంకుల యాజమాన్యమే విదేశీ సంస్థల చేతుల్లోకి పోయిందనుకోండి. అప్పుడు పేదలు, మధ్య తరగతి బ్యాంక్ రుణాలకు మరింత దూరం అవుతారు. బడా పెట్టుబడిదారులు బ్యాంక్ రుణాలను కాజేసి మరింత బలుస్తారు. బ్యాంకులలో దాచుకున్న ధనం మరింతగా స్పెక్యులేటివ్ కార్యకలాపాలకు మళ్ళించబడుతుంది. దేశాన్ని పాలించేది ఫాసిస్టు తరహా శక్తులైనప్పుడు వారి నుండి ఇంతకన్నా ఏం ఆశించగలం? ఈ ప్రయత్నాలను గట్టిగా ప్రతిఘటించడమే మన ముందున్న కర్తవ్యం.

(స్వేచ్ఛానుసరణ)

గజం మిథ్య! పలాయనం మిథ్య!

సుబ్రమణ్యం

ఆఫీసు నుంచి బైటపడి ఇంటి దారి పట్టేను. ఇంటి గుమ్మంలో మా పుత్రరత్నం చాలా సీరియస్‌గా "అంతా మిథ్య తలంచి చూచిన నరుండెట్లో.." అనుకుంటూ దీక్షగా తెలుగు పద్యాన్ని చదివేస్తున్నాడు. వీడికి అసలు తెలుగు సబ్జెక్టే లేదు. ఎప్పుడన్నా "ఒరే! తెలుగు పద్యం నేర్చుకోరా" అని బతిమిలాడినా, "ఇట్ ఈజ్ టోటల్ వేస్ట్ ఆఫ్ టైమ్ డాడ్!" అనేవాడు. ఇప్పుడు వీడికేమైంది?

ఆశ్చర్యపడిపోయేస్తూ గదిలోకి అడుగుపెట్టాను. ఇల్లంతా అగరుబత్తీల సుగంధ పరిమళాలు విరజిమ్ముతోంది! ఇది మరీ ఆశ్చర్యం! లోపల వంటగది లోంచి మంద్ర స్వరంతో సతీమణి కూనిరాగం వినిపించింది. ఎంత మనోజ్ఞ దృశ్యం! గదిలోకి అడుగుపెట్టాను. నాకేసి తల తిప్పి చూసి ఓ చిరునవ్వు అలవోకగా విసిరి పారేసి, "అంతా భ్రాంతియేనా, జీవితానా వెలుగింతేనా" అని బొత్తిగా ఆ సందర్భానికీ, వాతావరణానికీ అతకని పాట అందుకుంది.

"ఏవైంది నీకు?" అని అడగబోయేనో లేదో, నోటి మీద వేలుంచుకుని సైలెన్స్ అన్నట్టు సైగ చేసి మా బెడ్రూం కేసి చేయి చూపించింది. వెళ్లి చూద్దును కదా! బుర్ర తిరిగిపోయింది. అక్కడ ఓ స్వామీజీ మఠం వేసుకుని కూర్చుని మౌనంగా ఏదో తీర్థం సేవిస్తున్నాడు. అతడి పక్కన మరో ఆడ స్వామి కూడా కూర్చుని ఆమె కూడా తీర్థ సేవన సాగిస్తోంది. వాళ్ళ పాదాల దగ్గర ముగ్గురు ఉన్నారు. ఆ ముగ్గుర్లోకీ చిన్నవాడిలా ఉన్నతను దాదాపు సాష్టాంగం పడి లేవడం లేదు. తక్కిన ఇద్దరూ ఆ స్వామీజీ పాదసేవ చేస్తున్నారు.

"ఎవరు వీళ్ళు? నా ఇంటికి ఎలా వచ్చేరు? ఎందుకు వచ్చేరు?" వంటి ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి అన్నట్టు నా సతీమణి నా రెక్క పుచ్చుకుని అక్కడి నుంచి ఇవతలికి హాల్లోకి లాగి కుర్చీలో కుదేసింది. చేతిలో కాఫీ కప్పు పెట్టి దానిని తాగి నేను కాస్త కుదుట బడేందుకు ప్రయత్నిస్తూంటే అప్పుడు నెమ్మదిగా చెప్పుకొచ్చింది.

ఆ రోజు గుడికి వెళ్ళినప్పుడు అక్కడ ఈ స్వాములు తారసిల్లేరట. పూజారి వాళ్ళని పరిచయం చేసేడట. వారికి ఒక పగలు, ఒక రాత్రి ఆతిథ్యం ఇచ్చి సేవించుకుంటే మనం కోరుకున్నవన్నీ నెరవేరేట్టు ఆశీర్వదిస్తారట. అందుకే వెంటనే వాళ్ళని తాను ముందు మనింటికే ఆహ్వానించిందట. అదృష్టం! స్వామీజీ వెంటనే అందుకు సమ్మతించేరట. ఇక మన పంట పండినట్టేనట.

ఇంతకీ వీళ్ళెక్కడి స్వాములు? అనడిగేలోపు వాళ్ళ పరిచయం కాస్తా చెప్పేసింది. పూజ్య స్వామీజీ నరేంద్ర మిథ్యా స్వామి ఆ పెద్ద స్వామి పేరు. అతడి ప్రథమ శిష్యురాలు పూజ్య నిర్మలాభ్రాంతి స్వామి చాలా మేధావి ట. కింద సేవ చేస్తున్న ముగ్గురూ మన తెలుగు స్వాములేనట. సాష్టాంగపడి వున్న ఆ స్వామి పూజ్య పవన కల్యాణ చిత్తభ్రాంతి స్వామి. ఇక ఎడమ కాలు పడుతున్నది పూజ్య చంద్ర మిథ్యా స్వామి, కుడికాలు పట్టుకున్నది పూజ్య జగన్నాటక భ్రాంతి స్వామి నట.

గదిలోంచి గంట మోగింది. సతీమణి పరిగెత్తుకెళ్ళింది. చాటంత ముఖంతో బైటకొచ్చి ఐదు నిమిషాల్లో శుద్ధిగా తయారై స్వామీజీ ముందు కుటుంబం యావత్తూ కూర్చోవాలని ఆదేశం అయిందట. ఉపదేశం ఇస్తారట. గబగబా స్నానం చేసి ఓ పంచె కట్టి పైన ఓ తువ్వాలు వేసుకుని గదిలోకి వెళ్ళాను. పెద్ద స్వామీజీ రెండు కాళ్ళూ ముందుకు సాచేడు. నా సతీమణి నన్ను ఆ పాదాల మీదకి తోసింది. అప్పుడు అర్థమై కాళ్ళకి మొక్కేను. అప్పుడు స్వామి కరుణించి చిరునవ్వు చిందించేడు. అప్పుడు నిర్మలాభ్రాంతి స్వామి గంట మోగించింది. పెద్ద స్వామి నోరిప్పేడు. "నీ వాలకం చూస్తూంటే నీకేవో సందేహాలున్నట్టు అనిపిస్తోంది. వెనకాడకుండా అడిగేయ్ నాయనా !" అన్నాడు.

ఇక ఉండబట్టలేకపోయాను. "స్వామీ, ఏదో అజ్ఞానిని, మీ అందరి పేర్లలో భ్రాంతి లేదా మిథ్య అన్న పదాలు ఉన్నాయి. ఎందుకున్నాయో బోధపడక గింజుకుంటున్నాను. కాస్త దానిగురించి శలవియ్యండి." అని కోరేను.

"నువ్వు నిజంగా సూక్ష్మబుద్ధివిరా. నీకు జ్ఞానయోగం ఉపదేశిస్తాను విను." అని ఆరంభించేడు. "ఈ ప్రపంచం అంతా కేవలం ఒక మాయ. భగవంతుడి మాయ. ఆ సంగతి బోధపడకే జీవులంతా ఆ మాయనే నిజం అనుకుని భ్రాంతి చెంది అన్ని రకాల కష్టాలకూ గురౌతున్నారు. నిజానికి ఆ కష్టాలు కూడా భ్రాంతే. నీకు వివరంగా బోధపడాలంటే శంకరాచార్యులవారి ఉదంతం చెప్పాలి. ఓ సారి ఆచార్యులవారు ఆశ్రమం ఆవరణలోని చెట్టు కింద కూర్చునివున్నప్పుడు అటుకేసి ఓ ఏనుగు వచ్చిందట." అని స్వామీజీ అనగానే మావాడు

"అవును, ఆ స్టోరీ మా స్కూల్లో టీచర్ ఎప్పుడో చెప్పేశారు. అప్పటినుంచీ మాకు ఈ ర్యాంకులన్నీ ఒట్టి భ్రమే అని అర్థం అయిపోయింది." అని గబుక్కున నోటికి వచ్చినట్టు మాట్లాడేశాడు. స్వామీజీకి కోపం వచ్చిందేమో అనుకున్నాను. కాని ఆయన స్వామీజీ కదా. అందుచేత చిరునవ్వుతో నా పుత్రరత్నాన్ని అభినందించేడు. వాడు తండ్రికి తగ్గ తనయుడని అభినందించేడు. ఆ తర్వాత తన జ్ఞానబోధ కొనసాగించేడు. ఐతే ఈ సారి ఇక కథల జోలికి పోలేదు. ఓ గంట సేపు స్వామి చేసిన బోధనలను విన్నాను. తక్కిన స్వామిగణం అంతా ఆ బోధనలకు తన్మయులైపోయి (రోజూ వింటున్నా వారికి ఆ తన్మయత్వం ఎందుకొచ్చిందో మరి) ఊగుతున్నారు. ఆ తర్వాత నిర్మలాభ్రాంతి స్వామి మళ్ళీ గంట మోగించింది. అప్పుడు పెద్ద స్వామి మళ్ళీ మౌన ముద్ర దాల్చేరు. వెంటనే పవన కల్యాణ చిత్త భ్రాంతి స్వామి ఆయన కాళ్ళ మీద పడిపోయి అలాగే ఉండిపోయేడు. చంద్ర మిథ్యా స్వామి, జగన్నాటక భ్రాంతి స్వామి ఎవరి వాటా కాలును వాళ్ళు ఒత్తడం మొదలెట్టేరు.

ఆ రాత్రి తెల్లారాక స్వాములంతా మా కుటుంబాన్ని ఆశీర్వదించి బైటకు వెంచేసేరు. నేను నిన్న రాత్రి బోధనల తన్మయత్వంలోనే ఉన్నాను, ఆ సరికి పక్కింటి సుబ్బారావు రోజూలాగానే చేత్తో ఓ పేపరు పట్టుకుని వొచ్చేడు. ఇన్నాళ్ళూ అతగాడినుంచి నాకు తెలియని, బోధపడని విషయాలను తెలుసుకుంటూ వుండేవాడిని. ఈ రోజు నుంచి నాకా అవసరం లేదని సుబ్బారావుకి పాపం, తెలియదుగా. అందుకని మామూలుగానే వచ్చీసేడు. కాని మామూలుగా ఇంట్లోంచి రావలిసిన కాఫీ రాలేదు. కాస్త అయోమయంలో పడినా, సర్దుకుని పేపర్ తెరిచేడు సుబ్బారావు. "హిండెన్‌బర్గ్ రిపోర్టులో ఆరోపించినట్టు అదానీ కంపెనీలు ఏవీ ఎటువంటి అవకతవకలకూ పాల్పడలేదు అని సెబి రిపోర్టు ఇచ్చింది." అన్నాడు. "ఏమిటా రిపోర్టు? ఏమా కథ?" అని నేను మామూలుగానైతే అడగాలి. సుబ్బారావు కూడా అదే ఎక్స్‌పెక్ట్ చేసినట్టున్నాడు. కాని నేను చిరునవ్వు తో " అవును. అదంతా మిథ్య" అన్నాను. సుబ్బారావు బుర్ర తిరిగిపోయింది. కాని తమాయించుకుని రైతులు యూరియా వాడకం తగ్గించేస్తేనే వారికి మేలు అన్న చంద్రబాబు అని చదివేడు. " అవును, అసలు యూరియా యే పెద్ద భ్రాంతి" అన్నాను. సుబ్బారావు నా సంగతి అర్థం కాక బుర్ర గోక్కున్నాడు. వోటర్ల లిస్టుల్లో పెద్ద సంఖ్యలో పేర్లు గల్లంతు వెనక కుట్ర ఉందని రాహుల్ గాంధీ ఆరోపణ అని చదివేడు. "అసలు వోటే మిథ్య. అది గల్లంతైందనుకోవడం మన భ్రాంతి" అన్నాను. ఇక సుబ్బారావు పేపర్ ని మడిచిపెట్టుకుని వాళ్ళ ఇంటికి చకచకా వెళ్ళిపోయేడు.

> "అంతా భ్రాంతి, జగన్మిథ్య, ప్రపంచ బ్యాంకే సర్వస్వం" అన్న చంద్ర మిథ్యా స్వామి పలుకులని, "అదానీ సత్యం, భారతదేశం భ్రాంతి" అన్న నరేంద్ర మిథ్యా స్వామి మంత్రాన్ని, "నరేంద్ర స్వామిని నమ్ముకో. నీకు అదే ముక్తి" అన్న జగన్నాటక భ్రాంతి స్వామి సలహాని, "సనాతనత్వం అంటే ఇదే అని తెలుసుకో" అన్న పవన కల్యాణ చిత్త భ్రాంతి స్వామి సందేశాన్ని, చివర్లో నా చెవిలో "పేదరికం భ్రాంతి, జిడిపి యే సత్యం" అన్న నిర్మాలానంద భ్రాంతి స్వామి ఉపదేశించిన మంత్రాన్ని స్మరించుకుంటూ గడిపేస్తున్నాను. మీరూ ఈ జ్ఞానాన్ని గ్రహించి దు:ఖాల నుండి బైట పడండి మరి!

ఇంతలో నా సతీమణి వచ్చి "ఏమండీ! ఆఫీసుకి తయారు అవరా? టైమవుతోంది" అంది. "పిచ్చిదానా! ఆఫీసేవిఁటి? ఉద్యోగం ఏవిఁటి? అంతా మిథ్య అని తెలుసుకోలేకపోతున్నావు." అన్నాను. "అవున్నాన్నా, నీ ఆఫీసు మాటేవిఁటో గాని నా స్కూలు మాత్రం ఖచ్చితంగా మిథ్యే" అని నా పుత్రరత్నం క్రికెట్ బ్యాట్ పుచ్చుకుని వీధిలోకి పరిగెత్తేడు. వాడి జ్ఞానానికి నేను ముచ్చట పడ్డాను. కాసేపు తర్వాత సతీమణి వచ్చి "నా దసరా చీర ఏం చేశారు?" అనడిగింది. "నిన్న ఒక రోజు రోజంతా సేవ చేసినా నీకు జ్ఞానోదయం కలగలేదేవిఁటే? దసరా మిథ్య, చీర భ్రాంతి. పైగా ఆ చీరని నేను కొనితేవాలనుకోవడం డబుల్ మిథ్య, త్రిబుల్ భ్రాంతి" అన్నాను. ఆ తర్వాత ఏమైందో నాకు తెలియలేదు.

మళ్ళీ తెలివి వచ్చేసరికి నేను ఏదో ఆస్పత్రిలో ఉన్నాను. కాస్సేపట్లో డాక్టర్ గారు వచ్చేరు. "ఏం సార్! ఎప్పటినుంచీ మీకిట్లా అనిపిస్తోంది?" అని అడిగేరు. "నేనిక్కడ ఎందుకు ఉన్నాను? నాకేమైంది? ఏమిటీ మాయ?" అని అడిగేను. "ఆ! అదే అదే! ఈ మాయ, భ్రాంతి వంటి ఆలోచనలు ఎప్పటి నుంచి?" అని డాక్టర్ గారు మళ్ళీ అడిగేరు. "నాకు నిన్ననే జ్ఞానోదయం అయింది డాక్టరు గారూ ! నాకేమీ జబ్బు లేదు. నన్ను ఇంటికి పోనివ్వండి" అంటూ మంచం మీదనుంచి లేవబోయాను. వెంటనే ఇద్దరు దుక్కలా ఉన్న అటెండెంట్లు నన్ను కదలకుండా పట్టుకున్నారు. డాక్టరు గారు నా సతీమణితో "జబ్బు తీవ్రత ఎక్కువగా ఉందమ్మా. ముందు ఆ స్వాముల సంగతి వెంటనే తేల్చకపోతే ఇలాంటి పేషెంట్లు ఇంకా చాలామంది తయారయ్యే ప్రమాదం ఉంది. ముందు ఆ సంగతి చూడాలి. కొన్నాళ్ళు ఇతగాడిని ఇక్కడే ఉండనివ్వండి." అంటున్నాడు.

"అంతా భ్రాంతి, జగన్మిథ్య, ప్రపంచ బ్యాంకే సర్వస్వం" అన్న చంద్ర మిథ్యా స్వామి పలుకులని, "అదానీ సత్యం, భారతదేశం భ్రాంతి" అన్న నరేంద్ర మిథ్యా స్వామి మంత్రాన్ని, "నరేంద్ర స్వామిని నమ్ముకో. నీకు అదే ముక్తి" అన్న జగన్నాటక భ్రాంతి స్వామి సలహాని, "సనాతనత్వం అంటే ఇదే అని తెలుసుకో" అన్న పవన కల్యాణ చిత్త భ్రాంతి స్వామి సందేశాన్ని, చివర్లో నా చెవిలో "పేదరికం భ్రాంతి, జిడిపి యే సత్యం" అన్న నిర్మాలానంద భ్రాంతి స్వామి ఉపదేశించిన మంత్రాన్ని స్మరించుకుంటూ గడిపేస్తున్నాను. మీరూ ఈ జ్ఞానాన్ని గ్రహించి దు:ఖాల నుండి బైట పడండి మరి!

★

కరేబియన్ లీగ్ 2025 విజేత నైట్‌రైడర్స్

- ఫైనల్లో అమెజాన్ వారియర్స్‌పై గెలుపు

గయానా: కరేబియన్ లీగ్-2025 టైటిల్‌ను ట్రిన్‌బాగో నైట్‌రైడర్స్ 5వ సారి చేజిక్కించుకుంది. సోమవారం జరిగిన ఫైనల్లో నైట్‌రైడర్స్ జట్టు మూడు వికెట్ల తేడాతో అమెజాన్ వారియర్స్‌ను చిత్తుచేసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన అమెజాన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 130 పరుగులకే పరిమితం కాగా.. ఆ లక్ష్యాన్ని నైట్‌రైడర్స్ 18 ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. నైట్‌రైడర్స్ ఓపెనర్ అలెక్స్ హేల్స్(26), కోలిన్ మున్రో(23), నరైన్(22) బ్యాటింగ్‌లో రాణించగా.. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఆకెల్ హొసైన్‌కు సిరీస్ కీరన్ పొలార్డ్‌కు దక్కాయి.

దుర్గమ్మ పేరుతో కూటమి నేతల దోపిడీ

- మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దుర్గమ్మ పేరుతో కూటమి నేతలు దోపిడీకి కొత్త ప్లాను రూపొందించారని, దీనికి విజయవాడ ఉత్సవ్ అని పేరు పెట్టారని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. సోమవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. దుర్గమ్మ ఉత్సవాల పేరుతో కొత్త దోపిడీకి ప్లాను వేశారని, కోట్లాది రూపాయలు దోపిడీకి ప్రణాళిక సిద్ధం చేశారని తెలిపారు. ప్రభుత్వ స్థలాలు వాడుకుంటూ ఏర్పాట్లు చేసే స్టాళ్ల కోసం లక్షల్లో అద్దె వసూలు చేస్తున్నారని తెలిపారు. కళాకారుల పేరుతోనూ భారీ దోపిడీ చేస్తున్నారని అన్నారు. బుక్‌మై షో ద్వారా భారీగా టికెట్ల ధరలు వసూలు చేస్తున్నారని తెలిపారు. కళాకారులు, ప్రదర్శనలకు తాము వ్యతిరేకం కాదని, వారి పేరుతో జరుగుతున్న వసూళ్లపైనే అభ్యంతరమని వివరించారు. ఉత్సవాల పేరుతో భారీ దోపిడీ జరుగుతోందని, కోట్లాది రూపాయలు ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయో చెప్పాలని ప్రశ్నించారు. వ్యాపారవేత్తలు, కళాశాలలు ఇచ్ఛితంగా స్టాల్స్ పెట్టాల్సిందేనని, లేకపోతే ఐటి, జిఎస్‌టి అధికారులతో దాడులు చేయిస్తామని బెదిరిస్తున్నారని అన్నారు. దసరా ఉత్సవాలకు వచ్చేవారిలో ఎక్కువమంది పేదలే ఉంటారని, అటువంటి వారి నుండి దోచుకునేందుకు టిడిపి నాయకులు సిద్ధమయ్యారని తెలిపారు. దసరా ఉత్సవాల సమయంలో కనకదుర్గమ్మ గురించి ఎక్కడా ప్రచారం లేదని, మొత్తం విజయవాడ ఉత్సవ్ 'పేరుతో' ప్రచారం చేస్తున్నారని తెలిపారు. వైబ్రెంట్ విజయవాడను ఎంపి కేశినేని శివనాథ్ పేరుతో రిజిస్టర్ చేశారని, జిఎస్‌టిలోనూ నమోదు చేయించారని అన్నారు. దానికి ఫండ్స్ రూపంలో కోట్ల రూపాయల దోపిడీకి ప్లాను చేశారని, ఇటువంటి దోపిడీని వైసిపి పక్షాన ప్రశ్నిస్తూనే ఉంటామని అన్నారు. అలాగే ప్రైవేటు మెడికల్ కళాశాలల అంశాన్ని తప్పుదోవ పట్టించేందుకు టిటిడి అంశాన్ని ముందుకు తెచ్చారని, 2023లో జరిగిన ఘటనను ఇప్పుడు చూపిస్తూ కావాలని రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. ఈ విషయంలో టిటిడి బ్రాండ్ దేవాలయ ప్రతిష్టను మసకబార్చే విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

నూజివీడు సీడ్స్ వ్యవస్థాపక ఛైర్మన్ వెంకట్రామయ్య మృతి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఏలూరు జిల్లా నూజివీడు మండలంలోని తుక్కులూరు గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, నూజివీడు సీడ్స్ వ్యవస్థాపక ఛైర్మన్, పి4 పథకంలో మార్గదర్శి మండవ వెంకటరామయ్య సోమవారం ఆకస్మికంగా మృతి చెందారు. పలు సేవా కార్యక్రమాలు, పేదలకు అనేక సహాయ సహకారాలు అందించి అన్ని తరగతుల ప్రజల ఆదరాభిమానాలను పొందారు. భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్, కైకలూరుఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, విజయవాడ ఎమ్మెల్యే సుజనా చౌదరి.... మండవ వెంకటరామయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎందరో మహనీయులకు, నేటితరం యువ నాయకులకు మండవ వెంకట్రామయ్య ఆదర్శనీయమన్నారు. వెంకట్రామయ్య మృతి రాష్ట్రానికి తీరని లోటుగా పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ వెంకటరమణ రాజీనామాపై
హైకోర్టు తీర్పు వాయిదా

ప్రజాశక్తి, అమరావతి

చట్టసభ సభ్యుల రాజీనామాలను ఆమోదించాలో లేదో... అనేది పూర్తిగా శాసనమండలి ఛైర్మన్, శాసనసభ స్పీకర్ పరిధిలోనే ఉంటుందని హైకోర్టులో మండలి ఛైర్మన్ తరపున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్ రెడ్డి వాదించారు. ఇది న్యాయ సమీక్షకు సంబంధం లేని అంశమని పేర్కొన్నారు. చట్టసభ సభ్యులపై అనర్హత అంశానికి, ఆ సభ్యుల రాజీనామా వ్యవహారాలకు వ్యత్యాసం ఉందని చెప్పారు. మండలి ఛైర్మన్, స్పీకర్‌లకు కోర్టులు ఆదేశాలు ఇవ్వజాలవని సుప్రీం కోర్టు కూడా చెప్పిందన్నారు. వైసిపి ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ రాజీనామాను ఆమోదించేలా మండలి ఛైర్మన్‌కు ఉత్తర్వులు ఇవ్వాలంటూ దాఖలైన పిటిషన్‌లో మండలి ఛైర్మన్ తరపున ఆయన సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ ఎదుట వాదనలు వినిపించారు. రాజీనామా చేసిన ప్రతీ ప్రజా ప్రతినిధిని మండలి ఛైర్మన్ వ్యక్తిగతంగా విచారణ చేసి తుది నిర్ణయం తీసుకోవాల్సివుంటుందని చెప్పారు. దీనిపై రాష్ట్రం తరపున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ ప్రతివాదన చేస్తూ, రాజీనామాను ఆమోదించకపోవడాన్ని పిటిషనర్ సవాల్ చేశారని చెప్పారు. చట్టసభలో సభ్యత్వ పదవి ఖాళీగా ఉండటానికి వీల్లేదన్నారు. వెంకట రమణ న్యాయవాది వాదిస్తూ, పిటిషనర్ రాజీనామాను ఆమోదించేలా మండలి ఛైర్మన్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వాదనల తర్వాత హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. వెంకటరమణ ఎమ్మెల్సీ పదవికి 2024 నవంబరులో రాజీనామా చేసి జనసేనలో చేరారు.

'కస్తూరిబా గాంధీ' బోధన సిబ్బంది తొలగింపుపై
విచారణ నేటికి వాయిదా

ప్రజాశక్తి, అమరావతి

కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాలు వంటి సర్వశిక్షాభియాన్ పథక విద్యా సంస్థల్లో బోధనా సిబ్బంది నియామకం వార్షిక విధానంలో ఉంటుందని కేంద్రం హైకోర్టుకు చెప్పింది. శాశ్వత పద్ధతిలో కాకుండా ఏ ఏడాదికి ఆ ఏడాది నియామకాలు ఉంటాయని తెలిపింది. ఇది విధాన నిర్ణయమని చెప్పింది. దీనిపై హైకోర్టు.. విద్యా హక్కు చట్టం కింద అందరూ చదువుకోవాలని చెబుతున్న ప్రభుత్వం మరోవైపు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు వీలుగా శాశ్వత ప్రాతిపదికన బోధనా సిబ్బందిని నియమించకపోవడం ఏమిటని ప్రశ్నించింది. వార్షిక పద్ధతిలో బోధనా సిబ్బందిని నియమించడం విధాన నిర్ణయం అని చెబుతున్నందున తాము జోక్యానికి ఆస్కారం తక్కువని అభిప్రాయపడింది. కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల్లో పార్ట్‌టైం పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు (పీజీటీ)ను తొలగించడంపై దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మ ధర్మాసనం విచారించింది. కోర్టు సహాయకారి (అమికస్ క్యూరీ)గా సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తిని నియమించింది. సోమవారం కేంద్రం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ వాదించారు. విచారణను గురువారానికి వాయిదా పడింది.

కొరియా ఓపెన్ టైటిల్ విజేత స్వైటెక్

- ఫైనల్లో అలెగ్జాండ్రోవాపై గెలుపు

సియోల్: పోలాండ్ స్టార్ క్రీడాకారిణి ఇగా స్వైటెక్ తన ఖాతాలో మరో టైటిల్ జమ చేసుకుంది. ఆదివారం రాత్రి కొరియా ఓపెన్ డబ్ల్యూటిఎ-500 టైటిల్ విజేతగా నిలిచింది. ఫైనల్లో ప్రపంచ రెండో ర్యాంకర్ స్వైటెక్ 1-6, 7-6(7-3), 7-5తో రెండో సీడ్ అలెగ్జాండ్రోవా(రష్యా)ను చిత్తుచేసింది. స్వైటెక్ కెరీర్‌లో ఇది 25వ సింగిల్స్ టైటిల్‌కాగా... ఈ ఏడాది మూడో టైటిల్. 2 గంటల 41 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో స్వైటెక్‌కు గట్టిపోటీ ఎదురైంది. కేవలం రెండు ఏస్‌లు సంధించిన స్వైటెక్ ఏకంగా తొమ్మిది డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయిన ఈ పోలాండ్ స్టార్ ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. విజేతగా నిలిచిన స్వైటెక్‌కు భారత కరెన్సీలో కోటి 44లక్షల ప్రైజ్‌మనీతో పాటు 500 ర్యాంకింగ్ పాయింట్లు దక్కాయి.

టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ — డిమాండ్ నోటీసు

సంప్రదించవలసిన చిరునామా : 11వ అంతస్తు, టవర్ ఎ, పెనిన్సుల బిజినెస్ పార్క్, గణపత్‌రావు కదం మార్గ్, లోయర్ పారెల్, ముంబాయి 400013 సంప్రదించాల్సిన నం. (022) 66069383.

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ("రూల్స్") యొక్క రూల్ 3తో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 ("యాక్ట్") యొక్క సెక్షన్ 13(2) క్రింద.

ఏదైతే టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (టిసిహెచ్‌ఎఫ్‌ఎల్) యొక్క ఆధీకృత అధికారి అయిన దిగువ సంతకందారుడు చట్టం క్రింద మరియు రూల్స్ యొక్క రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద అధికారాలను అధ్యయనం చేస్తూ రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీతల(లు)/హామీదారు(లు) (ఒక్కరు లేదా "అబ్లిగర్స్/చట్టబద్ధవారసు(లు)/చట్టబద్ధప్రతినిధు(లు) జాబితా దిగువ ఇవ్వడమైనది, సంబంధిత డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తం చెల్లించుటకు, సంబంధిత నోటీసు యొక్క తేది నుండి 60 రోజులలోగా, వివరాల ప్రకారం దిగువన ఇవ్వడమైనది. సదరు నోటీసుల కాపీలు రిజిస్టర్డ్ పోస్ట్ ఎ.డి. ద్వారా పంపించడం జరిగింది మరియు దిగువసంతకందారుడుతో అందుబాటులో ఉంటుంది మరియు సదరు అబ్లిగర్స్/చట్టబద్ధవారసుడు(లు)/చట్టబద్ధ ప్రతినిధి(లు), కాబట్టి వారి కోరిక మేరకు, సాధారణ కార్యాలయ వేళలో దిగువసంతకందారు నుండి సంబంధిత కాపీని పొందవచ్చు.

పైదానికి అనుసందానంగా, ఇక్కడ నోటీసు ఇవ్వడమేమనగా, మరొక సారి, సదరు అబ్లిగర్స్/చట్టబద్ధవారసుడు(లు)/చట్టబద్ధ ప్రతినిధి(లు) లోను అగ్రిమెంట్ మరియు ఇతర డాక్యుమెంట్‌లు/వ్రాతపూర్వాకాలు చదువుతూ, చెల్లింపులు మరియు/లేదా తెలుసుకున్న తేది నుండి దిగువ కాలమ్ (డి) లో పేర్కొన్న సంబంధిత తేది నుండి దిగువ వివరించిన వడ్డీతో కలపుకొని సంబందిత పేర్లకు ఎదురుగా దిగువ గుర్తించిన మొత్తాన్ని సంబంధిత నోటీసు/లు తేది నుండి 60 రోజులలోగా టిసిహెచ్‌ఎఫ్‌ఎల్‌కు చెల్లించవలెను, ఒకవేళ, సదరు లోన్ అగ్రిమెంట్ మరియు ఇతర డాక్యుమెంట్లు రాసి ఇచ్చినవారు(లు) ద్వారా అమలు జరిగినట్లయితే. లోను తిరిగిచెల్లించుటకు బకాయిల కొరకు సెక్యూరిటీగా ఉంచబడింది, సదరు బాండ్ రాసి ఇచ్చినవారు(లు) చే టిసిహెచ్‌ఎఫ్‌ఎల్‌కు దిగువ సెక్యూర్డ్ ఆస్తు(లు) తాకట్టుపెట్టబడింది.

క్ర. సం.	రుణ ఖాతా నం.	బాధ్యులు/చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధుల పేరు	దిగువ తేదీ నాటికి పూర్తి బకాయి మొత్తాలు (రూ)	డిమాండ్ నోటీసు తేది మరియు ఎన్‌పిఏ తేది
1.	10594138.	1. శ్రీ.మహంకాళి పూర్ణ చంద్రరావు (రుణగ్రహీత) 2. శ్రీమతి.మహంకాళి లక్ష్మి (సహ-రుణగ్రహీత'లు)	08-09-2025 నాటికి రూ.52,04,554/- (యాభై రెండు లక్షల నాలుగు వేల ఐదు వందల యాభై నాలుగు రూపాయలు మాత్రమే)	09-09-2025 & 03-09-2025

సెక్యూర్డ్ ఆస్తులు/స్థిరాస్తులు/తనఖా పెట్టిన ఆస్తులు వివరణ:- విస్తీర్ణత 250 చ.గ.లు లేదా 209.02 చ.మీ.ల సైటు అక్కడ వున్న నిర్మాణములతో కలిగి వున్న ఆర్ఎస్ నం.519/1బి, మూల్యాంకనం నం.1145001165, డోర్.నం.17-47, {మూల్యాంకనం నం.1145001165, మహాలక్ష్మి గుడి వెనుక} నందిగామ, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్., శ్రీ.మహంకాళి పూర్ణచంద్రరావు పేరు మీద వున్న సైడ్ సెటిల్‌మెంట్ డీడ్ నం.2288/2019. తూర్పు: నారాయణ అయ్యర్ భూమి; దక్షిణం: సర్కార్ వీధి; పడమర: సర్కార్ భూమి; ఉత్తరం: సుబ్బారావు హోటల్;

రియలైజేషన్ మరియు/లేదా చెల్లింపు తేది వరకు యాదృచ్ఛిక ఖర్చులు, ఖర్చులు, ఛార్జీలు మొదలైనవాటితో కలిపి పైన పేర్కొన్న సంబంధిత డిమాండ్ నోటీసులలో మరింత ప్రత్యేకంగా వివరించిన రేటుకు అదనపు వడ్డీ, తదుపరి వడ్డీతో. పైన పేర్కొన్న విధంగా టిసిహెచ్‌ఎఫ్‌ఎల్‌కు చెల్లింపు చేయడంలో సదరు అబ్లిగర్స్ విఫలంచెందినట్లయితే, సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద పై సెక్యూర్డ్ అస్సెట్(లు)/స్థిరాస్తు(లు) ఎదురుగా టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ తదుపరి చర్యలు సిద్ధమవుతుంది మరియు ఖర్చులు మరియు తదుపరి పర్యావసనాలకు అబ్లిగర్స్/చట్టబద్ధవారసు(లు)/చట్టబద్ధప్రతినిధు(లు) వర్తించే నియమాలకు మొత్తం బాధ్యత వహిస్తారు. అబ్లిగర్స్/చట్టబద్ధవారసు(లు)/చట్టబద్ధప్రతినిధు(లు) టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ వారి ముందస్తు అనుమతి లేకుండా ఏవిధంగాను అమ్ముట, విక్రయించుట లేదా ఇతర ఏ రకంగాను ముందు చెప్పిన సెక్యూర్డ్ అస్సెట్(లు)/స్థిరాస్తు(లు) బదిలీ చేయడం చట్టం క్రింద నిషేధించబడింది. చట్టం యొక్క నిబంధనలను లేదా దానిపై చేసిన నిబంధనలను ఉల్లంఘించే లేదా ప్రోత్సహించే ఏ వ్యక్తి అయినా చట్టం ప్రకారం అందించిన విధంగా జైలు శిక్ష మరియు/లేదా జరిమానా విధించబడతాయి.

ప్రదేశం : ఆంధ్రప్రదేశ్
తేది : 23.09.2025
సం/- అధీకృత అధికారి
టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్., తరఫున

కెనరా బ్యాంక్ Canara Bank

ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీసు, డి.నెం. 54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మి అవెన్యూ, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ-520008, ఫోన్: 8331011695, ఇ-మెయిల్: armvij@canarabank.com

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
1. M/s లక్ష్మీ వినాయక ట్రేడర్స్, ప్రొప్రయిటర్: శ్రీ సనం కోటేశ్వరరావు, తండ్రి: రమణరావు, డోర్ నెం. 25-3-81, అడపావారి వీధి, ఆర్. అగ్రహారం, గుంటూరు-522004 (ఋణగ్రహీత).
2. శ్రీ సనం కోటేశ్వరరావు, తండ్రి: రమణరావు, డోర్ నెం. 25-3-81, అడపావారి వీధి, ఆర్. అగ్రహారం, గుంటూరు-522004 (ఋణగ్రహీత).

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ రూల్స్, 2002 (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును) క్రింద చదవబడు రూల్ 8(6) అనుసరించి నోటీసు.

కెనరా బ్యాంక్, ఎఆర్‌ఎమ్ బ్రాంచ్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్" గా రిఫర్ చేయబడును), సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును) సెక్షన్ 13(8) క్రింద చదవబడు రూల్ 8(6) సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 రూల్స్ (ఇక మీదట "రూల్స్"గా రిఫర్ చేయబడును) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది.

ఋణగ్రహీత/సంస్థ M/s లక్ష్మీ వినాయక ట్రేడర్స్, ప్రొప్రయిటర్: శ్రీ సనం కోటేశ్వరరావు, తండ్రి: రమణరావు వారిని లోను అకౌంట్‌కు సంబంధించిన బకాయి **రూ. 4,33,75,070/- (అక్షరాల నాలుగు కోట్ల ముప్పై మూడు లక్షల డెబ్బై ఐదు వేల డెబ్బై రూపాయలు మాత్రమే)** మరియు వడ్డీతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి **చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద 12.03.2025** తేదిన మీకు డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో ఋణగ్రహీత/సంస్థ తనఖాదారు మరియు హామీదారులు (పైన తెలిపిన పేర్లు) విఫలమైనందున **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి **తేది.17.06.2025** న మీ సెక్యూర్డ్ ఆస్తులను సదరు చట్టం నందలి సెక్షన్ 13(4) క్రింద లాంఛనాత్మక /భౌతికంగా **స్వాధీనం తీసుకున్నారు** మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును **సాక్షి (తెలుగు) మరియు ది హిందూ (ఇంగ్లీష్)** వార్తాపత్రికలలో తేది.22.06.2025న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది. **19.09.2025** నాటికి చెల్లించవలసిన బకాయి **రూ. 4,79,32,723.30 (అక్షరాల నాలుగు కోట్ల డెబ్బై తొమ్మిది లక్షల ముప్పై రెండు వేల ఏడు వందల ఇరవై మూడు రూపాయలు మరియు ముప్పై పైసలు మాత్రమే)**, + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు సర్ఫేసీ చట్టం, 2002, నందలి రూల్ 8(6) ప్రకారం మీకు ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది.

(ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయువారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారినుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజలనుండి టెండరు ఆహ్వానించుట లేదా సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటీ. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

తనఖాపెట్టిన స్థిరాస్తి వివరములు

రిజిష్టర్డ్ రిలింక్విష్‌మెంట్ డీడ్ డాక్యుమెంట్ నెం. 11708/2003, తేది.11-12-2003 ప్రకారం. గుంటూరు జిల్లా, గుంటూరు సబ్-జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, టౌన్ అన్‌సర్వే ఆర్. అగ్రహారం, డి.నెం. 27, బ్లాక్ నెం. 9, పట్టా నెం. 1053, పైమాయిషి నెం. 80, యుఎల్‌సి డి.నెం. 27/2సి,2ఇ ప్రకారం, 1000 చ॥గ॥ల లేదా 836.13 చ॥మీ॥ల విస్తీర్ణంలోని స్థలం. హద్దులు డీడ్ ప్రకారం.

రిజిష్టర్డ్ రిలింక్విష్‌మెంట్ డీడ్ డాక్యుమెంట్ నెం. 10009/2004, తేది.09-08-2004 ప్రకారం. గుంటూరు జిల్లా, గుంటూరు సబ్-జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, టౌన్ అన్‌సర్వే ఆర్. అగ్రహారం, డి.నెం. 27, బ్లాక్ నెం. 9, పట్టా నెం. 1053, పైమాయిషి నెం. 80, యుఎల్‌సి డి.నెం. 27/2సి,2ఇ ప్రకారం, 25 చ॥గ॥ లేదా 20.90 చ॥మీ॥ల విస్తీర్ణంలోని స్థలం. హద్దులు డీడ్ ప్రకారం.

టైటిల్ హోల్డర్ : శ్రీ సనం కోటేశ్వరరావు, తండ్రి: రమణరావు.

తేది: 19.09.2025, ప్రదేశం: విజయవాడ — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

ది కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్.,

HO : అక్కయ్యపాలెం, విశాఖపట్నం,
విజయవాడ బ్రాంచ్, # 54-20-18, గురునానక్ కాలనీ రోడ్డు, NAC ఫంక్షన్ హాల్ దగ్గర, మెడ్‌ప్లస్ మెడికల్ షాప్ ప్రక్కన, విజయవాడ-520008, ఎన్‌టిఆర్ జిల్లా. ఫోన్ : 08866-2544222

అనుబంధం [IV] **స్వాధీనత ప్రకటన**

(రూల్ 8(1) క్రింద సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (54 ఆఫ్ 2002) క్రింద **ది కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్., విజయవాడ బ్రాంచ్, ఎన్‌టిఆర్ జిల్లా** యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారుడు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 లో రూల్ 3 తో కలిపి చదువవలసిన సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొనబడిన మరియు వాటిపై వడ్డీతో తిరిగి చెల్లించవలసినదిగా క్రింద పేర్కొనబడిన ఋణగ్రహీలు / హామీదారులను కోరుతూ దిగువ ఉదహరించిన తేదీలలో డిమాండ్ నోటీసులను జారీ చేసినారు.

ఋణగ్రహీతలు/హామీదారులు సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీతలు/హామీదారులు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా సదరు రూల్సు యొక్క 8వ రూలోతో కలిపి చదువుకోవలసిన సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ సంతకందారు క్రింద సూచించిన తేదీలలో దిగువ వివరించిన ఆస్తిపై **స్వాధీనత** తీసుకొన్నారు.

సాధారణ ప్రజానీకానికి ముఖ్యముగా ఋణగ్రహీతలు/హామీదారులు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎట్టి లావాదేవీలు జరుపరాదు మరియు సదరు ఆస్తులకు సంబంధించిన ఎట్టి లావాదేవీలైన వారి పేర్లు ఎదురుగా పేర్కొనబడిన బాకీలను మొత్తములకు మరియు వానిపై వడ్డీ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలుకు **ది కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్., విజయవాడ బ్రాంచ్, ఎన్‌టిఆర్ జిల్లా** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.

ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 (8) లోని నిబంధనలు గమనించవలెను.

1. **ఋణగ్రహీతలు/తనఖాదారులు : 1) శ్రీ హర్ష ఇన్నోవేటివ్ ఎడ్యుకేషనల్ సొసైటీ, కరస్పాండెంట్ : శ్రీమతి నూకవరపు మాధవి**, డోర్ నెం.56-10-40, ఫ్లాట్ నెం.10, పి & టి కాలనీ-3, పటమట-520008. **హామీదారులు : 2) శ్రీమతి యలమంచిలి స్వరాజ్యలక్ష్మి**, డోర్ నెం.56-10-40, ఫ్లాట్ నెం.10, P & T కాలనీ-3, C M మాన్షన్, వెనటేశ్వరపురం, పటమట-520008. **3) శ్రీ నూకవరపు హనుమయ్య చౌదరి**, డోర్ నెం.56-10-40, ఫ్లాట్ నెం.10, పి & టి కాలనీ-3, పటమట-520008. **4) శ్రీమతి నూకవరపు మాధవి**, డోర్ నెం.56-10-40, ఫ్లాట్ నెం.10, పి & టి కాలనీ-3, పటమట-520008. **5) శ్రీ కాటూరి అభిషేక్ రాజు**, డోర్ నెం.4-132/బి, సూరంపల్లె-521212.

1) OD అగైనెస్ట్ ఆస్తి-1025024000001: చెల్లించవలసిన ఋణం, వడ్డీ మరియు ఇతర ఖర్చులు : తేది.31.05.2025 నాటికి రూ.2,09,42,317/- (అక్షరాల రెండు కోట్ల తొమ్మిది లక్షల నలభై రెండు వేల మూడు వందల పదిహేడు రూపాయలు మాత్రమే) + తేది.01.06.2025 నుండి వడ్డీ, ఇతర చార్జీలు.

2) బిజినెస్ లోన్-1025059000005: చెల్లించవలసిన ఋణం, వడ్డీ మరియు ఇతర ఖర్చులు : తేది.31.05.2025 నాటికి రూ.99,62,790/- (అక్షరాల తొంభై తొమ్మిది లక్షల అరవై రెండు వేల ఏడు వందల తొంభై రూపాయలు మాత్రమే) + తేది.01.06.2025 నుండి వడ్డీ, ఇతర చార్జీలు.

డిమాండ్ నోటీసు తేది : 10.06.2025 — **స్వాధీనత నోటీసు తేది : 17.09.2025**

స్థిరాస్తి వివరములు : షెడ్యూల్ : విజయవాడ, పటమట ఎస్ఆర్ఓ, గణపతి సచ్చిదానంద ఆశ్రమం రోడ్డు, ఆర్ ఎస్ నెం.172/2B నందు విస్తీర్ణం 428.80 చ॥గ॥లులోని ఇంజనీరింగ్ వాల్యుయేషన్ రిపోర్ట్ ప్రకారం ఫ్లింత్ ఏరియా 8278 చ॥అ॥లు (2332+2973+2973) మరియు డాక్యుమెంట్ ప్రకారం ఫ్లింత్ ఏరియా 6156 చ॥అ॥లు (2052*3)తో ఆర్‌సిసి రెసిడెన్షియల్ భవనం (G+2) తో కలదు. **హద్దులు : టైటిల్ డీడ్ ప్రకారం : తూర్పు** : యడ్లపల్లి రాజ్యలక్ష్మి గారి ఆస్తి – 40.9 అ॥లు, **దక్షిణం** : కూరేటి భాగ్యలక్ష్మి గారి ఆస్తి – 92.0 అ॥లు, **పడమర** : కార్పొరేషన్ రోడ్డు – 40.0 అ॥లు, **ఉత్తరం** : ఆంబోతుల రామమోహన రావు గారి ఆస్తి – 92.0 అ॥లు.

తేది : 17.09.2025
స్థలం : విజయవాడ
సం/- అధీకృత అధికారి
ది కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ లి., విజయవాడ బ్రాంచ్, ఎన్‌టిఆర్ జిల్లా

మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

గతంలో మణప్పురం హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్
సిఐఎన్: U65923K12010PIC039179, యూనిట్ నం.301 నుండి 315, ఎ వింగ్, కనకియ వాల్ స్ట్రీట్, అందేరి-కుర్ల రోడ్, అందేరి తూర్పు, ముంబై- 400093.

డిమాండ్ నోటీసు

ఏదైతే, మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇకపై "ఎమ్ఎహెచ్ఓఎఫ్ఐఎన్"గా పిలువబడుతుంది) యొక్క అధీకృత అధికారి IV/470A (పాతది) W/638A(కొత్తది) మణప్పురం హౌస్ వలపడ్ త్రిస్సూర్, కేరళ-680567 మా నమోదిత కార్యాలయం ఉంది మరియు వివిధ ప్రదేశాలలో దీని శాఖా కార్యాలయాలు ఉన్నాయి, కంపెనీల యాక్ట్ 1956 క్రింద నమోదు చేయబడిన కంపెనీ మరియు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ 2002 (ఇకపై యాక్ట్ గా సూచించబడుతుంది) యొక్క సెక్షన్ 2 యొక్క సబ్ సెక్షన్ (1) యొక్క క్లాజ్ (ఎమ్) యొక్క సబ్ క్లాజ్ (4) అర్థం ఆర్థిక సంస్థ నం.ఎస్.ఓ.3466 (ఇ)తో చదువుతూ నిర్మాణం మరియు / లేదా నివాస యూనిట్ల కొనుగోలు కోసం అడ్వాన్సింగ్ లోన్‌ల వ్యాపారాన్ని నిర్వహిస్తోంది మరియు దిగువ కాలమ్ నం. 2లో పేర్కొన్న విధంగా రుణగ్రహీత / సహ రుణగ్రహీతలు ఎమ్ఎహెచ్ఓఎఫ్ఐఎన్ నుండి రుణం పొందినట్లు పేర్కొన్న చార్ట్ తేది 18 డిసెంబర్, 2015న గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, ఆర్థిక సేవల విభాగం, ఆర్థిక మంత్రిత్వ శాఖ, న్యూ ఢిల్లీ ద్వారా జారీ చేయబడింది మరియు ఏదైతే సెక్యూర్డ్ క్రెడిటార్ గా ఉన్న ఎమ్ఎహెచ్ఓఎఫ్ఎన్ సర్ఫేసీ యాక్ట్ క్రింద, సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 2తో చదువుతూ సదరు యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద అతనికి అందించిన అధికారాలను వినియోగించుకుంటూ నోటీసు తేది నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొన్న మొత్తంతో పాటు దానిపై తదుపరి వడ్డీతో చెల్లించమని రుణగ్రహీత/సహ రుణగ్రహీతలను పిలుస్తూ డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది. అయితే వివిధ కారణాల వల్ల కొందరికి నోటీసులు అందజేయలేదు. దానితో పాటు క్రింద పేర్కొనబడిన రుణగ్రహీతల సమాచారం యొక్క ప్రయోజనాల కొరకు ఈ పబ్లిక్ నోటీసు ద్వారా పేర్కొన్న రుణగ్రహీతలకు తెలియజేయబడుతోంది.

క్ర సం	రుణగ్రహీత/సహ-రుణగ్రహీతల పేరు/ఎల్ఎఎన్/శాఖ	సృష్టించబడిన వడ్డీ విషయంలో సెక్యూర్డ్ అస్సెట్ వివరణ	ఎన్‌పిఎ తేది	నోటీసు పంపిన తేది మరియు బకాయి మొత్తం
1	కలంగి లక్ష్మి తిరుపతమ్మ, కలంగి రామకృష్ణ/ MLAP00 31006891/ విజయవాడ	కృష్ణా జిల్లా, మైలవరం సబ్ రిజిస్ట్రీ, ఎ.కొండూరు మండలం, చీమలపాడు గ్రామ పంచాయితీ ఏరియా, చీమలపాడు గ్రామం, ఆర్.ఎస్.నం 486, పాత డోర్ నం 3-85, క్రొత్త డోర్ నం 2-66, పాత మూల్యాంకనం నం 257, క్రొత్త మూల్యాంకనం నం 266, యొక్క విస్తీర్ణత 509 చ.గ.లు, ఆంధ్రప్రదేశ్, పిన్ కోడ్ 521227. తూర్పు: పంచాయితీ రోడ్డు, పడమర: గంధ్రు కోటేశ్వరరావు ఆసి దక్షిణం: ఉల్లిబోయిన కౌశల్య మరియు ఉల్లిబోయిన కోటూశ్వరరావు ఆస్తి, ఉత్తరం: పాలం కొండలు మరియు పాలం బాల కృష్ణ ఆస్తి	12-08-2025	14-08-2025 & Rs.5,31,921/-
2	దోమతోటి ప్రసాద్, దోమతోటి రోజారాణి దోమతోటి అర్జున్/ NHL00310024613/ విజయవాడ	ఏలూరు జిల్లా, నూజివీడు సబ్ రిజిస్ట్రీ, ఆగిరిపల్లి మండలం,నూగొండపల్లి సివారు, మల్లిబోయినపల్లి గ్రామం, ఆర్.ఎస్.నం 81, డోర్ నం 3-2, మూల్యాంకనం నం 344, విస్తీర్ణత 290.4 చ.గ.లు, ఆంధ్రప్రదేశ్, పిన్ కోడ్: 521211. తూర్పు- జాయింట్ పాసేజ్, పడమర-పంచాయితీ రోడ్డు, దక్షిణం-దామతోటి సురేష్ ఆస్తి, ఉత్తరం-దోమతోటి అర్జున్	12-08-2025	14-08-2025 & Rs.9,26,345/-

గమనిక, ఈ నోటీసును ప్రచురించిన 60 రోజులలోపు సంబంధిత రుణగ్రహీత / సహ-రుణగ్రహీతకు వ్యతిరేకంగా ఇక్కడ చూపిన మొత్తం బకాయి మొత్తాన్ని చెల్లించవలసిందిగా వారిని పిలుస్తూ పైన పేర్కొన్న విధంగా రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలకు నోటీసు ఇవ్వడమైనది. సంబంధిత రుణగ్రహీత/సహ-రుణగ్రహీత తదుపరి వడ్డీతో పాటు మొత్తం బకాయి మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైతే, పైన వివరించిన విధంగా చట్టం మరియు ఇక్కడ రూపొందించిన నియమాల క్రింద సూచించబడిన ఇతర పద్ధతులలో నోటీసు సర్వీస్ కొరకు ఆస్తులపై సెక్యూరిటీ ఇంట్రస్ట్ అమలు చేయడం కోసం ఎమ్ఎహెచ్ఓఎఫ్ఐఎన్ సెక్షన్13(4) ని తీసుకోవలసి ఉంటుంది. సర్ఫేసీ చట్టంలోని సెక్షన్ 13(8)లో వివరించిన విధంగా విక్రయం, పబ్లిక్ వేలం లేదా ప్రైవేట్ ఒప్పందం ద్వారా బదిలీ చేయడానికి నోటీసును ప్రచురించే తేదీకి ముందు ఏ సమయంలోనైనా ఎమ్ఎహెచ్ఓఎఫ్ఐఎన్ ద్వారా అయ్యే ఖర్చులు, ఛార్జీలు మరియు ఖర్చులతో పాటు చెల్లించాల్సిన మొత్తం మొత్తాన్ని చెల్లించిన తర్వాత పేర్కొన్న తనఖా రీడీమ్ చేయబడుతుందని మీరు గమనించాలి.
సర్ఫేసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13 (13) ప్రకారం, మీరు సెక్యూర్డ్ అసెట్స్‌ను ఏ పద్ధతిలోనైనా అమ్మకం, లీజు లేదా మరే ఇతర పద్ధతిలో బదిలీ చేయకుండా మరియు/లేదా వ్యవహరించకుండా నిరోధించబడ్డారని గుర్తుంచుకోగలరు.

తేది : 23/09/2025, ప్రదేశం : విజయవాడ — సం/- అధీకృత అధికారి, మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

Chola — Enter a better life

కార్పొరేట్ ఆఫీసు చిరునామా: చోళక్రెస్ట్, సూపర్-బి-4, సి54& సి55, తిరు వి క ఇండస్ట్రియల్ ఎస్టేట్, గ్యూండీ, చెన్నై-600 032
ఏదైతే, క్రింది సంతకందారులు **మెసర్స్ శ్రీరామ్ ఫైనాన్స్** యొక్క అధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని (54 ఆఫ్ 2002) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదవగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోపు **తేది.21.03.2022 నాటికి RVPLMTF2203210005** ప్రకారం ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్‌లో **30.07.2024** నాటికి **రూ.63,63,194/- (రూపాయలు అరవై మూడు లక్షల అరవై మూడు వేల నూట తొంభై నాలుగు మాత్రమే), 30.07.2024** నుండి తదుపరి వడ్డీతో దిగువ పేర్కొన్న మొత్తాలను తిరిగిచెల్లించమని **(1) శ్రీ చెగొండి వెంకట రాందాస్, (రుణగ్రహీత &తనఖాదారు),** తండ్రి శ్రీ చెగొండి విహెచ్ రామ జోగయ్య @ శ్రీ.హరి రామ జోగయ్య, **(2) శ్రీ.చెగొండి వెంకట నాగ ఝాన్సీ(హామీదారు),** భర్త శ్రీ.చెగొండి వెంకట రాందాస్, **(3) శ్రీ చెగొండి శ్రీ వెంకట హరి సిద్ధార్థ, (హామీదారు),** తండ్రి శ్రీ చేగొండి వెంకట రాందాస్, **అందరి నివాసం:** డోర్ నెం:82-18-02/05, రెవెన్యూ వార్డ్-29, యశోద సెరినిటీ, 1వ అంతస్తు, ఏవిఏరోడ్, గాలిఆఫీస్ రోడ్ ఎదురుగా, రాజమహేంద్రవరం (పట్టణ), తూర్పుగోదావరి, ఆంధ్రప్రదేశ్ 533103 వారిని కోరుతూ తేది.**30.07.2024**నాటి డిమాండ్ నోటీసులు జారీచేయబడినది.
సి.పి.నెం.69-76 ఆఫ్ 2022లో 09.11.2022న గౌరవ ఎన్‌సిఎల్టీ, చెన్నై వారిచే ఆమోదించిన స్కీమ్ ఆఫ్ అమల్గామేషన్‌ను అనుసరించి మెసర్స్ శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ అనునది శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌తో విలీనం చేయబడింది. తదనంతరం, మెసర్స్ శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌ను భారత ప్రభుత్వం, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కింద రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ ద్వారా ధృవీకరించబడిన "పేరు మార్పుకు అనుగుణంగా ఇన్ కార్పొరేషన్ సర్టిఫికేట్" ప్రకారం 30.11.2022 నుండి **మెసర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్** మార్చిన పేరు అమలులోకి వస్తుంది. అందువల్ల, ప్రస్తుత నోటీసు మెసర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, తేదీ నాటికి ఉనికిలో ఉన్నసెక్యూర్డు క్రెడిటార్ ద్వారా జారీ చేయబడినది.
రుణగ్రహీతలు/తనఖాదారులు బకాయిలను తిరిగిచెల్లించడంలో విఫలమయ్యారు, ఇందుమూలంగా తనఖాదారు/హామీదారులు/రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా దిగువ సంతకందారుడు సరూల్ సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదవగల సదరుచట్టంలోని సెక్షన్ 13(4)క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని సదరు ఆస్తిని **16 సెప్టెంబర్, 2025**తేదీన స్వాధీనంలోకి తీసుకోవడం జరిగింది.
హామీదారులు/తనఖాదారులు మరియు రుణగ్రహీతకుప్రత్యేకించి మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమేమనగా దిగువ పేర్కొన్న ఆస్తితో ఎలాంటి లావాదేవీలను నిర్వహించొద్దు మరియు లావాదేవీలు జరపదలచిన వారు **మెసర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారికి ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ ఖాతాలో **31.07.2024** నుండి తదుపరి వడ్డీతో **30.07.2024** నాటికి **రూ.63,63,194/-** లను చెల్లించుటకు లోబడి వుంటుంది.
సెక్యూర్డు అసెట్స్ విమోచనానికి అందుబాటులోవున్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13 యొక్కఉప-సెక్షన్ (8) నియమాల క్రింద రుణగ్రహీత శ్రద్ధను కోరుతున్నారు.

స్థిరాస్తి యొక్క షెడ్యూల్: పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లు ఉప జిల్లా, యలమంచిలి మండలం, బూరుగుపల్లి మైనర్ గ్రామ పంచాయతీ మరియు గ్రామ ఖాతాలు, ఆర్ఎస్ఎస్ నెం.108/5లోని ఎక.0.67 సెంట్ల మొత్తం విస్తీర్ణంలోని దక్షిణం వైపు సగ విస్తీర్ణం ఎక 0.33 1/2 సెంట్లతో, ఆర్ఎస్ నెం.108/6లోని ఎక.0.37 సెంట్ల మొత్తం విస్తీర్ణంలోని దక్షిణం వైపు సగ విస్తీర్ణం ఎక 0.18 1/2 సెంట్లు, మొత్తం ఎక0.52 సెంట్లు, దీనిలో ఎక 0.18 సెంట్లు లేదా 871.2 చదరపు గజాలు లేదా 728.41 చదరపు మీటర్ల స్థలం, పాత డోర్ నెం.1-54, కొత్త డోర్ నెం.1-50 మరియు టైల్డ్ ఇంటి కలిగిన పాత మద్రాస్ టెర్రస్డ్ బిల్డింగ్‌తో కూడిన స్థలం. సరిహద్దులు: తూర్పు: దొడ్డిపట్ల కంచుటంబంపాలెం రోడ్డు, దక్షిణం: ఈ సర్వే నంబర్లలో మిగిలిన స్థలం, పడమర: చెరుకూరి వెంకటరావు భూమి, ఉత్తరం: బోనం బాపనయ్య నాయుడు, వడయార్లు మొ॥నవారి భూమి.

తేది: 16.09.2025 — అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్-సెక్యూర్డు క్రెడిటార్

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (Bank of Maharashtra) — జోనల్ ఆఫీస్ విజయవాడ
1వ అంతస్తు, ఇన్ఫినిటీ ప్లాజా, డి.నెం.59ఎ-21-7/3, హైస్కూల్ రోడ్, పటమట, విజయవాడ, ఆం.ప్ర.-520007.
టెలి ఫోన్:0866-2431225. ఈ-మెయిల్:zmvijayawada@mahabank.co.in

AV76/Notice of Redemption/2025-26 — తేది:20/09/2025
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క నిబంధన 6(2)/8(6) ప్రకారం అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియజేస్తూ (తిరిగి పొందుటకు 30 రోజుల ప్రకటన)
దిగువ వారికి
1. మెస్సర్స్ వీరమ్మ తల్లి ఫుడ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, **(ఋణగ్రహీత),** 3వ అంతస్తు, ఫ్లాట్ నం.301, బ్లాక్ ఎ, అభ్యాస్ లేక్ వ్యూ రెసిడెన్సీ, నిజాంపేట్ విలేజ్, హైదరాబాద్-500090, తెలంగాణ
2. **శ్రీ గాజుల గణేష్ విష్ణు కుమార్ (డైరెక్టర్), (ఋణగ్రహీత & హామీదారు),** 301, ఫ్లాట్ నెం. 353, వీధి నెం. 08, కాకతీయ హిల్స్ మాదాపూర్, హైదరాబాద్-500081. **మరొక చిరునామా :** డి.నెం.40-3/1-54, సత్యనారాయణ స్ట్రీట్, ఫార్చ్యూన్ మురళీ పార్క్ హోటల్ ఎదురుగా, విజయవాడ-520010
3. **శ్రీ కొక్కిరాల సత్య ప్రసాద్ (డైరెక్టర్), (ఋణగ్రహీత & హామీదారు),** 301, ఫ్లాట్ నెం. 353, వీధి నం. 08, కాకతీయ హిల్స్ మాదాపూర్, హైదరాబాద్-500081 **మరొక చిరునామా :** ఫ్లాట్ నెం 301 ఎ-బ్లాక్, అభ్యాస్ లేక్ వ్యూ రెసిడెన్సీ, నిజాంపేట్-500090
4. **శ్రీ సుబ్బారావు గాజుల, (హామీదారు),** డి.నెం 40-3/1-54, సత్యనారాయణ వీధి, ఫార్చ్యూన్ మురళీ పార్క్ హోటల్ ఎదురుగా, విజయవాడ-520010

అయ్యా/అమ్మా,
విషయము : బ్యాంక్ వారికి చెల్లించవలసిన బకాయి మొత్తము రాబట్టుటకు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద శ్రీ గాజుల గణేష్ విష్ణు కుమార్ మరియు శ్రీ సుబ్బారావు గాజుల గార్లకు చెందిన ఆస్తులు విక్రయించుటకు
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, సూర్యారావుపేట బ్రాంచ్, సెక్యూర్డ్ క్రెడిటర్‌గా, సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ("SARFAESI యాక్ట్") లోని సెక్షన్ 13(2) కింద నిర్దేశించిన వ్యవధిలోపు బకాయిలను చెల్లించమని మిమ్మల్ని కోరుతూ **తేదీ.26/09/2023** న డిమాండ్ నోటీసు జారీ చేశారు.
మీరు ఆ నోటీసును పాటించడంలో విఫలమైనందున, బ్యాంక్ అధీకృత అధికారి **తేది.01/06/2024**న స్థిరాస్తి(ల)ను **లాంఛనాత్మకంగా స్వాధీనం** చేసుకున్నారు మరియు తరువాత **SARFAESI** చట్టంలోని సెక్షన్ 13(4) మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8 ప్రకారం **తేది.26/11/2024**న **భౌతికంగా స్వాధీనం** చేసుకున్నారు.
పైన పేర్కొన్న చర్యలు ఉన్నప్పటికీ, బకాయిలు చెల్లించబడలేదు. దీని ప్రకారం, SARFAESI చట్టం మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాలు, 2002 లోని నిబంధనలకు అనుగుణంగా, క్రింద పేర్కొన్న సెక్యూర్డ్ ఆస్తి(ల)ను పబ్లిక్ ఇ-వేలం ద్వారా లేదా ప్రైవేట్ ఒప్పందం ద్వారా విక్రయించాలని బ్యాంక్ ప్రతిపాదిస్తోంది.
అమ్మకం తేదీ మరియు సమయం, రిజర్వ్ ధర మరియు అమ్మకం నిర్వహించబడే సేవా ప్రదాత/ప్లాట్‌ఫామ్ వివరాలు తగిన సమయంలో విడిగా ప్రచురించబడతాయి. సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 6(2)/8(6)కి అనుగుణంగా, సెక్యూర్డ్ ఆస్తి(ల) విముక్తికి సంబంధించి మీకు 30 రోజుల నోటీసు ఇవ్వబడింది.
అమ్మకపు నోటీసు ప్రచురించే తేదీకి ముందు (పబ్లిక్ ఇ-వేలం ద్వారా లేదా ప్రైవేట్ ఒప్పందం ద్వారా అయినా) వర్తించే వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు బ్యాంక్ చేసిన ఖర్చులతో సహా మీరు మొత్తం బకాయిలను బ్యాంకుకు చెల్లిస్తే, తనఖా పెట్టిన ఆస్తి అమ్మకానికి తదుపరి చర్యలు తీసుకోబడవు మరియు SARFAESI చట్టం, 2002 లోని సెక్షన్ 13(8) ప్రకారం అందించిన విధంగా మీరు సెక్యూర్డ్ ఆస్తి(ల)ను తిరిగి పొందే హక్కు కలిగి ఉంటారు.

షెడ్యూల్ ఆస్తి
(CERSAI ASSET ID : 200065709524)
తనఖా చేసిన ఆస్తి వివరములు : యన్‌టిఆర్ జిల్లా, విజయవాడ పటమట యస్‌ఆర్ఓ జ్యూరిస్‌డిక్షన్ పరిధిలోని, యన్‌టియస్ నెం.100, డి.నెం.40-3/1-54, అసెస్‌మెంట్ నెం.1073109544, సత్యనారాయణ వీధి, కృష్ణానగర్, బ్లాకు నెం.4, వార్డు నెం.29, ఆర్.వార్డు నెం.11 వద్ద 591.50 చ.గ.లు యన్‌టిఆర్ జిల్లా, పటమట సబ్ రిజిస్ట్రీ, విజయవాడ, లబ్బీపేట, కృష్ణానగర్, పాత అసెస్‌మెంట్ నెం.13191, 9172, 6840, తదుపరి అసెస్‌మెంట్ నెం.26122ఎమ్, ప్రస్తుత అసెస్‌మెంట్ నెం.1073109544, మెన్సిపల్ వార్డు నెం.20, యన్‌టియస్ నెం.100, బ్లాకు నెం.4, రెవెన్యూ వార్డు నెం.11 లోని 591 1/2 చ.గ.లు విస్తీర్ణం కు సమానమైన 494-67.4 చ.మీ.లు విస్తీర్ణం గల స్థలములో గ్రౌండ్, ఫస్ట్ మరియు సెకండ్ ఫ్లోర్లతో గల ఆర్‌సిసి రెసిడెన్షియల్ భవనము.
హద్దులు : ఉత్తరం : శ్రీ డి.ఎల్ కృష్ణమూర్తి గారి ఆస్తి, **తూర్పు :** శ్రీ ఎ.సీతారామయ్య మరియు ఇతరులు ఆస్తి, **పడమర :** మున్సిపల్ రోడ్డు, **దక్షిణం :** మున్సిపల్ రోడ్డు.

ప్రదేశం : విజయవాడ — చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
తేది : 20.09.2025 — బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, జోనల్ ఆఫీస్, విజయవాడ

ఉమర్ ఖలీద్, షార్జీల్ ఇమామ్ బెయిల్‌పై
ఢిల్లీ పోలీసులకు సుప్రీం నోటీసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

2020 ఢిల్లీ అల్లర కేసులో స్థానిక పోలీసులకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో నిందితులు ఉమర్ ఖలీద్, షార్జీల్ ఇమామ్, గుల్ఫిషా ఫాతిమా, మీరన్ హైదర్, షిఫా ఉర్ రెహ్మాన్ దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌పై స్పందించాలని ఆదేశించింది. జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్ వి అంజారియాతో కూడిన ధర్మాసనం తదుపరి విచారణ అక్టోబర్ 7కి వాయిదా వేసింది. ప్రీ ట్రయల్‌లోనే నిందితులు ఐదేళ్ల జైలుశిక్ష అనుభవించారని పిటీషనర్ల తరపు సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ మను సింఘ్వీ వాదించారు. వీరికి బెయిల్ నిరాకరిస్తూ సెప్టెంబర్ 2న ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఖలీద్‌తో పాటు ఇతరులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

భలే మంచి చౌక బేరం !

ఏడాదికి ఎకరానికి రూపాయేనట
అదానీ పవర్‌కు 1,020 ఎకరాలు
లీజుకిచ్చిన బీహార్ ప్రభుత్వం

పాట్నా : అదానీ గ్రూప్ అనుబంధ కంపెనీ అదానీ పవర్ భలే ఛాన్స్ కొట్టేసింది. బీహార్‌లోని భాగల్పూర్ జిల్లా పిర్‌పైంటీలో 1,020 ఎకరాలను కారు చౌకగా లీజుకు తీసుకుంది. లీజు ఎంతో తెలుసా? ఏడాదికి ఎకరానికి రూపాయి మాత్రమే. సొంతగా విద్యుత్ ప్లాంటును నిర్మించి నిర్వహించడానికి ఈ కంపెనీకి నితీష్ కుమార్ ప్రభుత్వం పాతిక సంవత్సరాల లీజును కట్టబెట్టింది. ప్లాంటు కోసం తీసుకున్న తమ వ్యవసాయ భూములకు...ముఖ్యంగా మామిడి వంటి పండ్ల తోటలకు రాష్ట్ర ప్రభుత్వం సరిగా నష్టపరిహారం చెల్లించడం లేదంటూ పలువురు గ్రామస్థులు ఆరోపిస్తున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

ఇప్పటికే రాష్ట్రంలో వాయు కాలుష్యం జడలు విప్పుతోంది. ప్రజల ఆరోగ్యంపై అది తీవ్ర ప్రభావం చూపుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అయినా నితీష్ ప్రభుత్వం రాష్ట్రంలో రెండో బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంటుకు అనుమతి ఇచ్చింది. ఈ నెల పదిహేనో తేదీన బీహార్‌లో పర్యటించిన ప్రధాని నరేంద్ర మోడీ పూర్నియాలో నలభై వేల కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. భాగల్పూర్ జిల్లా పక్కనే ఉన్న పిర్‌పైంటీలో అదానీ పవర్‌కు చెందిన 2,400 మెగావాట్ల బొగ్గు ఆధారిత థర్మల్ ప్లాంటు కూడా వీటిలో ఉంది. దీని విలువ పాతిక వేల కోట్ల రూపాయలు. బీహార్‌లో అతి పెద్ద ప్రైవేటు రంగ పెట్టుబడి యూనిట్ కూడా ఇదే కాబోతోంది. అయితే మోడీ తన ప్రసంగంలో ఎక్కడా అదానీ పవర్ గురించి ప్రస్తావించలేదు.

అయితే మోడీ పర్యటనకు రెండు రోజుల ముందు...అంటే 13వ తేదీన అదానీ పవర్ కంపెనీ బీహార్ రాష్ట్ర విద్యుదుత్పత్తి కంపెనీ లిమిటెడ్‌తో పాతిక సంవత్సరాల విద్యుత్ సరఫరా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ప్లాంటును దక్కించుకోవడానికి అదానీ గ్రూపుతో పాటు జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, టొరంట్ పవర్, బజాజ్ గ్రూపునకు చెందిన లలిత్ పవర్ కూడా పోటీ పడ్డాయి. కానీ అదానీ పవర్‌కే విద్యుత్ ప్లాంట్ దక్కింది. ఒప్పందం ప్రకారం ప్లాంటులో ఉత్పత్తి అయ్యే ప్రతి కేడబ్ల్యూహెచ్ (కిలోవాట్ అవర్)ను రూ.6,075కి విక్రయిస్తారు. కాగా విద్యుత్ ప్లాంటు కోసం భూములు ఇచ్చిన గ్రామస్థులకు ఒకేలా నష్టపరిహారం లభించలేదు. విద్యుత్ ప్లాంటు కోసం 12 సంవత్సరాల క్రితమే రాష్ట్ర ప్రభుత్వం వీరి నుంచి భూములు తీసుకుంది. అప్పుడు నష్టపరిహారంగా ఎంత మొత్తం చెల్లించారో ఇప్పుడు తీసుకున్న భూములకు కూడా అంతే ఇవ్వడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని వచ్చినప్పుడు తమ గోడు వెళ్లబోసుకునేందుకు రైతులు ప్రయత్నించగా వారిని అరెస్ట్ చేశారు. పైగా అవన్నీ పండ్ల తోటలే. అవి రైతులకు నిత్యం ఆదాయాన్ని అందిస్తుంటాయి. విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు యోచనను ప్రజలు 2014లోనే వ్యతిరేకించినప్పటికీ పాలకులు పట్టించుకోలేదు.

మరో ఏడాది పాటు అణ్వాయుధ పరిమితులకు కట్టుబడి వుంటాం

- తేల్చి చెప్పిన పుతిన్

మాస్కో : మరో ఏడాది పాటు అణ్వాయుధ పరిమితులకు కట్టుబడి వుంటామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సోమవారం చెప్పారు. అమెరికాతో గల అణు ఒప్పందానికి ఫిబ్రవరిలో కాలం చెల్లిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. రష్యా భద్రతా మండలి సభ్యులతో సమావేశంలో మాట్లాడుతూ పుతిన్, 2010 న్యూ స్టార్ట్ ఒప్పందం రద్దు అంతర్జాతీయ సుస్థిరతపై ప్రతికూల ప్రభావాలు కలిగిస్తుందని అన్నారు. మాస్కో తరహాలోనే అమెరికా కూడా ఈ ఒప్పందం పరిమితులకు కట్టుబడి వుంటుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. న్యూ స్టార్ట్ ఒప్పందంపై 2010లో అప్పటి ఇరు దేశాల నేతలు ఒబామా, దిమిత్రి మెద్వెదెవ్‌లు సంతకాలు చేశారు. ఇరు దేశాలు 1550 కన్నా అణు శీర్షాలను, 700కి పైగా అణు క్షిపణులు, బాంబర్లను కలిగి వుండరాదని ఒప్పందం నిర్దేశిస్తోంది. ఈ ఒప్పందం ప్రకారం నిబంధనలకు అనుగుణంగా అన్నీ జరుగుతున్నాయా లేదా అని నిర్ధారించుకోవడానికి తనిఖీలు జరగాల్సి వుంది. అయితే 2020 నుండి ఉభయ పక్షాలూ ఈ విషయంలో ఎలాంటి కార్యాచరణ చేపట్టలేదు. 2023 ఫిబ్రవరిలో ఈ ఒప్పందంలో మాస్కో ప్రాతినిధ్యాన్ని పుతిన్ రద్దు చేశారు. ఉక్రెయిన్‌లో రష్యా ఓటమే తమ లక్ష్యమని అమెరికా, నాటో మిత్రపక్షాలు బహిరంగంగా ప్రకటించినపుడు తమ అణు ప్రదేశాల్లో అమెరికా తనిఖీలను అనుమతించేది లేదని పుతిన్ స్పష్టం చేశారు. అయితే తాము మొత్తంగా ఒప్పందం నుండి వైదొలగడం లేదని కూడా నొక్కి చెప్పారు.

విద్వేషం కన్నా శాంతి మిన్న !

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభమయ్యాయి.

"చరిత్ర నల్వాడి కృష్ణరాజ ఒడయార్‌ను చాలా అభిమానంగా గుర్తుంచుకుంటుంది. ఎందుకంటే ఆయన సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని విశ్వసించారు. అవి సుదీర్ఘకాలం కొనసాగాలంటే సంపద, అధికారాన్ని పంచుకోవాలన్నది ఆయన సందేశం." అని ముష్తాక్ పేర్కొన్నారు. జయచామరాజేంద్ర ఒడయార్ ముస్లింల పట్ల కూడా విశ్వాసం కనబరిచారని, రాజ్యాన్ని సంరక్షించే బాధ్యతలను వారికి కూడా అప్పగించారన్నారు. "రాజ్యాంగ విలువలను, అలాగే ప్రతి ఒక్కరి విశ్వాసాలను, విలువలను మనందరం గౌరవించుకోవాలి. ఐక్యత, సమగ్రతలను ఈ భూమి పరిమిళాలుగా మనం వుండనిద్దాం. మనలో వున్న విద్వేషం, అసహనం వంటి వాటిపై గెలుపొందేందుకు చాముండేశ్వరి ప్రేమ, ధైర్యం, ఆమె దీవెనలు మనల్ని ముందుకు నడిపించాలని కోరారు. ఈ రాష్ట్రం, దేశం హద్దులు దాటి ఈ దసరా ఉత్సవాలు జరగాలని, ప్రపంచవ్యాప్తంగా శాంతి, సామరస్యతలను రగులుస్తూ, న్యాయాన్ని అందించాలని ఆమె ఆకాంక్షించారు.

మానవులుగా పరస్పర గౌరవం వుండాలి

బాను ముష్తాక్ ముస్లిం కుటుంబంలో పుట్టవచ్చు, కానీ ఆమె ఒక మనిషి, మనుష్యులుగా మనం ఒకరినొకరం గౌరవించుకోవాలి. అంతేగానీ, కులాలు, మతాలను ఆధారంగా చేసుకుని వివక్ష చూపరాదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. మానవాళిగా మనందరం ఒక్కటే అని భావిస్తే, మనందరం కూడా బాను ముష్తాక్ దసరా ఉత్సవాలను ప్రారంభించడాన్ని ఆమోదించాల్సిందేనని అన్నారు. కర్ణాటక మెజారిటీ ప్రజలు ఇప్పటికే హృదయపూర్వకంగా దీన్ని స్వాగతించారని చెప్పారు.

ఏవరీ బాను ముష్తాక్.. ఏమిటీ వివాదం..?

బాన్ ముష్తాక్ కర్ణాటకకు చెందిన రచయిత్రి, సామాజిక కార్యకర్త, న్యాయవాది. ఈమె రచించిన హార్ట్ లాంప్ అనే చిన్న కథల సంకలనానికి ఈ ఏడాది అంతర్జాతీయ బుకర్ బహుమతి లభించింది. 1948 హసన్‌లోని ముస్లిం కుటుంబంలో జన్మించిన ముష్తాక్ ఎనిమిదేళ్ల వయస్సులో శివమొగ్గలోని ఒక పాఠశాలలో చేరారు. ఆరు నెలల్లో కన్నడం చదవడం, రాయడం నేర్చుకోవాలనే షరతుతో పాఠశాలలో చేరిన ఆమె కొన్ని రోజుల వ్యవధిలోనే దీన్ని సాధించారు. చిన్నతనంపై కవితాసక్తి ఉన్న ఆమె బెంగళూరు ఆకాశవాణి కేంద్రం, లంకేష్ పత్రికల్లో పనిచేశారు. 26 ఏళ్ల వయస్సులో ప్రేమ వివాహం చేసుకున్నారు. 2000లో 'ముస్లిం మహిళలు మసీదులోకి ప్రవేశించే హక్కును సమర్థించినందుకు' ఆమెను, ఆమె కుటుంబాన్ని మూడు నెలల పాటు సామాజికంగా వెలి వేశారు. ఈ సమయంలో ఆమెపై కత్తితో హత్యాయత్నం కూడా జరిగింది. భర్త అడ్డుకోవడంతో తృటిలో ప్రాణాపాయం తప్పింది. కాగా, మైసూరు నగరంలో ప్రతి ఏటా దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఈ ఉత్సవాల ప్రారంభానికి రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఒక ప్రముఖ వ్యక్తిని ఆహ్వానిస్తుంది. ఈ ఏడాది భాను ముస్తాక్‌కు ఆహ్వానం పంపడంపై వివాదం ప్రారంభమయింది. ఈ ఆహ్వానాన్ని సవాల్ చేస్తూ హెచ్‌ఎస్ గౌరవ్ అనే వ్యక్తి కర్ణాటక హైకోర్టులో పిటిషన్ వేశాడు. ముస్లిం చేతులు మీదుగా దసరా ఉత్సవాలను ప్రారంభించడం హిందూ సంప్రదాయనికి విరుద్ధమని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. కాబట్టి భాను ముస్తాక్‌కు ఆహ్వానాన్ని రద్దు చేసుకునేలా కర్ణాటక ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. కానీ ఆ పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు తోసిపుచ్చింది. దాంతో గౌరవ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు సైతం ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. భాను ముస్తాక్‌ను దసరా ఉత్సవాలకు ఆహ్వానించడం ప్రజల చట్టపరమైన హక్కులకుగానీ, రాజ్యాంగపరమైన హక్కులకుగానీ భంగం కలిగించదుగా..! అని వ్యాఖ్యానించింది. ఇదిలావుంటే భాను ముస్తాక్ బుకర్ ప్రైజ్ గెలిచినందుకు గౌరవంగా దసరా ఉత్సవాల ప్రారంభానికి ఆహ్వానించామని, అందులో తప్పేముందని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ప్రశ్నించారు.

వామపక్షాలే ప్రత్యామ్నాయం

(మొదటిపేజీ తరువాయి)

తన గురువు అని ఎర్రకోట నుండి ఒక వ్యక్తి సిగ్గు లేకుండా చెబుతున్నారని ప్రధాని నరేంద్రమోడీ నుద్దేశించి అన్నారు. మావోయిస్టులపై కేంద్ర భద్రతా దళాల దాడిపై మావోయిస్టులు తాము చర్చలకు సిద్ధమని ప్రకటించినా, కేంద్రం వారిని తుదముట్టిస్తోందన్నారు. గిరిజనులు, మహిళలు, దళితులు అన్ని వర్గాలను కేంద్రం అణచివేస్తోందని, ఎన్నికల కమిషన్ కూడా వారి చేతుల్లో ఆయుధంగా మారిందని విమర్శించారు. అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు మనకు ఒక అవకాశం ఇచ్చారని అన్నారు. టారిఫ్, టెర్రరిజం, ట్రంప్ కలసి 'ట్రిపుల్ టి'గా మారాయని అన్నారు. ట్రంప్ పన్ను ఉగ్రవాదానికి సమాధానం చెప్పే వారు లేకుండా పోయారన్నారు. భారత్-పాకిస్తాన్ యుద్ధంతో సహా వివిధ యుద్ధాలను ఆపానని చెప్పుకుంటూ ట్రంప్ నోబెల్ బహుమతిని అడుతున్నారన్నారు.

దేశ భవిష్యత్తు కోసమే :డి.రాజా

సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ దేశ భవిష్యత్తు రాజకీయాలపై నిర్ణయాత్మక ప్రభావం చూపే నిర్ణయాలు 25వ పార్టీ మహాసభలో తీసుకుంటామని చెప్పారు. ఈ మహాసభ కమ్యూనిస్ట్, వామపక్ష ఉద్యమాలను, లౌకిక ప్రజాస్వామ్య పార్టీలను ఏకం చేస్తుందని, బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ కూటమి ప్రజా వ్యతిరేక, దేశ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాట మార్గాన్ని రూపొందిస్తుందని అన్నారు. మోడీ ప్రధానమంత్రి అయినప్పుడు, అందరికీ సహాయపడే విధానాలు ఉంటాయని ప్రజలకు చెప్పారని, సబ్కా సాథ్ సబ్కా వికాస్ అనేది నినాదం ఇచ్చారని, కానీ ఇప్పుడు ఇది సామాన్యుల ప్రభుత్వం కాదు, కార్మికుల ప్రభుత్వం కాదు, రైతుల ప్రభుత్వం కాదు, కార్పొరేట్ల ప్రభుత్వమని ప్రజలు అర్థం చేసుకున్నారని పేర్కొన్నారు. కమ్యూనిస్టుల నాయకత్వంలో దేశ స్వాతంత్ర పోరాటం జరిగిందని, వారి త్యాగాల ఫలితమే స్వాతంత్రమని డి.రాజా అన్నారు. కమ్యూనిస్టులు త్యాగాలతో స్వాతంత్ర పోరాటం జరిగిందన్నారు. దేశ స్వాతంత్ర పోరాటంలో ఆర్‌ఎస్‌ఎస్‌కు ఎటువంటి పాత్ర లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఆర్‌ఎస్‌పి ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య, ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి జి. దేవరాజన్ తదితరులు మాట్లాడారు. ముసాయిదా రాజకీయ తీర్మానాన్ని డి. రాజా, సంస్థాగత నివేదికను కె. నారాయణ, కార్యనిర్వాహక నివేదికను బాలచంద్ర కె. కాంగో ప్రవేశపెట్టారు. క్యూబన్, పాలస్తీనా ప్రజలతో సంఘీభావ సమావేశం సాయంత్రం జరిగింది. రెండు దేశాల రాయబారులు పాల్గొన్నారు. అనంతరం రాజకీయ తీర్మానంపై చర్చ ప్రారంభమైంది. నివేదికలపై మంగళవారం చర్చ కొనసాగుతుంది. అలాగే, సమావేశం జరుగుతున్న అతుల్‌కుమార్ అంజన్ హాల్‌లో ఇప్టా కళాకారులు విప్లవ గీతాలను పాడారు. కేరళ ప్రతినిధులు పున్నప్ర వాయలార్ అమరవీరులను స్మరించుకుంటూ ఒక పాట పాడారు.

సింగరేణి కార్మికులకు బోనస్

- కాంట్రాక్ట్ కార్మికులకు కూడా వర్తింపు
- జిఎస్‌టి నష్టాన్ని కేంద్రమే భరించాలి
  : తెలంగాణ సిఎం రేవంత్

కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

జిఎస్‌టి స్లాబు రేట్ల కుదింపు వల్ల రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ. ఏడు వేల కోట్ల ఆదాయాన్ని కోల్పోతుందని, దాన్ని కేంద్ర ప్రభుత్వం భర్తీ చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి కోరారు. కేంద్రం ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని రాష్ట్రాలపై భారం వేయడం సరికాదని, వచ్చే ఐదేళ్ల వరకు కేంద్రం వయబిలిటీ గ్యాప్ ఫండ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సోమవారం సింగరేణి కార్మికులకు లాభాల వాటా ప్రకటన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సింగరేణి కార్మికులకు లాభాల వాటాలో 34 శాతాన్ని బోనస్‌గా ప్రకటించారు. దీని కోసం రూ.819 కోట్లు కేటాయించామని వివరించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సంస్థ మొత్తం నికర లాభాలు రూ. 6,394 కోట్లు కాగా, దానిలో కొత్త ప్రాజెక్టుల కోసం 4,034 కోట్లు కేటాయించామని తెలిపారు. మిగిలిన రూ.2,360 కోట్లు నికర లాభాల్లో 34 శాతం సొమ్మును (రూ.819 కోట్లు) లాభాల వాటా బోనస్‌గా చెల్లిస్తున్నామని ప్రకటించారు. సంస్థలోని 41 వేల మంది పర్మినెంట్ కార్మికులకు సగటున ఒక్కొక్కరికీ రూ.1,95,610 బోనస్‌గా వస్తుందని, గతేడాదితో పోలిస్తే రూ.8,289 అధికంగా బోనస్ చెల్లిస్తున్నామన్నారు. సంస్థలోని 30 వేలమంది కాంట్రాక్ట్ కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున బోనస్ ఇస్తామన్నారు.

గతేడాది వారికి రూ.ఐదు వేలు చొప్పున బోనస్ చెల్లించామన్నారు. తెలంగాణలో గనులన్నీ సింగరేణికే దక్కేలా చూస్తామని సిఎం హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో సత్తుపల్లి, కోయగూడెం ఓపెన్ కాస్ట్ బ్లాకులను వేలంపాటలో ప్రైవేటు వ్యక్తులు పొందారని, ఇది సింగరేణికి తీవ్ర నష్టాన్ని తెచ్చిపెట్టిందని వివరించారు. వీటిని కూడా సింగరేణికి కేటాయించాలని కార్మికులు కోరారని, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఆ ప్రయత్నం చేస్తామన్నారు. ప్రయివేటు సంస్థలతో దీటుగా సింగరేణి సంస్థ అభివృద్ధి చెందాలని, దానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఓపెన్ మార్కెట్లో ఇతరుల కంటే తక్కువ ధరకు బొగ్గు అమ్మే స్థాయికి సంస్థ ఎదగాలని ఆకాంక్షించారు.

దసరా ఉత్సవాలు ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

దర్శనాలకు ప్రత్యేకంగా స్లాట్లు కేటాయించామని చెప్పారు. దాదాపు నాలుగు వేల మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. దర్శనానికి వచ్చే వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు క్యూఆర్ కోడ్ ఉపయోగిస్తున్నామన్నారు. ఉత్సవాలను ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు పర్యవేక్షిస్తున్నారు.

గొల్లపూడిలో విజయవాడ ఉత్సవ్ వాయిదా

విజయవాడ సమీపంలోని గొల్లపూడిలో నిర్వహించాల్సిన విజయవాడ ఉత్సవ్‌ను వాయిదా వేశారు. వర్షాల నేపథ్యంలో వీటిని ఈ నెల 24కు వాయిదా వేసినట్లు ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రకటించారు. విజయవాడ ఇందిరా గాంధీ మున్సి పల్ స్టేడియంలో హెలికాప్టర్ రైడ్‌ను రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపి కేశినేని శివనాథ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు పాల్గొన్నారు. పున్నమి ఘాట్‌లో క్రాకర్ షో, ఘంటసాల సంగీత కళాశాలలో కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి.

కలిసికట్టుగా ఎదుర్కొందాం !

- నేటినుండి ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశాలు
- పలు సవాళ్ళు, అనిశ్చితుల నేపథ్యంలో సమావేశమవుతున్న ప్రపంచ నేతలు
- గాజా, ఉక్రెయిన్, సూడాన్, ట్రంప్ వైఖరి తదితర అంశాలపై చర్చ

న్యూయార్క్ : ఐక్యరాజ్య సమితి 80ఏళ్ళ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా అనేక సవాళ్ళను, అస్థిర, అనిశ్చిత పరిస్థితులను ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న వేళ ప్రపంచ నేతలు సమావేశమవుతున్నారు. జనరల్ అసెంబ్లీ చాంబర్‌లో మంగళవారం జరిగే ఉన్నతస్థాయి సమావేశానికి హాజరయ్యేందుకు గానూ వీరు విచ్చేస్తున్నారు. ప్రపంచ దేశాలనుద్దేశించి ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ ప్రసంగించిన వెంటనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడతారు. గాజా, ఉక్రెయిన్‌ల్లో సుదీర్ఘంగా సాగుతున్న దాడులు, యుద్ధాలు, మరోపక్క ప్రపంచ దేశాల పట్ల అమెరికా వైఖరిలో మార్పులు, ఎక్కడ చూసినా ఆకలి కేకలు, అత్యంత వేగంగా మారుతున్న సాంకేతికతలతో ప్రపంచ పరిస్థితులు అత్యంత సంక్లిష్టంగా వున్నాయి. ప్రపంచ దేశాలు ఎదుర్కొనే రాజకీయ, సామాజిక, ఆర్థిక సమస్యల పరిష్కారాలకు కలిసికట్టుగా కృషి చేయాలనే లక్ష్యంతో రెండో ప్రపంచ యుద్ధానంతరం ఆవిర్భవించిన ఐక్యరాజ్య సమితే ప్రస్తుతం సంక్షోభంలో వుంది. మన జీవిత కాలాల్లో ఎన్నడూ చూడని విధంగా అంతర్జాతీయ సహకారం అనేది తీవ్రమైన ఒత్తిళ్ళకు లోనవుతోందని గత వారం గుటెరస్ వ్యాఖ్యానించారు. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో జరిగే జనరల్ అసెంబ్లీ సమావేశాలకు దాదాపు 150 దేశాల నుండి అధ్యక్షులు, ప్రధానులు, రాజులు హాజరవుతున్నారు. అత్యంత సవాళ్లతో కూడిన పరిస్థితులను ఎదుర్కొంటున్నందున ఈ అవకాశాన్ని వదులుకోకుండా చక్కని చర్చ జరగాలని గుటెరస్ ఆకాంక్షించారు. "ఒకపక్క భూగోళం వేడెక్కిపోతోంది. మరోపక్క సరైన రక్షణలు లేకుండానే సాంకేతికతలు శరవేగంగా దూసుకువస్తున్నాయి. అసమానతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి." అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మరింత మెరుగైన ప్రపంచం కోసం మనందరం ఏకమవాలని ఆయన అభిలషించారు.

ఈ సమావేశాలకు హాజరయ్యే 150మంది నేతలు, మంత్రులు ఒకరితో ఒకరు ముఖాముఖి సమావేశాలు జరిపేలా, చర్చలు జరిగేలా, ఏమైనా అభిప్రాయ బేధాలు వుంటే అవి సమసిపోయేలా, వున్న ముప్పులను తగ్గించుకునేలా, పరిష్కార మార్గాలు కనుగొనేలా చూసేందుకు తాను ఈ అవకాశాన్ని ఉపయోగించుకోనున్నట్లు గుటెరస్ చెప్పారు. అన్ని దేశల్లో దారిద్ర్యాన్ని నిర్మూలించేందుకు, ప్రతి ఒక్క బిడ్డకు నాణ్యత గల చదువును అందించడంతో సహా ఐక్యరాజ్య సమితి లక్ష్యాలను 2030కల్లా నెరవేర్చడానికి కావాల్సిన నిధులను కూడా సమీకరించుకోవాల్సి వుందన్నారు. కేవలం ఫోటోలకు పోజులిస్తూ, శుష్క వాగ్దానాలు చేసి వెళ్ళిపోకుండా నేతలు కచ్చితంగా పురోగతి సాధించాలని ఆయన కోరారు. అయితే తీవ్రమైన విభేదాలు, ఘర్షణలతో నిండిపోయిన ఈ ప్రపంచంలో గాజా, ఉక్రెయిన్, సూడాన్‌ల్లో కాల్పుల విరమణకు అవకాశాలు కనిపించడం లేదు. అసలు ఈ ఉన్నత స్థాయి సమావేశాలు ఎలాంటి పురోగతినైనా సాధిస్తాయా లేదా అనేది పెద్ద ప్రశ్నగా మిగిలిందని ఐక్యరాజ్య సమితి పర్యవేక్షకులు వ్యాఖ్యానిస్తున్నారు. రెండేళ్ళుగా దాడులతో కుదేలైన గాజా పరిస్థితులే ప్రధానంగా చర్చకు వస్తాయని భావిస్తున్నారు. ఇప్పటికి 145కి పైగా దేశాలు పాలస్తీనాను ఒక దేశంగా గుర్తించగా, సోమవారం నాటి సమావేశాల్లో మరో 10కి పైగా దేశాలు పాలస్తీనాను దేశంగా గుర్తించినట్లు ప్రకటించనున్నాయి. గురువారం మధ్యాహ్నం గాజాపై భద్రతా మండలి భేటీ కావచ్చునని భావిస్తున్నారు.

'పనిగంటల పెంపు'పై మండలిలో నిరసనలు

(మొదటిపేజీ తరువాయి)

పెరుగుతుందన్నారు. బొత్స మాట్లాడుతూ పనిలో మహిళలు కూడా 50శాతం ఉండాలనే నిబంధన బిల్లులో పొందుపరచాలని చెప్పారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ శాసనసభలో లోతుగా చర్చించి మండలికి వచ్చిందని, దీనిని అడ్డుకోవద్దని కోరారు. గోపిమూర్తితో పాటు సభ్యులు లేవనెత్తిన అంశాలపై మంత్రి సుభాష్ సమాధానం చెప్పకుండా బిల్లును ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించగా చైర్మన్ జోక్యం చేసుకొని వివరణ ఇవ్వాలని సూచించారు. సభ్యులు లేవనెత్తిన అంశాలపై సవరణలు చేస్తారా? పునరాలోచన చేస్తారా? యధాతధంగా ప్రవేశపెడతారా? అని చైర్మన్ అడిగారు. సుభాష్ పక్కనే ఉన్న మంత్రి మనోహర్ ఏమైనా ఉంటే జివోలో ఇస్తామని చెప్పాలని తెలిపారు. ఇదే సందర్భంలో ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్ జోక్యం చేసుకొని సభ్యుల సలహాలు ఏమైనా ఉంటే జివోలో పొందుపరుస్తామని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల, బొత్స మధ్య కొంత వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ బిల్లు కార్మికులు, మహిళా కార్మికుల ప్రయోజనాలకు చాలా ఇబ్బంది వస్తాయని, కాబట్టి ఇందులో తాము భాగస్వామ్యులం అవ్వబోమని చెప్పి సభ నుంచి వాకౌట్ చేశారు. అనంతరం మంత్రి సుభాష్ బిల్లును ప్రవేశపెడుతున్న సమయంలో బిల్లును వ్యతిరేకిస్తూ గోపిమూర్తి ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ బిల్లుతో పాటు ఫ్యాక్టరీల చట్టం-1948, ఎపి మోటార్ వాహనాల పన్ను విధింపు చట్టం-1963, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అనుసూచిత జనజాతుల కమిషన్ చట్టం-2019 సవరణ, ఎపి భిక్షాటన నిరోధక చట్టం-1977 సవరణ బిల్లులను మండలి ఆమోదించింది.

నూతన కౌలు చట్టం తేవాలి

- కౌలు రైతుల ప్రదర్శన, ధర్నా
- కౌలు రైతులందరికీ 'అన్నదాతా సుఖీభవ' అమలుకు డిమాండ్

విజయవాడలో జరిగిన కౌలు రైతుల ధర్నాలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు బి బలరాం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నూతన కౌలు చట్టాన్ని ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ఆమోదించి, అమలు చేయాలని, 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని ప్రతి కౌలు రైతుకూ ఇవ్వాలని.. కౌలు రైతులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన కౌలు రైతులు విజయవాడ రైల్వే స్టేషన్ నుంచి ఏలూరు లాకులు, గాంధీనగర్ మీదుగా ధర్నా చౌక్‌కు ప్రదర్శనను సోమవారం నిర్వహించారు. అనంతరం ధర్నాచౌక్‌లో రోడ్డుపై బైటాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర నాయకులు బి.బలరాం మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు చర్చించాల్సిన అసెంబ్లీలో కౌలు రైతుల సమస్యల గురించి ప్రస్తావించడం లేదన్నారు. ఏటా కౌలు రైతుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందన్నారు. కౌలు రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం చట్టం చేయాల్సి ఉన్నా, ప్రధాని మోడీ చేసేందుకు సిద్ధంగా లేరన్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో 300 మంది కౌలు రైతులు ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వానికి పట్టలేదన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే కౌలు రైతుల చట్టాన్ని తీసుకురావాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు యజమాని దయాదాక్షిణ్యం కాదన్నారు.

కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గ్రామ సభల్లో కౌలు రైతులను గుర్తించి, కార్డులు మంజూరు చేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారని తెలిపారు. అధికారం చేపట్టిన అనంతరం ముసాయిదా చట్టాన్ని ముందు పెట్టి రైతు, కౌలు రైతు సంఘాల ప్రతినిధుల అభిప్రాయ సేకరణ చేసిందన్నారు. పాత చట్టాన్ని రద్దు చేసి కొత్త చట్టాన్ని తెస్తామని అసెంబ్లీలో వ్యవసాయ శాఖ మంత్రి ప్రకటించి 15 నెలలు దాటినా ఒక్క అడుగు ముందుకు పడలేదని తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ.. భూ యజమానులు చెప్పింది చేయడానికే ఈ ప్రభుత్వాలు ఉన్నాయని, కౌలు రైతుల సమస్యలు వీరికి పట్టడం లేదన్నారు. కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి పోరాటం తప్ప మరో మార్గం లేదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రభుత్వం తెచ్చిన ముసాయిదా చట్టానికి కౌలు రైతుల సంఘం వ్యవసాయ నిపుణులు, రెవెన్యూ అధికారులు, న్యాయవాదులతో చర్చించి 35 సవరణలు ప్రభుత్వానికి నివేదించడం జరిగిందన్నారు. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుని నూతన చట్టాన్ని వెంటనే తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పంటలను ఎక్కువ భాగం సాగు చేస్తుంది కౌలు రైతులేనన్నారు. వీరిని ప్రభుత్వం గుర్తించకపోవడం సరైంది కాదని చెప్పారు. పెట్టుబడి కోసం వ్యాపారులు, ధనికుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి పంటలు పండిస్తున్నారని పేర్కొన్నారు. పంట వేయని భూ యజమానులకు అన్నదాత సుఖీభవ అందిస్తున్న ప్రభుత్వం కౌలు రైతులను విస్మరించడం సిగ్గు చేటని తెలిపారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ.. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని కోరారు. ఆర్‌బిఐ నిబంధనల ప్రకారం రూ.2 లక్షల వరకూ హామీ లేని పంట రుణాలు ఇవ్వాల్సి ఉన్నా బ్యాంక్ అధికారులు అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడం లేదని చెప్పారు. ధర్నా అనంతరం వ్యవసాయ శాఖ మంత్రి పేషీలో వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు పంచకర్ల రంగారావు, కె గోపాల్, పి సుధాకర్, ఎం రామాంజనేయులు, పి రామచంద్రరావు, జి సీతారెడ్డి, ఎం సురేష్‌బాబు, పి కొండయ్య, వెంకటేశ్వర్లు, ఎం నాగమల్లేశ్వరరావు, బాలకోటయ్య, ఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ ఉత్సవ్‌కి దేవాలయ భూముల వినియోగంపై పిటిషన్ డిస్మిస్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విజయవాడ ఉత్సవ్‌కి దేవాలయ భూముల వినియోగంపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. సోమవారం జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. దేవాలయ భూములను కమర్షియల్‌గా వినియోగిస్తున్నారని, వ్యవసాయ భూములను ఎగ్జిబిషన్ పేరుతో వాడటం నిబంధనలకు విరుద్ధమని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. అయితే, ఈ భూములు చాలా కాలం క్రితమే వేలంలో ప్రైవేటు వ్యక్తికి లీజుకు తీసుకున్నారని ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది ఆదినారాయణ రావు తెలిపారు. ఆ భూములతో పిటిషనర్‌కు ఏదైనా నేరుగా సంబంధం ఉందా? అని జస్టిస్ విక్రంనాథ్ ప్రశ్నించారు. లీజుకు తీసుకున్న వారికి, దేవాలయానికి ఏమైనా అభ్యంతరాలు ఉన్నాయా? అని ప్రశ్నించారు. ఎవరికి ఎలాంటి సమస్యలు లేవని, స్థానిక కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటైన సొసైటీ నిర్వహిస్తోందని ప్రభుత్వం తరపు న్యాయవాది తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహించేందుకు 56 రోజులకు గానూ రూ.45 లక్షలు దేవాదాయ శాఖకు చెల్లించినట్లు ఆయన తెలిపారు. భక్తుల పేరుతో అభ్యంతరాలు చెపుతూ పిటిషన్ దాఖలు చేశారని అన్నారు. 12 ఏళ్ల తరువాత జరుగుతున్న విజయవాడ ఉత్సవ్‌ని నిలిపేందుకు రాజకీయ కారణాలతో పిటిషన్ దాఖలు చేశారని పేర్కొన్నారు. వ్యవసాయ భూములు అయితే, రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత ఆలయం చూసుకుంటాయని, మధ్యలో మూడో వ్యక్తుల అభ్యంతరాలు ఎంటని ధర్మాసనం ప్రశ్నించింది. ఇంకా ఏవైనా ఉంటే, రాష్ట్ర హైకోర్టు చూసుకుంటుందని జస్టిస్ విక్రమ్‌నాథ్ పేర్కొన్నారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులపై జోక్యం చేసుకోడానికి విషయమేమి కనబడటం లేదని ధర్మాసనం పేర్కొంది. పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది.

ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

కొనుగోలు చేసిందని, ఆ తర్వాత వ్యాపారులకే వదిలేసిందని తెలిపారు. వారు క్వింటాలును రూ.50 మాత్రమే కొన్న సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. చేసిన ప్రకటన నుంచి ప్రభుత్వం వెనక్కి తగ్గి ఇప్పుడు హెక్టారుకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తామని చెప్పడం రైతులకు ఏ మాత్రమూ ఊరటనివ్వదని తెలిపారు. వ్యాపారులకు లాభం చేకూర్చే విధంగా ప్రభుత్వ నిర్ణయం ఉందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వమే క్వింటాలు ఉల్లిని రూ.3 వేల చొప్పున మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయాలని, రాష్ట్రంలోని రేషన్ కార్డుదారులకు ఉల్లిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. మేకిన్ ఇండియా పేరుతో నరేంద్ర మోడీ మోసగిస్తున్నారని విమర్శించారు. అమెరికా, ఆస్ట్రేలియా నుండి పత్తి, డెయిరీ ఉత్పత్తులు, మొక్కజొన్న ఇతర పంటలను ఎలాంటి పన్నులూ లేకుండా దిగుమతి చేసుకుంటున్నారన్నారు. మనదేశంలో పండించిన పంట ఉత్పత్తులపై అమెరికాలో అధిక సుంకాలను విధిస్తున్నా మోడీ మాట్లాడకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. రైతులను ఆదుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

టమోటా జ్యూస్ ఫ్యాక్టరీని పూర్తి చేయాలి

పత్తికొండలో ఏర్పాటు చేస్తున్న టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ వెంటనే పూర్తి చేయాలని వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రైతుల పండించిన టమోటా పంటకు మద్దతు ధర కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని, దళారుల, కమీషన్ ఏజెంట్ల ప్రమేయం లేకుండా చూడాలని కోరారు. ఈ పర్యటనలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాయి ఉదయ్, రంగప్ప, డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

జీవన సౌరభం

చిన్న ప్రోత్సాహం కూడా కొండంత ఉత్సాహాన్ని నింపుతుంది.

మీ కోసం

పాలలో మీగడ ఎక్కువగా రావాలంటే కాసే ముందు పాలగిన్నెను చల్లటి నీటిలో ఉంచాలి.

రంగుల ప్రపంచం

ఇది రంగుల ప్రపంచం,
ఈ లోకంలో ప్రతి క్షణం
రంగురంగుల అనుభూతులతో
మెరిసిపోతుంది!

మనస్సు ప్రతి భావం
ఆనందపు ప్రతి జ్ఞాపకం
రంగులలో కదలాడుతూ
జీవనాన్ని అలంకరిస్తుంది!

విశ్వానందమే అసలైన రంగు
అది లేకుంటే ఈ ప్రపంచం
ఆనందాలన్నింటినీ కోల్పోతుంది!

ఎరుపు - ధైర్యానికి ప్రతీక
తెలుపు - శాంతికి, స్వచ్ఛతకు ప్రతిరూపం
కాషాయం -త్యాగానికి నిదర్శనం
ఆకుపచ్చ - అభివృద్ధికి, ఆశకు చిహ్నం!

ప్రతి రంగూ ఓ జీవన గీతం
ప్రతి రంగూ ఒక కొత్త అర్థం!

రంగుల జ్యోత్స్నలో ఎన్నో ఆనందాలు
జీవితం మరింత మధురం అవుతుంది
ప్రపంచమంతా రంగులతో కదులుతూ,
ప్రతి మనస్సు రంగులలో మునిగి తేలాలి!



– మాన్వి,
9వ తరగతి,
నవోదయ విద్యాలయ సమితి,
దేవరాల, భివాని, హర్యానా.

తేడాలు గుర్తించండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన రెండు బొమ్మల్లో ఐదు తేడాలు ఉన్నాయి. గుర్తించండి మరి.

నేను గీసిన బొమ్మ

ఎం.కుష్మిత,
2వ తరగతి,
విద్యాలయ స్కూలు,
గుడివాడ,
కృష్ణా జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

బెల్లంతో బోలెడు ప్రయోజనాలు

బెల్లంతో అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. వైద్యులు సైతం కొంతమంది పేషెంట్లకు పంచదారకు బదులు బెల్లం తీసుకోమని చెబుతుంటారు. అందులోని ఔషధ గుణాలు శరీరానికి మేలు చేస్తాయి. బెల్లంలో యాంటీ ఆక్సిడెంట్లు, మినరల్స్, ఐరన్, జింక్, కాల్షియం, పొటాషియం, సోడియం వంటి పోషకాలుంటాయి. రుచికి మాత్రమే కాదు, ఆరోగ్యాన్ని పెంపొందించే స్వచ్ఛమైన బెల్లాన్ని ఎంపిక చేసుకోవడం మంచిది. బెల్లంలో ఉండే ముఖ్య ధాతువు ఐరన్. ఇది శరీరంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి సహాయ పడుతుంది. రక్తహీనతతో బాధపడేవారు బెల్లం తీసుకోవడం ద్వారా అధిక ప్రయోజనం ఉంటుంది.

బెల్లంలోని యాంటీ ఆక్సిడెంట్లు, ఖనిజాలు సైటోప్రొటెక్టివ్ నాణ్యతను అందిస్తాయని అధ్యయనాల్లో తేలింది. అంటే ఊపిరితిత్తుల నుండి శ్లేష్మాన్ని తొలగించడమే కాకుండా లోపలి నుంచి శ్వాస కోశ, జీర్ణ వ్యవస్థలను శుభ్రపరచడంలో దోహదపడతాయి.

ప్రతిరోజూ ఒక్కసారైనా బెల్లం తీసుకుంటే అది శరీరం మొత్తాన్ని శుభ్రపరుస్తుంది. భోజనం తర్వాత కొంతమందికి బెల్లం ముక్క నోట్లో వేసుకోవడం అలవాటు.. బెల్లం జీర్ణాశయంలో ఎంజైమ్‌ల విడుదలకు దోహద పడుతుంది. తద్వారా జీర్ణ సమస్యలు, మలబద్ధక సమస్యలు నయమవుతాయి. బెల్లంలో యాంటీ మైక్రోబయల్ గుణం వల్ల నిద్రించే ముందు బెల్లం తినడం వల్ల చర్మం ప్రభావవంతంగా మారుతుంది. రాత్రి పాలలో బెల్లం కలిపి తాగితే మంచి నిద్ర పడుతుంది. ఉదయాన్నే శక్తివంతంగా ఉంటారు. సి విటమిన్‌కు సంబంధించిన మూలం బెల్లంలో ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. బెల్లంలోని పొటాషియం, సోడియం, ఐరన్ రక్తపోటు నియంత్రణలో సహాయపడతాయి. హైపర్‌టెన్షన్ సమస్యనూ దూరం చేసుకోవచ్చు.

ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నియంత్రిస్తుంది. బరువు పెరగడాన్ని, ఊబకాయం ప్రమాదాన్ని తగ్గిస్తుంది. బెల్లం తీసుకోవడం వల్ల ఎక్కువసేపు కడుపు నిండుగా ఉన్నట్లు అనిపిస్తుంది. బరువు తగ్గేందుకు ప్రయత్నిస్తున్నవారు బెల్లం తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. గ్లాసు పాలు లేదా నీటిలో బెల్లాన్ని కలిపి తాగితే పొట్టను చల్లబరిచి గ్యాస్ ఉబ్బరాన్ని నివారిస్తుంది. గ్యాస్ సమస్య ఉన్నవారు ప్రతిరోజూ భోజనం తర్వాత బెల్లం తీసుకోవడం తప్పనిసరి చేసుకోవాలి. శక్తి కోసం లేదా నీరసం, బలహీనత లక్షణాలు కనిపించగానే బెల్లం సేవించినట్లయితే ఎనర్జీ లెవెల్ త్వరగా పెరుగుతుంది. రోజంతా పనిచేసిన తర్వాత అలసటగా అనిపిస్తే వెంటనే బెల్లాన్ని తింటే మంచి ఫలితం ఉంటుంది.

హలో..
మీరు బెల్లం వాడుతున్నారా? అయితే మీకు మంచే జరుగుతుంది. పంచదార కంటే బెల్లం ఉపయోగించటం మేలని వైద్యులు చెబుతున్నారు. బెల్లంలో ఉన్న ఔషధ గుణాలు మన శరీరానికి అవసరమైన పోషకాలను కూడా అందిస్తాయి. షుగర్ లెవల్స్ కూడా చాలా తక్కువగా ఉంటాయి. అందుకే ఈ మధ్యకాలంలో బెల్లం వినియోగం పెరిగిందనేది గణాంకాలను బట్టి తెలుస్తోంది.

పుదీనా ... ఔషధ ఖజానా

ఆకుకూరల్లోని పుదీనాలో ఎన్నో ఔషధ గుణాలున్నాయి. మన శరీరానికి అవసరమైన ఖనిజ లవణాలు, ఐరన్ వంటివి కూడా ఇందులో పుష్కలంగా ఉన్నాయి. అందుకే కూరల్లోనూ, పచ్చళ్లలోనూ పుదీనాను విరివిగా వినియోగించుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తుంటారు. ఆకుకూరలతోపాటుగా మనం వండుకునే అన్ని కూరల్లోనూ పుదీనాను ఎంతోకొంత మేర వినియోగించుకోవచ్చు. తద్వారా శరీరానికి మంచి ఔషధ గుణాలు అందుతాయి. పుదీనాను సమతూకంలో వినియోగించుకోవటం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

తోటకూర, గోంగూర, బచ్చలికూరలతోపాటుగా పుదీనా కూడా వంటల్లో విరివిగానే ఉపయోగిస్తుంటారు. ఆరోగ్యమైన ఆహారం అందించటంలోనూ, వంటలకు మంచి సువాసన అందించడంతో పాటు, అనేక అరోగ్య ప్రయోజనాలున్నాయని మనందరికీ తెలుసు. ఇవి చర్మ, కేశ సంబంధిత సమస్యలనూ పరిష్కరిస్తాయి. ఈ ఆకులను మాయిశ్చరైజర్లు, క్లెన్సర్లు, లిప్‌బామ్, షాంపు, కండిషనర్ల తయారీలో వాడతారు. పుదీనాలో అనాల్జెసిక్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీమైక్రోబియాల్, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు మెండుగా ఉంటాయి. అయితే పుదీనా వల్ల చర్మం, కేశాలకు కలిగే కొన్ని ప్రయోజనాలు తెలుసుకుందాం.

- **ముఖం కాంతివంతం :** పుదీనా బ్లాక్‌హెడ్స్‌ను శుభ్రంగా తొలగిస్తుంది. కొన్ని ఆకులకు చిటికెడు పసుపు కలిపి ముద్ద చేయాలి. దీనిని ముఖానికి రాసుకొని, చేతి వేళ్లతో కాసేపు మృదువుగా మర్దన చేయాలి. తర్వాత శుభ్రమైన నీటితో కడిగేయాలి. వారానికి రెండుసార్లు ఇలా చేస్తూవుంటే బ్లాక్‌హెడ్స్ తగ్గి ముఖం కాంతివంతంగా కనిపిస్తుంది.
- **మొటిమలు, మచ్చలు మాయం :** పుదీనా ఆకుల్లోని యాంటీ బాక్టీరియల్ లక్షణాలు మొటిమలను కలిగించే కణాలను తొలగిస్తాయి. చర్మంపై నల్లని మచ్చలు, ఇతర మరకలను తగ్గిస్తాయి. కొన్ని పుదీనా ఆకులను నలిపి మొటిమలపై రాయాలి. క్రమం తప్పకుండా ఇలా చేస్తే కొద్దిరోజుల్లో మొటిమలు, మచ్చలు పూర్తిగా తొలగిపోతాయి.
- **చర్మం మృధువు :** పుదీనాలో ఉండే యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు, ఇతర గుణాల వల్ల మృతకణాలు తొలగిపోతాయి. ఇవి బాక్టీరియాను చంపి చర్మాన్ని మృదువుగా, ఆరోగ్యవంతంగా చేస్తాయి. కొన్ని పుదీనా ఆకులకు చిటికెడు పసుపు, కొన్ని చుక్కలు రోజ్ వాటర్ కలిపి ముద్ద చేయాలి. దీనిని ముఖం, మెడకు రాసుకుని 15 నిమిషాల తర్వాత కడిగేయాలి.
- **ముడతలు మాయం :** పుదీనా ముఖంపై నుండి ఫ్రీ రాడికల్స్‌ను తొలగిస్తుంది. వయసు రీత్యా వచ్చే ముడతల నుంచి సంరక్షిస్తుంది. పుదీనా ఆకులను నీళ్లలో మరిగించి, చల్లార్చాలి. ఈ నీటిని ముఖానికి రాసుకోవాలి.
- **అలెర్జీలకు ఉపశమనం :** కాలిన గాయాలు, ఎలర్జీలకు ఇది మంచి నివారణ. పుదీనా ఎలర్జీ కలిగించే బాక్టీరియాను చంపుతుంది. ఆకులను మెత్తగా నూరి ప్రభావిత ప్రాంతంపై రాసుకోవడం ఈ సమస్యకు అత్యుత్తమ పరిష్కారం.
- **జుట్టు సంరక్షణ :** యాంటీ ఆక్సిడెంట్ గుణాలు మెండుగా ఉండే పుదీనా ఆకులు జుట్టు రాలడాన్ని అరికట్టడమే కాకుండా, ఎదుగుదలకు తోడ్పడతాయి. పుదీనా ఆకులను మరిగించిన నీటిని జుట్టు, మాడుకు బాగా మర్దన చేసుకోవాలి. పది నిమిషాల తరువాత మామూలు నీటితో కడిగేయాలి.

ఇలా చేయడం వల్ల మాడుపై ఇన్ఫెకన్లూ తగ్గుతాయి. ఇది జుట్టుకు మంచి కండిషనర్‌లా పనిచేస్తుంది. వారానికి రెండుసార్లు ఇలా చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.



ఆకట్టుకున్న 'ఓజీ', 'కాంతార 2' ట్రైలర్లు

పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటించిన 'ఓజీ'. సుజీత్ దర్శకత్వం వహించిన చిత్రం ఈనెల 25న థియేటర్లలోకి రానుంది. ఇప్పటికే ప్రమోషన్ల రూపంలో పాటలు, స్టిల్స్ వదిలారు. హైదరాబాద్‌లో ఆదివారం ప్రీ రిలీజ్ ఈవెంట్ కూడా చేశారు. ట్రైలర్ చూస్తుంటే ముందునుంచి చెప్పినట్లే యాక్షన్, తమన్ బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్‌తో వచ్చింది. ఇమ్రాన్ హష్మీ ప్రెజెన్స్ బాగుంది. ప్రకాష్‌రాజ్, శ్రియారెడ్డి, ప్రియాంక మోహన్ తదితరుల సీన్స్ కూడా ట్రైలర్‌లో చూపించారు.

2022లో ఎలాంటి అంచనాల్లేకుండా వచ్చి బ్లాక్ బస్టర్ అందుకున్న సినిమా 'కాంతార'. దీని ప్రీక్వెల్‌ని 'కాంతార ఛాప్టర్ 1' పేరుతో తీశారు. రిషబ్‌శెట్టి హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించగా.. హోంబలే ఫిల్మ్స్ భారీ బడ్జెట్‌తో నిర్మించింది. అక్టోబరు 2న ఈ సినిమా థియేటర్లలోకి రానుంది. ప్రభాస్ చేతుల మీదుగా తెలుగు ట్రైలర్ రిలీజ్ చేశారు. రిషభ్‌శెట్టి స్క్రీన్ ప్రెజెన్స్...రుక్మిణి వసంత్ నటన ఆకట్టుకునేలా ఉన్నాయి. ప్రతినాయకుడి పాత్రలో గుల్షన్ దేవయ్య గంభీరంగా కనిపించారు. 'కాంతార' తొలి భాగంలో ప్రస్తుతం ఏం జరిగిందా? అనే డ్రామాని సింపుల్‌గా చూపించారు. ఈసారి మాత్రం రాజులు, యుద్ధాలు, రాజకుమారితో హీరో ప్రేమలో పడటం... ఇలా చాలా అంశాలు ఉంటాయని చిత్ర యూనిట్ తెలిపింది.

చిరంజీవి 47 ఏళ్ల సినీ ప్రస్థానం



'22 సెప్టెంబర్ 1978 'కొణిదెల శివ శంకర వరప్రసాద్' అనబడే నేను..ప్రాణం ఖరీదు.. చిత్రం ద్వారా 'చిరంజీవిగా' మీకు పరిచయం అయ్యి నేటితో 47 ఏళ్లు దిగ్విజయంగా పూర్తయ్యాయి. ఈ చిత్రం ద్వారా నాకు నటుడిగా ప్రాణం పోసి.. మీ అన్నయ్యగా, కొడుకుగా, మీ కుటుంబ సభ్యుడిగా, ఒక మెగాస్టార్‌గా.. అనుక్షణం నన్ను ఆదరించి, అభిమానించిన తెలుగు సినిమా ప్రేక్షకులకు నేను ఎల్లప్పుడూ కృతజ్ఞుడనై ఉంటాను. నేటికి 155 సినిమాలను నేను పూర్తి చేసుకున్నాను అంటే... నిస్వార్థమైన మీ ప్రేమే అందుకు కారణం. ఈ 47 ఏళ్లలో నేను పొందిన ఎన్నో అవార్డులు, గౌరవ మర్యాదలు నావీ కావు, మీ అందరివీ, మీరందించినవి. మనందరి మధ్య ఈ ప్రేమానుబంధం ఎల్లప్పటికీ ఇలాగే కొనసాగాలి అని కోరుకుంటూ... కృతజ్ఞతలతో మీ చిరంజీవి' అంటూ పోస్ట్ చేశారు. ఈ ట్వీట్ నెట్టింట వైరల్‌గా మారింది. మెగాస్టార్‌గా అభిమానుల గుండెల్లో పేరు సంపాదించుకున్న చిరంజీవి.. ప్రస్తుతం విశ్వంభర, మన శివశంకర వరప్రసాద్ గారు అనే సినిమాలు చేస్తున్నారు. 70 ఏళ్ల వయసులోనూ కథానాయకుడిగానే రాణిస్తున్నారు.

అక్టోబర్‌లో వెంకటేష్ కొత్త సినిమా షూటింగ్

కథానాయకుడు వెంకటేష్ నటిస్తున్న కొత్త సినిమా 'వెంకీ 77' షూటింగ్ అక్టోబర్ మొదటి వారంలో ప్రారంభం కానుంది. త్రివిక్రమ్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కనుంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ఈ సినిమా షూటింగ్‌ను లాంఛనంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. వెంకటేష్ నటించి త్రివిక్రమ్ శ్రీనివాస్ డైలాగ్స్ అందించిన 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' సినిమాలు బ్లాక్‌బస్టర్‌గా నిలిచాయి. హైదరాబాద్‌లో మొదటి షెడ్యూల్ కొనసాగనుందని సమాచారం. శ్రీనిధిశెట్టి కథానాయిక. హారికా అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాత ఎస్.రాధాకృష్ణ తెరకెక్కించనున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రానికి హర్షవర్ధన్ రామేశ్వర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించబోతున్నారు. ఈ ఏడాది 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకున్న వెంకటేష్ పలు కొత్త సినిమాల్లో నటిస్తున్నారు. త్రివిక్రమ్– వెంకీ కాంబో ఎలాంటి వినోదాన్ని అందించబోతుందనేది సర్వత్రా ఆసక్తి నెలకొంది.

రేసర్‌గా శర్వానంద్

కథానాయకుడు శర్వానంద్ మరో వైవిధ్యభరితమైన కథా చిత్రంలో నటించబోతున్నారు. సైకిల్ రేసర్‌గా కనిపించబోతున్నారు. అభిలాష్ కంకర దర్శకత్వంలో వస్తున్న సినిమా నటిస్తున్న 36వ చిత్రం. స్కిల్డ్ మోటార్ సైకిల్ రేసర్‌గా శర్వా నటిస్తున్న ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ నిర్మిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. శర్వా, టీమ్‌పై సైకిల్ రేస్‌కు సంబంధించిన కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సన్నివేశాలు సినిమాకి ప్రధాన ఆకర్షణగా ఉండబోతున్నాయి. యూనిక్ క్యారెక్టర్స్‌తో ఆకట్టుకునే శర్వా ఈ చిత్రంలో ఓ ఛాలెంజింగ్ క్యారెక్టర్ చేస్తున్నారు. మాళవిక నాయర్ కథానాయిక. బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి కీలక పాత్రలు పోషిస్తున్నారు. వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న ఈ హై-ఎనర్జీ మూవీ మోటోక్రాస్ రేసింగ్ బ్యాక్‌డ్రాప్‌లో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తుందనీ, తప్పకుండా అందర్నీ మెప్పిస్తుందనే నమ్మకంతో ఉన్నామని చిత్ర యూనిట్ తెలిపింది. రచన, దర్శకత్వం అభిలాష్ కంకర, నిర్మాతలు వంశీ–ప్రమోద్, సమర్పణ విక్రమ్, సంగీతం: జిబ్రాన్, డిఓపి యువరాజ్, ప్రొడక్షన్ డిజైనర్ రాజీవ్, ఎడిటర్ అనిల్‌కుమార్ పి., ఆర్ట్ డైరెక్టర్ ఎ.పనీర్ సెల్వం.

రికార్డుపుటల్లో అభిషేక్ శర్మ

- 20 ఇన్నింగ్స్, 331 బంతుల్లోనే 50 సిక్సర్లు
- తొలి క్రికెటర్‌గా గుర్తింపు

దుబాయ్: ఆసియా కప్–2025 టోర్నమెంట్‌లో టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ అదరగొడుతున్నాడు. ఆదివారం పాకిస్తాన్‌తో జరిగిన సూపర్–4 మ్యాచ్‌లో ఐదు సిక్సర్లతో చెలరేగి ఆడి టీమిండియా గెలుపులో కీలకపాత్ర పోషించిన అభిషేక్ శర్మ... రెండు రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. అంతర్జాతీయ టి20ల్లో కేవలం 20 ఇన్నింగ్స్, కేవలం 331బంతుల్లోనే 50సిక్సర్లు కొట్టిన తొలి బ్యాటర్‌గా రికార్డు పుటల్లోకెక్కాడు. దీంతో అంతర్జాతీయ టి20 ఫార్మాట్లో.. అతి తక్కువ బంతుల్లోనే 50 సిక్సర్లు పూర్తి చేసుకున్న తొలి క్రికెటర్‌గా చరిత్రకెక్కాడు. అంతేకాదు తక్కువ ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాడిగా ఎవిన్ లూయాస్(వెస్టిండీస్) సరసన అభిషేక్ నిలిచాడు. దుబాయ్ వేదికగా ఆదివారం నాటి మ్యాచ్‌లో అభిషేక్.. పాక్ బౌలర్లపై తన ప్రతాపాన్ని చూపించాడు. కేవలం 39 బంతులు ఎదుర్కొని.. ఆరు ఫోర్లు, ఐదు సిక్సర్ల సాయంతో 74 పరుగులు సాధించాడు. మరో ఓపెనర్ శుబ్‌మన్ గిల్ (28 బంతుల్లో 47)తో కలిసి తొలి వికెట్‌కు వందకు పైగా పరుగులు జతచేసి టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించాడు. లీగ్ దశలో తొలుత యూఏఈపై ప్రతాపం చూపించిన ఈ ఎడమచేతి వాటం బ్యాటర్.. 16 బంతుల్లోనే 30 పరుగులు సాధించాడు. ఆ తర్వాత పాకిస్తాన్‌తో మ్యాచ్‌లో అభిషేక్ శర్మ విజృంభించాడు. కేవలం 13 బంతుల్లోనే 31 పరుగులు సాధించి.. తన సత్తా ఏమిటో చూపించాడు. అనంతరం ఒమన్‌పై 15 బంతుల్లోనే 38 పరుగులు చేసిన అభిషేక్ శర్మ.. తాజాగా సూపర్–4లో భాగంగా పాకిస్తాన్‌కు మరోసారి విశ్వరూపం చూపించాడు.

టి20ల్లో తక్కువ బంతుల్లోనే 50 సిక్సర్లు కొట్టిన బ్యాటర్లు...

331 : అభిషేక్ శర్మ (ఇండియా)
366 : ఎవిన్ లూయాస్ (వెస్టిండీస్)
409 : ఆండ్రీ రసెల్ (వెస్టిండీస్)
492 : హజ్రతుల్లా జజాయ్ (అఫ్గనిస్తాన్)
509 : సూర్యకుమార్ యాదవ్ (ఇండియా)

తక్కువ ఇన్నింగ్స్‌లో 50సిక్సర్లు

20	అభిషేక్ శర్మ	ఇండియా
20	ఎవిన్ లూయాస్	వెస్టిండీస్
22	హజ్రతుల్లా జజాయ్	ఆఫ్ఘనిస్తాన్
25	క్రిస్ గేల్	వెస్టిండీస్
29	సూర్యకుమార్ యాదవ్	ఇండియా

దివ్యకు జాక్‌పాట్

ఫిడే ప్రపంచకప్‌లో వైల్డ్‌కార్డ్ ఎంట్రీ

నాగ్‌పూర్: 19ఏళ్ల దివ్య దేశ్‌ముఖ్ జాక్‌పాట్ కొట్టింది. గోవా వేదికగా జరిగే ఫిడే ప్రపంచకప్‌లో ఆడేందుకు చివరి నిమిషంలో బెర్త్ లభించింది. 19ఏళ్ల దివ్య దేశ్‌ముఖ్ ఫిడే ప్రపంచకప్ వైల్డ్‌కార్డ్ ఎంట్రీ లభించినట్లు ప్రపంచ చెస్ సమాఖ్య(ఫిడే) సోమవారం ప్రకటించింది. చైనా మహిళా గ్రాండ్‌మాస్టర్లు జూ–వెన్ జూన్, హో ఇఫాన్ చివరి నిమిషంలో టోర్నీ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించడంతో దివ్యకు చోటు దక్కినట్లు ఫిడే ఆ ప్రకటనలో పేర్కొంది. ఇటీవల ముగిసిన ఫిడే మహిళల స్విస్‌లో రాణించి భారత 20వ మహిళా గ్రాండ్‌మాస్టర్‌గా దివ్య దేశ్‌ముఖ్ నిలిచిన సంగతి తెలిసిందే. రెండేళ్లకు ఒకసారి జరిగే ఫిడే ప్రపంచకప్‌లో ప్రపంచవ్యాప్తంగా 206 అగ్రశ్రేణి చెస్ గ్రాండ్‌మాస్టర్లు పోటీపడనున్నారు. మూడు వారాలపాటు జరిగే ఈ టోర్నీ నాకౌట్ ఫార్మాట్, మినీ మ్యాచ్‌లలో జరగనుంది. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన గ్రాండ్‌మాస్టర్లు 2026 క్యాండిడేట్ టోర్నీకి అర్హత సాధిస్తారు. అలాగే ప్రపంచ టైటిల్‌కు పోటీపడేందుకు అర్హత సాధిస్తాడు. భారత్ చెస్ ప్రపంచకప్‌కు ఆతిథ్యమివ్వడం ఇది రెండోసారి. 2002లో తొలిసారి భారత్‌కు ఆతిథ్య హక్కులు దక్కాయి. అప్పట్లో ఈ టోర్నమెంట్ హైదరాబాద్ వేదిక జరిగింది. 2025లో గోవా వేదికగా అక్టోబర్ 31 నుంచి నవంబర్ 27వరకు ఫిడే ప్రపంచకప్ రెండోసారి భారత్‌లో జరగనుంది.

బెంగళూరు, యుపి గెలుపు

జైపూర్: ప్రొ కబడ్డీ సీజన్–12 పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. సవాయ్ మాన్‌సింగ్ ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన లీగ్ పోటీల్లో బెంగళూరు బుల్స్ జట్టు గుజరాత్ జెయింట్స్‌పై, యుపి యోధాస్ జట్టు తమిళ్ తలైవాస్‌పై విజయం సాధించాయి. ఏకపక్షంగా జరిగిన తొలి మ్యాచ్‌లో యుపి జట్టు 39–22 పాయింట్ల తేడాతో తమిళ్ తలైవాస్‌ను ఓడించింది. యుపి జట్టు ఏకంగా 4సార్లు తమిళ్ జట్టును ఆలౌట్ చేయగా.. రైడ్‌ల ద్వారా 18, ట్యాకిల్స్ ద్వారా 15పాయింట్లు సాధించింది. ఇక తమిళ్ జట్టు రైడ్‌ల ద్వారా 11, ట్యాకిల్స్ ద్వారా 10 పాయింట్లు మాత్రమే సాధించినా.. ప్రత్యర్థి యుపి జట్టును ఒక్కసారి కూడా ఆలౌట్ చేయలేకపోయింది. హోరాహోరీగా సాగిన మరో పోటీలో బెంగళూరు జట్టు 28–24పాయింట్ల తేడాతో గుజరాత్‌ను చిత్తుచేసింది. ఇరుజట్లు ఒక్కసారి కూడా ఆలౌట్ కాలేదు. బెంగళూరు రైడ్‌లద్వారా (13), ట్యాకిల్స్‌ద్వారా (14)పాయింట్లు సాధిస్తే.. గుజరాత్ రైడ్‌ల ద్వారా 12, ట్యాకిల్స్ ద్వారా 11పాయింట్లు మాత్రమే సాధించి ఓటమిపాలైంది. ఈ గెలుపుతో బెంగళూరు బుల్స్ 9మ్యాచుల్లో 5విజయాలతో సహా 10 పాయింట్లతో 4వ స్థానానికి ఎగబాకింది.

ప్రొ కబడ్డీలో నేడు..
గుజరాత్ జెయింట్స్ × తెలుగు టైటాన్స్(రాత్రి 8.00గం॥లకు)
జైపూర్ పింక్‌ప్యాంథర్స్ × యు ముంబ(రాత్రి 9.00గం॥లకు)

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68